THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204905
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No.  Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

# కష్టకాలం

(సాంఘిక నాటకం)

రచయిత:

వేదాంతకవి

పబ్లిషర్సు:

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి

1946

[హక్కు]లు గ్రంథకర్తవే ] [ రు 1—8—0

# సమాప్

కులాల్లో, మతాలకి
కూలిపోతున్న
లోగిళ్ళకోసం
ఈ కష్టకాలాన్ని చూపిస్తున్నా
పనీ పాటా లేక బలిసిన
సోమర్లంతా
ఏం చేస్తారో చూస్తా
వేదాంతకవి

# హెచ్చరిక

నా లిఖిత పూర్వకమైన అనుమతి లేనిదే, యెవ్వరూ యీనాటకాన్ని యెక్కడా ప్రదర్శించకూడదు ఏవిధంగానూ ప్రకటించు కొనరాదు. ఏమాదిరిగానూ ఉపయోగించు కొనరాదు.


కవితా సంస్థానము
బెజవాడ
1946



వేదాంతకవి
అను
వేదాంతం వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి



శ్రీ కొండపల్లి ప్రెస్, రాజమండ్రి-ఇ. జి 14 పునర్ముద్రణ 200ం-

# వేదాంతకవికి ప్రే

దేశకాల పాత్రల ప్రకృతిని తెల్సుకొని, కల్పుకొని తెనుగు రంగాన నాటకలేఖినీ స్వరాన్ని వినిపిస్తున్నది తెనుగు నాటక కర్తల్లో ఒక వేదాంతకవే నేమో!

తెనాలి, 19-6-44.

సాహితీచరణచారణ
చక్రవర్తి

# ప్రతిజ్ఞ

1. ప్రతిజ్ఞ పట్టడం ప్రజ్ఞాప్రదర్శనానిగ్గాదు. బిరుదులు తెచ్చి పెట్టుకోంటానిగ్గాదు. అఖండమైన సాహిత్యాల్ని నిజం ముందు నిలబెట్టు కోంటానికండోయ్.

2 విద్యాజగత్తు పుట్టినప్పటినుంచీ పండితుల్నీ, కవినీ, విడదీసి పిలుస్తున్నారుగానీ; కవిత్వాన్నీ, సాహిత్యాన్నీ విడదీయలేక పోతున్నారు. నేను పుట్టింది కేవలం ఈ ప్రతిజ్ఞ పట్టి పాలించటానికే.

3. విద్యాప్రపంచంలో మోసాల్నీ, మాయవేషాల్ని తుడిచి పారేస్తే హృదయాల్ని కడిగి శుభ్రం చేసుకోవచ్చు. విద్యాప్రపంచంలో మడికట్టుకొని శాపనార్థాల్లో గొంతులు చించుకొంటున్నవాళ్ళు శ్రుతిచెడి రాగాన పడ్డారు

4. ఇది రేడియోయుగం; ఈ రేడియోతో ప్రపంచమంతా వొకే ప్లాటుఫారమైంది. కనుక నా నాటకాలు ప్రపంచ ప్లాటుఫారం కోసం ప్రతిజ్ఞలు పడతేగాని, కేవలం తాము తోడుక్కొన్న ఆధారాల కోసం పట్టుపట్టవు.

5. నటరాజులు నామాట చెవి కెక్కిస్తే లోకమెట్లా కనిపిస్తుందో చూడండి.

వేదాంతకవి

# కృతిసమర్పణము

[illegible]

భువనాలే తొలికోడి మేలుకొలుపుల్
ముత్యాల పందిళ్ళలో
శ్రవణానందముఁ జేసి నిన్ను గనెనో
స్వామీ ! జగద్బాంధవుం
డవుగా దర్శన మిచ్చుచుంటివి; కళా
నారీప్రభాతమ్ము నీ
చివురాకుల్ చిఱునవ్వు పూలు తలఁ దాల్చెన్
లతలన్ లక్ష్మియా !

నీ చల్లచల్లని నీడలో తాపాలు
పాలకడలి కెరటాలువోలె
నీ కమ్మకమ్మని నెలవులోఁ బ్రాణాలు
సహకార దివ్య రసాలువోలె
నీ చక్కచక్కని రాచగుమ్మాలలో
అసువులు బంగారు పసులువోలె
నీ పచ్చపచ్చని కావులో లోకాలు
ఘనకావ్య శాకపాకాలు వోలె
నీ యనన్య లావణ్య మాణిక్యమాలి
కా మయూఖ రేఖాపతాకమ్ము క్రింద
మముకుచున్నవి కష్టకాలమునఁగూడ
సన్నగుణశేయ ! లక్ష్మయ్య వాసుదేవ

తియ్యని చక్కనయ్యవు త్వదీయకళా
రుధిరమ్ము పిండి త్యా
గయ్యగ నిల్చినయ్యవు మహాత్మ !
యుగాలు యుగాలు వడ్డవె
మొయ్యవె నీఋణమ్మునిక, మొత్తను
గాచెడి పిచ్చికుక్కనై
ఇయ్యెడ లక్ష్మయాఖ్య పృథివీశ్వర !
నీఋణ మెట్లు తీరునో !
త్యాగము లెన్నొ నీయమృత హస్తము
వట్టుచు ముద్దులెట్టె యీ
భోగరసాలసాల మృదుమోహన
గానము లిసెగాని, బా
గోగులకైన నీ చరితమొండ్చెన
కొండలగుండె బ్రద్దలై
వాగులు కానటయ్య ! లయవార్ధులు
పొంగవటయ్య ! లక్ష్మయా !
నీ హృదయమ్ము ప్రవాహమ్ముగా లేచి
సుడిగుండములు చేయుచోటనైన
నీ త్రినేత్రమె యగ్నిహోత్రమ్ముగా లేచి
చీకట్లు చి చెడు సమునైన
నీ నీలికంఠమ్ము గానాలుగా లేచి
ప్రాణాలు తోడెడు నసుధనైన
నీ పిచ్చిబెయ్యి భిక్షాపాత్రగా లేచి
సిగ్గుబజారుకి ప్రసిద్ధనైన
నిను కన్నటిబొట్లు కన్పించు పకట
ఏ తపనానలోఁ గలసిపో మనో వివిక్తి

నీ మనస్సు తపస్సుల నిలయా మేము
కట్టినావయ్యా; లక్ష్మయ్యా! కంచుకోట
నోచిననోముపంటకు మనోహర
మైన ప్రసన్న రేఖలో
నీ చిఱునవ్వుతొల్కరి తృణీకృత
బ్రహ్మను గాంచి యెంతయో
వాడెడి దేశమాత పడుపాట్లను దీర్చెడి
మాడ్కి పెంచి, దో
బూచుల పొట్టపెట్టుకొనె భూమి సముద్రము
జేసి లక్ష్మయా!
ఇనుపపదాలక్రింద నలియించెడి
చెడ్డదినాలు వచ్చెనో
మ్మ నలిగి బొత్తిగా సమసిపోయిన
చీమకు నీ వరాల నా
యన మృదుపాద ముద్రలలో హాయిగ
ప్రాణము వచ్చెనంట; యీ
తనయునిగూర్చి చీమలు సతమ్ముగ
లక్ష్మనా యెంత యేడ్చెనో!
ఇంత యశోవిశాల భువనైకమనోజ్ఞ
కిశోరమూర్తి ని
న్నెంత సముద్రరాజుగ మహిన్ మురి
పెంచెడిదారి కెక్కె ది
గ్దంతులగుండె బ్రద్దలయి క్రమ్మెడి
చీకటి గాలివానలో
వింతసుఖైకసౌధము గుభిల్లున గూలిచి
పోయె లక్ష్మయా!

ఎత్తినయెత్తు లేరికి మఱేమియుఁ దేలక
విభ్రమంబులో
మత్తిలియున్న యీజగతి మాయల
గారడివాఁడు పెద్దగ
మ్మత్తులు చేసిఁ లాభ మినుమంతయుఁ
గాంచక వానిముద్దు గే
కెత్తెడి బిడ్డగొంతు కష కిమ్మొయిఁ
గోసెనో యేమొ లక్ష్మియా!

బొటబొట కారుచున్న నగుమోముల
నాయన వేడిరక్త మి
చ్చటఁ బ్రవహించి యే ప్రళయసాగర
ఘోషలు మిన్నుముట్టెనో
గుటకలువేయకుండ బుధకోటి హలాహాక
వాహనాలపై
నిట కరుగెంచుచున్ పిడుగు లెల్లెడ
రాల్చెనుగాదె లక్ష్మియా!

నీ నగుమోములయ్యొ జననీమణి చల్లని
గుండెయున్న యీ
మానని దెబ్బతో పగిలి మండదె మేదిని
యెల్ల గాయమై
దీనికి మాత్ర మేమొ కదు తేటగ దేవుఁడు
జూచె నేని నే
డీ నొవగార్చు వుండును మఱెన్నఁడు
మాన్పగ లేదు లక్ష్మియా!

భువిపై కష్టములెల్ల నీకడను జొమ్ముల్
పుష్టిఁబట్టించు కొ

న్నవి కాంబోజులును చిన్నిలక్ష్మయ్య వోరా!
నానాయుధాలెత్తి లే
చి విధాతృం డెవఁడో కనుఁగొనుటకై
జీమూతసంఘాలుగా
దివిపై కేగెను; పుష్పవృష్టి దిగ ఖ్యాతిన్
గష్టకాలమ్ములన్
ఎన్నిపాలాలు మున్ను మొలకెత్తి సహింపని
దెబ్బతిన్నవో
అన్నియుఁ దిగ్గ లేచినవి హాయిగ నేఁ డిల
ఇంతవింత సం
పన్నకళాప్రపంచ పరిపాలన శాసన
చక్రవర్తిలో
ఇన్ని మహాద్భుతమ్ములు మఱెక్కడ
దాగిన వయ్యా లక్ష్మణా!
ఈ గిజిగాఁడు గూండ్లను మఱెంత
మనోహరమైన చెట్లపై
రేగిన రాగధోరణి గుఱించి సదా
కులికించి యెక్కడో
డాగెడి గాలివానను తటాలున
మీఁదకుఁదెచ్చి యెంత శా
రాగృహమందు ముంచెను పరాత్పరుఁ
డెల్ల జగాలు భూవరా!
ఈనీలిమునుఁగులో తూనీఁగలను లేపి
ముసినవ్వువెన్నెల పసిమిఁజూపె
ఈచింత తోపులో రాచవారని బిల్చి
ప్రియమైన తియ్యని భిక్షపెట్టె

ఈపెద్దపత్రలో గోపాలకులఁ బంచి
బలిగుడి కింపుగా బద్దె గీచె
ఈయేటి యలలలో హాయిగా జోగొట్టి
అన్నిఁటిఁ దూఁగుటుయ్యాల లూఁపె
ఈ యఖండ కళాసృష్టి నింక నంతు
లేని సృష్టికోసము కర్గి మేను మఱచి
ఈసుమ హృదయశయ్యపై నింత వాఁడు
పండుకొని యేలుచుండె బ్రహ్మాండములను
ఈ చక్రమ్మును ద్రిప్పుచున్న దొర నేఁ
డికష్టకాలమ్ములో
ఏ చిత్రమ్ములఁ గాంచి జాలిపడి తగ్రుకె!
యెంతమాధుర్య ధా
రాచాతుర్య సుధాసముద్రుఁ డోయి
సంరక్షింపగా లేచెనో
నా చిన్నారిది చూపునంట నిక నీనవ్య
ప్రబంధమ్మునన్.
ఇది యెంతో జగదేకవీరుని బడాయిన్
గట్టి పెట్టించు కు
ద్రది యీ పొంగెడివాని నవ్యకవితా
రాజ్యమ్ములోఁ బుష్పవృ
ష్టిది ముల్లోకపు ముద్దుమాటలది నీ
స్నేహాలకై తిండి తి
న్నది కా దేమిటో బక్కచిక్కినది నా
నాస్వామి పాలించరా!
ఈకృతులెన్నియో దిశలకెక్కిన దారిలో
నిన్ను జూచి నా

జూకులు నేర్చి నా మృదుకిశోర నిరంతర
మింక నేనికో
వాకిటఁ దిర్గుచున్నది చివాట్లను
బెట్టిన లెక్కఁబెట్ట దే
మో; కరుణించి కొంచెము ప్రభూ! కన
పించుము పున్నముం జెడిన్.
ఇదిగో! నా సుగుణప్రసూన' మఱి
నీ పీఠాంఘ్రికి నే వేడ్కతో
మృధుమాధుర్య పరీమళమ్ములను
భూమున గుప్పుచున్నావొ, తు
మ్మెద లీ సుమ్మము నింక పట్టుకొని
కూర్మిన్ రాగముల్ తీయవే
తుదకే నీరోద సైప నీవసవసంతున్
నేఁడు గైకోగదే
లతల్ కొద్ది వనమ్ములీ కవికులా
లంకార విద్యాసభా
ధ్యక్షున్ బూజలు చేసి కుల్కినవి
సౌందర్యమ్ము లొల్కించి స
ఫలం బెట్టిక ద్రిప్పుకొందువో సుమా
పట్టాభిషేకమ్ములో
కతుల్ కట్టుడ రమ్ము నిను సవతుల
గంధర్వకావ్యేందిరా!
కులుకుల్ గుల్కెడి మేలిలక్కు పసలల్
కూర్మిన్ సల్లాతుర
మ్ములచే గట్టెరిగాంచె యాంతినికే
నెల్ముల్ మొద్దుటుప్పాల కే

డలు; నీ వెంత మనోహరమ్మయిన వేడ్కల్
తీర్తువో యింక కూ
డలి వా రందఱు మెచ్చుకోవలయు
బిడ్డా! నీదు ముచ్చట్లతోన్
అమితంబైన షికార్లతో ముసలిసింహంబైన
మా పెద్ద వి
క్రమభూపాలకుఁ డింత దిగ్గజములన్
గంపింపగాఁజేయు శౌ
ర్యము నిచ్చోటనె తెచ్చినాఁడఁట మఱీ
రాజ్యాని కెవ్వాని పా
దము జవ్వాదికులమ్ము నిచ్చినది యో
తల్లీ! ప్రశంసింపుమా!
తండ్రీ! మీ రెటువంటి వీరకుల
విద్యాసాగరాలైన మీ
గాండ్రింపు ల్చెవిఁబెట్ట దేమి యిఁక నా
కావ్యప్రఫుల్లాక్షి యీ
కోండ్రన్ బట్టెడి వీరపౌరుషముచేఁ
గోటీరమాణిక్యమై
తీండ్రించున్ బెదరించ కెప్పుడు కళన్
దేలించి పాలించుమా!
సముద్రైన జగత్సాక్షికి
హిమబిందుసరోరుహాక్షి యొగిఁబోయు కళ
ల్గమనించి చిన్ని మా దొర!
సుమరాజ్యము నేల వయ్యా శుభసౌఖ్యములన్.

బెజవాడ,
29-12-44.

వేదాంత కవి,
కవితాసంస్థానము.

# గమనించాలి

ప్రభుత్వాల్లోంచి ప్రారబ్ధాల్లోంచి కష్టకాలం దిగలేదు, దిగదు కూడా పనీపాటాలేక, భాగ్యవంతుల చుట్టూ పహారాకాస్తున్న నానా రకాల పెద్దమనుష్యుల్లోనుంచి కష్టకాలం దిగింది. కాషాయివస్త్రాలూ, ధర్మ శాస్త్రాలూ, ప్రజల కళ్ల కడ్డంగా వుండటంవల్ల యిన్నాళ్ళనుంచీ యీ మాయ తెలియటంలేదు, కష్టకాలంలోంచి బయట పడటంలేదు.

ఈ రహస్యం యీ కష్టకాలం నాటకంతో బయట పెట్టాను. కేవలం ఉదర ప్రక్షాళనం కోసం బాకాజోళ్లూదటం బాగా పట్టుపడ్డ నటీనటులకి నేను చెప్ప దగ్గవాణ్ణి కాకపోయినా నాట్యకళా ప్రశస్తి గురించి చెప్పక తప్పిందికాదు, నాట్యకళారాధన విశ్వమానవ కళ్యాణానికి ప్రధానమైంది. నటీనటు లిది ముఖ్యంగా విశ్వసించాలి, దానికి తగ్గట్టుగ నడవాలి, ప్రతినటుడూ ప్రపంచసేవకు భటుడుగా తయారు కావాలి, ఇంకా ఇంతకంటె రసవంతంగా నాటకాలు ప్రపంచసేవకు వ్రాయించి పాటుపడండి. వల్లించింది జల్లిస్తే ప్రయోజనం లేదు, కొండల్ని కరిగించాలి, ఈనాటకంలో ప్రతిరంగము అర్థంచేసుకొని హంగులన్నీ పెట్టుకోండి. నాట్యకళసత్తా తెలిసినవారు చేసేపనే అది. వినడంలో ఆన్న రుంది, చెప్పడంలో ఆయాస ముంది.

---

*రేడియో స్పీచిలోని భావం "రేడియో జవాబు" లోది.

వేదాంతకవి.

ఈనాటకములో దిగుతున్న నటీనటులయొక్క—

# పరిచయాలు

1. నిరంకుశకవి—పూజారితనం పనికిరానివాడు కష్టాల్లో నలిగిపోతున్న వాడు కథానాయకుడు సౌందర్యోపాసకుడు మహాకవి సార్వభౌముడు. కష్టజీవాల గురువు.
2. సుందర్రావు:—చక్కదనాలు, గొప్పదనాలు గలవాడు, సుధాంబుధికి చిన్ననాటి స్నేహితుడు, దాసీదానికొడుకు, కష్టపడి చదువుకొన్నవాడు, కష్టజీవుల నాయకుడు, భావయ్యగారి మేస్త్రీ.
3. భావయ్య:—భారీ వ్యాపారాల్లో పూరాగా సంపాదించిన కోటీశ్వరుడు. బ్రాహ్మణ సార్వభౌముడు. దేవయ్య భాగస్వామిగా కలిసినవాడు. బ్రహ్మానంద స్వాములవారికి ప్రియమైన శిష్యుడు, పేరు కోసం తంటాలుపడుతున్నవాడు, అవివాహితుడుగా ఉన్నవాడు. ముదురుబారిన వయస్సుగలవాడు, కానరానివాడు.
4. దేవయ్య:—బాగా కలవాడు. గృహస్థుడు. భావయ్యతో కలిసి వ్యాపారం సాగించుతున్నవాడు, అమాయకుడు.
5. బ్రహ్మానందస్వామి:—స్వాములవారు, భావయ్య సంస్థాన గురువు. వెంకాయమ్మకి మోక్షమంత్రోపదేశికుడు.
6. వ్యాపార:—పండితుడు. ఆచారికి గురువు. బడాయికోరు.
7. ఆచారి:—రిటైర్డుడిప్యూటీకలెక్టరు. భావయ్య సహాయ కార్యదర్శి, కపటోపాయాలు గలవాడు.
8. సుధాంబుధి:—నిరంకుశకవి శిష్యుడు, వెంకాయమ్మ కొడుకు. కానిరాని అమాయకుడు.
9. బడేసాహెబు:—భావయ్యగారి ప్రియమైన బంట్రోతు పోకిరీవాడు. సుందరరావుని ప్రాణస్నేహితుడు.
10. మాధురి:—నిరంకుశకవి భార్య; కథానాయకురాలు; సాధ్వి.
11. కళ:—నిరంకుశకవి కుమార్తె, సుందర్రావుని ప్రియురాలు.
12. కోటి—సుందర్రావు తల్లి. దాసీమనిషి.
13. వెంకాయమ్మ:—పూర్వసువాసిని, సుధాంబుధి తల్లి.
14. ఇనెస్పెక్టరు, పోలీసులు, కూలీలు వస్తారు.

# కష్టకాలం

## ప్రథమాంకము

1 వ రంగం, పార్కు, సరస్సు

[చక్కచక్కని పూలచెట్లతో, సిమెంటు చప్పరాలతో రేడియోలతో, గ్రంథాలయాలతో స్త్రీ పురుషాదులకి అనుకూలమైన యేర్పాటులతో కళకళలాడుతుంటుంది. సాయంత్రం 5 గంటలవేళ, అప్పుడేటు యువతీ యువకులంతా వస్తుంటారు. గుదురుగా లేచిన పూలచెట్లనడుమ కళ వొయ్యారాన్ని వొలికించుకొంటూ, కమ్మని గేయం అతిసుకుమారంగా పాడుకొంటూవస్తుంది. ఎవరూలేని ఏకాంత ప్రదేశంలో కూర్చున్న సుందర్రావు ఇదంతా చూచి, మెల్లగా లేచి, గుంపుగా లేచిన చెట్లమధ్యకు చేరి కళపాడుతున్న కీర్తన్ని యీలతో కాసేపు, శ్రావ్యమైన శారీరంతో కాసేపు కమ్మకమ్మగా అందుకొంటుంటాడు. కళ తెల్లబోయి తుర్రుమంటుంది. సుందర్రావు నిరుత్సాహ ముఖంపడి చప్పరంమీద కూర్చుని.]

డైలాగ్ — కీర్తన

కళ—వనలక్ష్మి! ఈవడగాడ్పు ఎక్కడిదే?

సుంద—సుకుమారీ! నీ నిట్టూర్పు గ్రక్కినదే!

కళ—ఇకచాల్లే! నీ ఎగతాళీ నవ్వొదరే.

సుంద—రతనాలూ నీయుతనాలూ త్రవ్వొదరే! (కళ పారిపోవును)

సుంద—(ఇవతలికి వచ్చి)

అబలా! నీమృదుకంఠికేను తబలానై కొట్టుకొన్నన్ శ్రుతుల్
సొబగుల్లేక వృథాప్రయాసలకు సంక్షోభంబు పుట్టించి కే
యిఁ బవల్ నాజవశక్తులన్ని భ్రమలో హింసించి, వేధించుటల్
సబబా! నీ విటు లాట నేలబలబా చాటించు ఔట్లోగదే.

ఓశుభ మనోహర సుకుమార శాకుంతములారా!
ఈసుమనోభిరామ కులు కింత మనోహర వ్రజకాంతియై
నా సుఖరాజ్యపాలనము నల్గురి ముంగటఁ బెట్టబోయెనో
వేసవి గాడ్పులోఁ గలసి వేఁపఁగబోయెనొ యేమిపాపమో
వీసముజాడఁ దెల్పెడి వివేకధనుండిక లే డదేమిటో.

అదుగో! సుధాంబుధి కాబోలు వస్తున్నాడు. వీఁడు నిరంతర గురుపాద సేవాధురంధరుఁడు. అమాయకత్వంతో పైకి కానరాని యుగంధరుఁడు. కవిగారి చమత్కారధోరణి వీఁడిలో కొంత దిగింది. (దగ్గఱకు రానిచ్చి) ఏంరా! సుధాంబుధి! నీవు రేడియోలో మాట్లాడే దెప్పుడు?

సుధా—నీవు స్టూడియో కట్టినప్పుడు.

సుంద—ప్రాస వేయడంలో నోబిల్ ప్రైజు నీకియ్యాల్రా.

సుధా—గ్యాస్ కొట్టడంలో నీ కియ్యాల్దూ?

సుంద—(నవ్వి) సుధాంబుధి! ఎగతాళి అనుకోక. నీవు మాట్లాడుతుంటే నవ్వాపుకోలేంరా.

సుధా—అంటే, అంత తెలివితక్కువగా వుంటుందన్న మాట.

సుంద—(నవ్వి) కాదురా! అంత చక్కలిగిలి పెడుతున్న దన్న మాట. అయితే; కవిగారి కూతురి మాటే జెప్పుడు?

సుధా—అది నీకెందుకు? కొంపదీసి, ప్లానేమన్నా వేస్తున్నావా యేం?

సుంద—మన మా ఇంజనీరింగు కోర్సులో పడలేదు.

సుధా—మనమే పడేది.

సుంద—నీవిట్లా కవిత్వంతో మాట్లాడుతుంటే నాకేం తెలుస్తుంది? ఇదిగో! అటు చూడు. ఈడు జోడు కలసిన పిట్టలదాంపత్యం ఎంత ముద్దుమూటలు కట్టుతున్నదో.

సుధా—నీకు తొందరలో పెళ్ళిచేస్తే మంచిది.

సుంద—ఆపిట్టల కెవ్వరు చేశారు?

సుధా—అయితే! ఏమంటావ్? అట్లాగే ఎక్కడన్నా కలిస్తే బాగుంటుందని చూస్తున్నా వన్న మాట

సుంద—మాటమాట కింతలోతుగా అర్థం తీసేవాణ్ణి నేనెక్కడా చూడలేదురా.

సుధా—చూద్దువుగాని, ప్లానువేద్దువుగాని వినువిను.

సుంద—ఏమిటి ?

సుధా—కవిగారివాళ్ళ రేడియోలో మాట్లాడుతున్నారు.

సుంద—అయితే ! కవిగారూళ్ళో లేరన్నమాట.

సుధా—నిన్న వెళ్ళారు. ఇప్పుడే ప్రోగ్రాంగూడా విను.

సుంద—నాక్కాస్త పనివుందిరా బ్రదర్.

సుధా—నీకేనా యేం మాలావుపని ? నాకూ్కడా వుంది. కూర్చో వెళదాం.

సుంద—నీవు వింటూఉండు. నేనిప్పుడే వసా. (పోబోవును)

సుధా—అంతాపోదాం కూర్చోరా (కూర్చోపెట్టును)

సుంద—సబ్జక్టు రేమిటి ?

సుధా—బడ్జట్టులో వున్నది. సంఘంగురించి పోదాంపద.

(నిష్క్రమింతురు తెరపడును)

---

2 వ రంగం

మద్రాసు రేడియో మైకుముందు నిల్చి కవి రేడియో స్పీచి చదువుతాడు.

నిరంకుశకవి—సంఘమే విఘ్నేశ్వరుడు. సంఘవిఘ్నేశ్వరుడికి దాదాపు రెండువందల కోట్ల ముఖా లున్నట్లు ఎంచినలెఖ్ఖగాళ్ళు చెబుతున్నారు. అవి ఒకేవర్ణం ముఖాలు కావు. తెలుపు, నలుపు, పసుపు, ఇంకా చాలా మిశ్రరంగుల్లో ప్రకాశిస్తున్నై. ఒకే బొట్టున్న ముఖాలు కావు. బొట్టున్నముఖాలున్నై. బొట్టులేని ముఖాలున్నై. జటాజూటా లున్నముఖాలు వున్నై. బోడి ముఖాలున్నై. పిలకముఖాలున్నై. క్రాపుముఖాలున్నై. జులపాల ముఖాలున్నై. స్త్రీముఖాలున్నై. పురుషముఖాలున్నై. పళ్ళున్న ముఖాలున్నై. పళ్ళులేనిముఖాలున్నై. ఆస్తికముఖా

లున్నై. నాస్తికముఖాలున్నై. ఈముఖాల్లో కొన్ని అక్షర కుక్షులు. కొన్ని నిరక్షరకుక్షులు. మెజారిటీలో నిరక్షరకుక్షులే ఎక్కువ. ఇన్ని రకరకాలముఖాల్తో సంఘువిఘ్నేశ్వరుడు బహు చమత్కారంగా వున్నాడు. తూర్పుగావున్న ముఖాల్లోకన్న, పశ్చిమంగా వున్న ముఖాల్లో కొంచెం కళకాంతులున్నై. ఈ రెండువందల కోట్ల ముఖాల్లో ఎక్కువ ముఖాలు కళాకాంతు లేక నిర్జీవంగా వున్నై. రావణాసురుని తలలు నరకబడుతుంటే కొత్త తలలు మొలచుకొచ్చినట్టుగా, అనుక్షణమూ సంఘు విఘ్నేశ్వరుడికి పాతముఖాలు మాయమై కొత్తముఖాలు పుడుతూ వుంటయి. మొత్తంమీద సంఘువిఘ్నేశ్వరుడి ముఖాలు పెరుగుదల్లోనే వున్నై.

ఈముఖాలు వొకదానికొకటి ప్రేమించుకోటంకద్దు. సాధించుకోవటం కద్దు. ఇప్పుడు; ఉన్నముఖాలమధ్యా, లేనిముఖాల మధ్యా రగడ బాగా సాగుతున్నది. ఈరగడకి మూలకారణం సంఘు విఘ్నేశ్వరుడికి తగినంత తిండీ తిప్పలూ లేకపోటానేనని చదువు కున్న ముఖాలు చెబుతున్నై. ఇంత భిన్నభిన్న వర్గాల్లోనూ, భిన్నభిన్న వర్ణాల్లోనూ, భిన్నభిన్న జాతుల్లోనూ, భిన్నభిన్న అంతస్తుల్లోనూ, భిన్నభిన్న భాషల్లోనూ, భిన్నభిన్న భావా ల్లోనూ, భిన్నభిన్న అభిరుచుల్లోనూ, వెలుగుతున్న సంఘువిరాట స్వరూపుణ్ణి, నేనెట్లా సంతోషపెట్టి, సంతృప్తిపరచగల్ను? నాకు పురాతనసాహిత్యం అబ్బనట్లే, నవ్యసాహిత్యం అబ్బలా అభ్యు దయసాహిత్యమూ అబ్బలా. చివరకి ప్రజాసాహిత్యమూ అబ్బ టంలేదు. అయితే స్వానుభవంవల్ల ఒంటబట్టిన స్వరాజ్య సాహి త్యంతోనే సంఘువిఘ్నేశ్వరుణ్ణి పూజించి మెప్పించదలస్తున్నా. నాపొట్ట నాపొట్టఅనీ, నావర్గం నావర్గంఅనీ, నాదేశం నా దేశంఅనీ, నాజగత్తు నాజగత్తుఅనీ, నామతం నామతం అనీ వొకేమాటు వివిధజపాలు పట్టుకొన్న ఈ సంఘువిఘ్నేశ్వరుణ్ణి

వొకవరాన్ని అడుగదలచి ఇట్లా వచ్చీరానీ అక్షర పూజా ద్రవ్యాల్తో పూజిస్తున్నా. రెండువందలకోట్ల నోర్లున్న సంఘ విఘ్నేశ్వరుడి ముఖాలన్నింటికీ, వర్ణ వర్గ జాతి మత విచక్షణ లేకుండా, కిరీటాలుపెట్టి శృంగారించుకొనే భాగ్యం నాక్కావాలి. ఈ స్వరాజ్య నిత్య భత్య ప్రమాణానికి చేరితే గాని ఇటువంటి సంఘవిఘ్నేశ్వరుడికి ప్రస్తుతమున్న మట్టిగుజ్జు రూపంపోయి, సంపూర్ణవికాసం పెద్ద ఆజానుబాహురూపం పొందగల్గే అవకాశం రాదు.

(ఈ స్పీచి నాటకాలు ఆడేవాళ్ళు ఇక్కడనుంచి వాడాలి)

సంఘవిఘ్నేశ్వరుడికి ప్రస్తుతం చాలాహక్కులున్నై. పనిపాటల్లేకుండా దరిద్రంతో మలమలమాడే హక్కున్నది. నిశానీగా ఉండగల హక్కున్నది. నానారోగాలు తెచ్చుకొనే హక్కున్నది. ఒకడిపళ్ళొకడు పూడకొట్టుకొనే హక్కున్నది. డజన్లకొద్దీ పిల్లల్నికని, మాడ్చిచంపే హక్కున్నది. ఒకర్నొకరు మోసంచేసుకొనే హక్కున్నది. రాత్రింబవళ్ళూ విశ్రాంతి లేకుండా పనుల్లోనలిగి తొందరగా చచ్చే హక్కున్నది. పనిపాట్లు చేయునవసరంలేకుండా తేరగావచ్చిపడ్డ విశ్రాంతివ్యాధుల్లో తీసుకొనే హక్కున్నది ముష్టెత్తుకొనే హక్కున్నది. ముష్టివేసే హక్కున్నది. గ్రామాల్నిసంపాదించుకొనె హక్కున్నది. సాంరాజ్యాల్ని కబళించేహక్కున్నది రంకు బొంకుతనాలకి హక్కున్నది. ఇంకా ఎన్నో హక్కులున్నై. దుంపతెగిన హక్కులు. ఈహక్కు లెక్కువయినకొద్దీ, సంఘవిఘ్నేశ్వరుడికి మరుగుజ్జురూపం మరీ ఎక్కువౌతున్నది. ఈ సన్యాసి హక్కులు నశించి స్వరాజ్యహక్కువస్తేనేగాని, సంఘవిఘ్నేశ్వరుడికి ఈ ప్రేతకళపోయి, జీవకళరాదు. స్వరాజ్యహక్కొచ్చినప్పుడే సంఘవిఘ్నేశ్వరుడి రెండు వందల కోట్లముఖాలూ సమాన పాయలోకొస్తై. ఈసంఘ విఘ్నేశ్వరుడి జీవిత ప్రవాహానికెదురుపోయి నెగ్గినవాండొక్కడూ కన్పడడంలేదు.

ఈ యుఱుములు మెఱపు లేకొండకోనసుంచి
జాలు కట్టిపడెనో నేలపైన
ఈ పరుగులు తర్గ లేరెల్లుపొదనుంచి
చీలిపాయ లయిలేచెనో జగాన
ఈ సుడిగుండమ్ము లే గండముల నుంచి
నోర్వొప్పికొని వచ్చెనో ధరిత్రి
ఈ వెండి కెరటాలు ఏయొడ్డు విఱిగించి
లంకలు వెట్టెనో లావుభువిని
ఈ యనంత గంభీర వాగ్గేయ మాధు
రీ మహాజీవిత ఝరీ పరీక్ష నడుమ
ఎన్నిపడి బుడుంగు మనెనో యింతవఱకు
ఒక్క పడవైన దించలే దొడ్డుపైన.

చక్కని శాంతి సౌఖ్యాలు గలవొడ్డున పడనీయకుండా ఈ సంఘ విఘ్నేశ్వరుడికి అసలీ పీడ యెట్లా పట్టిందో గ్రహించండి! యుగయుగాల్నుంచీ, వంశపారంపర్యంగా దొర్లుతూ వస్తున్న ఈ అస్వరాజ్యార్థిక విధానంవల్ల పట్టింది. ఈ అస్వరాజ్యార్థిక విధానమే సంఘంలో బహుకొద్ది మందికి లాభాలు, ఐశ్వర్యాలు ఇస్తున్నది. మిగిలినవా రందదరికీ నష్టాలుకష్టాలిచ్చేఅవకాశాల్ని ఇస్తున్నది. ఈఅస్వరాజ్యార్థికవిధానం, నానాయుద్ధాలకీ, నానా రోగాలకీ, నానామతకలహాలకీ, వర్గకలహాలకీ, వర్ణకలహాటకీ, జాతికలహాలకీ, అష్టదరిద్రాలకీ అవకాశాలిస్తున్నది. లాభనష్టాల వాతావరణంలో పుట్టి పెరుగుతున్న స్త్రీ పురుషులకు, మానసిక శారీరక వ్యభిచారాల్ని గూడా ఇస్తున్నది. పైకి కనిపించని మారు వేషాల్లో జొరబడి తిరుగుతున్న మూల విరాట్టుల్ని అభిమానించిబలిస్తున్నది. అసలు శ్రీరాముడుస్వరాజ్యసత్యాన్ని గ్రహించి వుండినట్లైతే కపటోపాయంతో, నీలాపనింద నివారణకోసం తనభార్యాన్ని అరణ్యాల్పాల్చేసేబదులు, ప్రపంచాన్ని మాడ్చుకు తింటున్న ఈ అస్వరాజ్యార్థిక విధా

నాన్ని భూస్థాపనచేసి దానిమీద విశ్వస్వరాజ్యాన్ని స్థాపించి వుండేవాఁడు. పోనీ సామ్రాజ్యవాదుల మధ్యసంభవించిన జగడంలో ఇరుక్కున్న శ్రీకృష్ణుడన్నా, ఈస్వరాజ్యసత్యాన్ని కనిపెట్టి వుండినట్లయితే, భగవద్గీతకి బదులు, స్వరాజ్యగీతని చెప్పి, మానవసంఘానికి ముందు; ఇహంలో మోక్షమార్గం చూపేవాఁడే. చివరికి, సర్వసంగపరిత్యాగచక్రవర్తియైన బుద్ధుఁడైనా ఈస్వరాజ్య సత్యాన్ని కనిపెట్టివుండినట్లైతే, రాజ్యత్యాగానికి బదులు జగత్తులో తాండవిస్తున్న అస్వరాజ్యార్థిక విధానాన్ని చీల్చి చెండాడేవాఁడే. ఇహ ఈస్వరాజ్య సత్యాన్ని తెలుసుకోని అవతారాలు పదిదిగినా పదికోట్లుదిగినా మానవసంఘానికి ముక్తిలేదు. ఈ స్వరాజ్యసత్యం తెల్సుకోనంతవరకూ, ఈగుళ్ళు గోపురాలు, మందిరాలు, మశీదులు, చర్చ్చలు, చర్చ్చీలు మానవసంఘానికి సంకెళ్లే అవుతై.

రష్యాలో లేచిన సామ్యవాద సిద్ధాంతం చాల ప్రశంసనీయమైందేగాని, విశ్వస్వరాజ్యసామ్యవాదసిద్ధాంతానికి విరుద్ధమైన దారొకటి త్రొక్కింది. అదేమిటంటే? ప్రత్యేకంగా పతాకం మీద కొడవల్నిసుత్తిని యెక్కించింది, దానివల్ల, మళ్ళీవర్గకలహాలుపుడతై. ప్రపంచరథసారథ్యానికి కార్మికకర్షకులేముఖ్యులని తేల్తుంది. అంచేత యేవర్గానికి చెందని చిహ్నం పతాకంమీదకెక్కాలి అపుడు రెండువందలకోట్ల విశ్వజనస్వరాజ్యసామ్యవాదమార్గంచాలా విశాలమై ఒడుదుడుకులులేకుండా వుంటుంది. నా విశ్వజనసోదరసోదరీమణులంతాయిది గ్రహించాలనిప్రార్థిస్తున్నా. బ్రతుకున్నంతవరకూ మానవుడు మహారాజశ్రీగా వుండాలి. చచ్చింతర్వాత బహ్మశ్రీగా మారాలి. అంతేగాని బ్రతికున్నవాడు బ్రహ్మశ్రీగా వుండటానికి ప్రయత్నించగూడదు. ఈసూత్రాన్ని తెలుసుకుంటే, మనకు మహారాజశ్రీ లెఖ్కలో వున్న యూనివర్సల్ స్వరాజ్యలోకంకనపడుతుంది. (తెరపడును)

# కష్టకాలం

## ద్వితీయాంకము

### 1 వరంగం, కవిగారి గృహం

[క్షీరస పాడుకొంటూ మాధురి పనిపాటల్లో వుంది]

అమృతకోకిల గానలోలా మధురభావ పరిమళా
మృదుతర శోభిత శుభకరలీలా నవకాంచన భాగ్యశాలా
లలిత హేమలతా కళా ॥అమృతకోకిల గానలోలా॥

[కోటి దూకుడుగా ప్రవేశం]

కోటి—పండి ! మాదురమ్మగారూ ! ఇయ్యాలన్నా ఇప్పిత్తారా ఇప్పించరా ? రేయింబగళ్ళూ ఎముకలు ఇరక్కొట్టు కుంటూన్నా కడుపు నిండటంలేదు.

మాధు—నిజమే కోటి, ఇవాళ్ళ సిజీతం డబ్బులిచ్చిగాని గంగ మింగను.

కోటి—అట్లాగంటే ఎట్లా సెప్పండి. నెల్లాళ్ళు మీయంటోరి లోగిళ్ళలో పాచిపనిచేసి, పావలా డబ్బులుగ్గూడా కరువై పోతే మేమెట్లా బతకాలి ?

మాధు—ఔను కష్టమే. అయితే మీఅబ్బాయి కింకా వుద్యోగం కుదరలేదా ?

కోటి—కుదరలేదండమ్మా. ఆచార్లుంగార్ని యేడుకొంటుండా. అదన్నా కుదిరితే బతుకుతాం. అయ్యగారొస్తే యిప్పించండమ్మా.

మాధు—మద్రాసునుంచి యివాళే వచ్చారు. అడిగి పుచ్చుకొంటా.

కోటి—ఎంట్లోవున్నారా ?

మాధు—వేసి చాలాసేపైంది (కోటి నిష్క్రమించును)

[సుధాంబుధి ప్రవేశం]

**మాధు**—సుధాంబుధి! గురువుగారొస్తున్నారా?

**సుధా**—గురువుగారింకా రాలేదండీ?

**మాధు**—సరే బాగానే వుంది. నీవు గురువుగారితో లేవా?

**సుధా**—ఉన్నానండి. ఇంతకుముందే మాయింటికెళ్ళి వస్తానని చెప్పి వస్తున్నానండి.

**మాధు**—అయితే యింతకూ పనియేమైనా అయినట్టేనా?

**సుధా**—ఆ. ముందు నా పని అయిపెట్టేసండి. అబ్బా! అదేమిటోగాని గురువుగారికి తబ్బిబ్బుధోరణే లేదేమండి? అదెక్కడ నిరంకుశత్వమో ఎవరన్నా లెక్కలేదు ఇంటసంగతి గుర్తురాదు. పైగా మొన్న రేడియోలో మాట్లాడొచ్చింతర్వాత వూళ్లోవాళ్లందరికీ విరోధులైనారు.

**మాధు**—బాగానే మాట్లాడారన్నారే.

**సుధా**—కళాభిమానంగలవారికి బాగుందండి. సంఘ దురాచారాలు బయట పెట్టేటప్పటికి సంఘపెద్దల కందరికీ కోపం వచ్చింది.

**మాధు**—నే నెన్ని మొత్తుకొన్నా వినరు. ఎవరెట్లా యేడుస్తే మన కెందుకని కాళ్ళుపట్టుకొని బతిమాలుకొన్నా. ఏం ప్రయోజనం? వారిమాట వారికేగాని యెదుటివారిమాట చెవి బెట్టుకోవడం ఎప్పుడూ లేదుగా.

**సుధా**—అమ్మో! ఎదురు చెప్పడం వినిపించడం బ్రహ్మతరంకాదండి

[నిరంకుశకవి ప్రవేశం]

నిరం—ఏమిట్రా సుధాంబుధి?

**సుధా**—(ఉలిక్కిపడి) ఏం లేదండి, మీరింకా రాలేదేమని అమ్మగా రడుగుతున్నారు.

నిరం—అమ్మగారి కెప్పుడూ ఎదురుగా కూర్చుంటే యింకేం అక్ఖర్లేదురా?

సుధా—ఇంకేంకావాలండి నిజంగా అన్నంగూడ అక్ఖర్లేదు?

నిరం—ఎదురుగా కూర్చుంటే అన్నం ఎట్లా వస్తుందిరా?

మాధు—అంత సంసారతాపత్రయం మీద తిరుగుతుంటే నాకింకేం కావాలి?

నిరం—అట్లాగా!

ఇదిగో! నా మృదుమాధురీలహరి! నేఁ డీ దివ్యసంసారమో
హదశానంత దిగంత సౌఖ్య బహుబ్రహ్మానంద సంస్థాన సం
పదలోఁ గమ్మని పిల్ల తెమ్మెరలు లేపంగల్గు నిల్లాలు తీ
పిది; తాపత్రయ మెల్ల దానికొఱకే వేధించు లోకంబునన్.

మాధు—అంత తీపి గల యిల్లాల్ని, అంతసౌఖ్యం గల సంసారాన్ని బయట పడకుండా కాపాడుకోవాలి.

గోలకులేచి యీపరువుకోసము పెద్దసముద్రఘోషలో
జోలలుపాడి యేపుడమిశోషను దీర్చిరి మీరు నేఁడు? గ
గ్గోలయిపోయె మీపిడుగు గోఁకి కూడలి యెల్లస్వామి! మీ
కేల మరింతపట్టుదల, యీ చెడు కాలము నెట్టుకెట్టులో.

సుధా—(మెల్లగా ఇవతలకి వచ్చి) మాగురువుగారి కివా ఇంటిగురించి దిగులూ చింతా— —

నిరం—ఏమిట్రా గొణుక్కుంటావ్, పాడుగొణుగుడు.

సుధా—ఏమీ లేదండి. మన కిందాఁక వా ళ్లెవరో దారిలో కనబడి, మీకు పంపిస్తామన్నది ఇంకాపంపించలేదేమా అని చూస్తున్నా.

నిరం—నీవిక్కడుంటే యెట్లా పంపిస్తారు? నిన్ను రమ్మన్నారుకదరా?

సుధా—ఔనండోయ్ మరచిపోయినా. తీసుకొస్తా (నిష్క్రమించు)

మాధు—వాడన్నట్లు మీకు బొత్తిగా సంసారమన్న మాటే పట్టదు, ఎప్పుడూ ఆపాడుకవిత్వం అల్లటంతప్ప.

నిరం—ఎంతమాటన్నావే. నేను సహింపని మాటన్నావు. ఈతడవకి క్షమించాను, నాజన్మకొక్కా వలసింది కవిత్వం. నన్నేవ రెన్ని ఆడిపోసినా సహిస్తానుగాని, నాకవిత్వాన్ని పల్లెత్తుమాటంటే మటుకు సహించను.

**మాధు**—ఇంతరోషమున్న వారు ఎవరిచేతా మాటపడగూడదుమఱి.

మీా నిరంకుశకవితావిధానగరిమ
బానినవు జీవితము కోరఁబడదుగాని
పూట పూటకు పడరాని పాటులెల్ల
దెచ్చిపెట్టును ప్రాణాలు తీయుదాక.

**ఆవరస,** పాచిపని చేసేదానికే ఇవ్వాల్సింది యివ్వలేక నెలలుకొద్దీ వాయిదాలు వేస్తున్నాం.

నిరం—ఎన్ని నెలల దివ్వాలి ?

**మాధు**—నాకూ జ్ఞాపకం లేదు. నాలుగు నెలల దివ్వాలి కాబోలు.

నిరం—పదిరూపాయి లివ్వాలన్న మాట.

**మాధు**—పదే యివ్వాలో, యిరవయ్యే యివ్వాలో నాకేం తెలియదు. అడగండి, వస్తున్నది.

[కోటి ప్రవేశం]

కోటి—ఏండీ బాబయ్యగోరు ! నామాట మరసిపొయ్యారా ?

నిరం—మఱచిపోలా జ్ఞాపకంవుంది. అయితే నీకొడుక్కి వన్డైందా ?

కోటి—లేదు బాబయ్యగోరు.

నిరం—ఇంతకుమునుపే ఆచార్లుగారు కనిపించారు. అఁరే యిది అడగటం మఱచిపోయినా. నేనీసాయంకాలం మళ్ళీ భావయ్యగారి దగ్గఱకెళ్ళి రావల్సిన పనుంది. ఈమాటు ఆచార్లుగారితో గట్టిగా చెబుతాలే. భావయ్యగారు ఆచారిగారిమాట తీసి పారేయరు. వా రెంతంటే అంత.

కోటి—ఆచారిగోరింటికాడగూడ పాచిపనిచేసేది నేనేలెండి. కాళ్ళా వేళ్ళాపడి మొక్కుతున్నా.

నిరం—అదిసరే, ఆయన కెన్నిపన్లు, సమయానికి జ్ఞాపకం చేయాలి, ఇంకా నేనుగూడా భావయ్యగారితో చెప్పిపెడతాలే.

**కోటి**—మీ కాళ్ళకి మొక్కుతా, నేరుగా వార్నే అడగండి బాబయ్యా! బతుకుతాం.

**నిరం**—అట్లాగే, నీజీతానికి నాల్గురోజులు ఆగాలి.

**కోటి**—సరేలెండి బాబు! అమ్మగారో! అంట్లన్నీ దొడ్లో వేశా. చూసుకోండమ్మా పోతూన్నా. (నిష్క్రమించు)

**మాధు**—చూచారా! డబ్బు చేతిలో లేనప్పుడు ఎంత బయటపడాల్సి వచ్చిందో, ఎంత నాటకం ఆడాల్సివచ్చిందో, ఈవరస ఇచ్చిన వాళ్ళంతా నిలవేస్తుంటే యెన్ని నాటకాలాడి, యిట్లా తప్పించుకొంటారు? మీ పురుషులు ఎన్ని వేషాలకన్నా పనికొస్తారు! అభం శుభం యెరుగని మాలాంటి ఆడవాళ్ళేం వేషాలు వేయగలరు? నాటకాలాడ గలరు? మీకేం, ఎప్పుడూ తప్పించుకొని దేశాల మీదకి లేచిపోతారు.

**నిరం**—మీరుమాత్రం ఎందుకు పోరాదు?

**మాధు**—మేముగూడా దేశాలమీదకి లేచి పోవడం లేదనుకొంటున్నారా! మాపని మీకంటె జోరుగానే నడుస్తున్నది. అయితే యీ అప్పులన్నీ యెట్లా తీరుస్తారండి?

**నిరం**—మాధురీ! నీ వింత పిరికిదానవేమే? ఈమానవజీవితం ఎన్నెన్ని ప్రళయకాల దృశ్యాల్ని లేవదీసి, బ్రహ్మాండ భాండం పగులగొట్టి, శివతాండవం చేయటానికి వచ్చిందో నీకింకా తెలియక యీపాడు బాకీలవాళ్ళగోలకే అదలిపోతున్నావు. (సిగరెట్టు ముట్టించి) దీనినిలెక్కపెట్టక, భయపడక. ఇంత అత్యంత మనోహరకవితా సామ్రాజ్య సామ్రాట్టై, సువర్ణ రత్న ఖచితవజ్ర వాఙ్మయ సింహాసనాసీనుండై, సున్నిత సుకుమార శాసనాల మీద, సమస్తలోకాల్ని నడిపించి పాలించుతున్న ఈనిరంకుశ చక్రవర్తి నీ అర్ధనారీశ్వరుండై నీసులలితకుసుమ హృదయ శయ్యపై ఆనంద కళాదేవతని నిల్పినపుడు నీ కీపాపిష్ఠి భయమెందుకే?

ఇంత మనోహరం బయిన యీ మృదురాగ కళావనంబులోఁ
జింత మఱెంత వేసినను, జీవము లన్నియు లేచివచ్చు శ్రీ
మంతు జగజ్ఝరీ మలయమారుత మున్నది సాధ్వి; లెమ్ము పా
లింతము సర్వసౌఖ్యకదళీఫలరాజ్య రమాలలామతోన్.

ఎంత భయంకర కష్టపరంపరలు విపత్పర్వతాన్ని విఱిచి పడవేస్తున్నప్పటికీ యీ అమూల్యమైన ప్రేమసుధా రసపిపాసకులు లెక్కపెట్టరు, తొణకరు, జంకరు, పిచ్చిదాన! బాకీలవాళ్ళ గోలకే భయపడితే యింత భయంకర గంభీరమైన సంసార సముద్ర మెట్లా యీదుతావు? ఈ మానవజీవితాన్ని నిరర్థకం చేయటానికి పుట్టినవాళ్ళు భయపడతారు. (ఆలకించుచూ) ఆ గానాలాపన యెవరిది? మన అమ్మాయిదేనా?

**మాధు**—ఔను. మన అమ్మాయే.

నిరం—దానిగ్గూడా యీ సిరికిమందు పోసి పెంచక నాతల్లి; ఎంత కడగండ్ల కాపురంలో పుట్టినప్పటికీ, ఎంత కళాకాంతులతో ఆనందగేయాలతో వుంటున్నదో చూడవే.

**మాధు**—మీరు పెట్టినపేరు సార్థకం చేసుకొంటున్నదిలెండి.

నిరం—ఔను. కళ అంటే నా వరాలతల్లి గాక మఱెవరే? ఎంత చక్కని గేయం పాడుతున్నదో వినవే. పోదాంపద.

(నిష్క్రమింతురు తెరపడును)

---

## 2వ రంగం

### కవిగారి రైటింగు (Writing) రూమ్

[కళ కీర్తన పాడుకొంటుండును]

కీర్తన

జీవకళా గానమాధురీ। కమ్మగా బలేగా
గ్రోలుట కిట గుమిగూడి। పటుమాలవలె తగినారా
దేవులార! మా దేవులార!। జీవకళా గానమాధురీ॥

[నిరంకుశ కవి, మాధురి ప్రవేశం]

నిరం—కళా! నీకీ గేయం ఎవరు చెప్పారమ్మా?

కళ—నీవు వ్రాసిందేనే నాన్నా.

నిరం—ఔను. ఈ బాణీలో నీ కెవరు చెప్పారు?

కళ—సుధాంబుధి చెప్పాడు.

మాధు—మీ రెన్ని పుస్తకాలు వ్రాసినా, పాటలు వ్రాసినా మన సుధాంబుధికి రాని దొక్కటంటయినా లేదు. మీ గ్రంథాలకి...

కళ—బీరువా వంటివాడు.

నిరం—(నవ్వి) బాగా చెప్పావమ్మా.

కళ—నాన్నా! మరే; తాతయ్యా నాయనమ్మా అరటిపళ్ళు తెచ్చి పెట్టమన్నారే?

మాధు—సరే; పూటగడవక యిన్ని చిక్కుల్లో వున్న సంగతి తెలిసి గూడా పళ్ళమీద భ్రాంతి పోలే దింకా.

నిరం—అట్లా అనకే. పెద్దవాళ్లైనారు. శతవృద్ధులు. వాళ్ళే మనకి పసిపిల్లలు. ఏమైనా తిందా మనిపిస్తుంటుంది. మనల్ని అడక్క ఎవర్నడుగుతారు?

కళ—నాన్నా! నా చొక్కాలు చినిగిపోయినై. పట్నంనుంచి వచ్చిం తర్వాత కుట్టిస్తానన్నావుగా.

నిరం—ఇంకా డబ్బు చేతికిరాలేదమ్మా! రేడియోవారు ఇప్పుడు ఖర్చులుమట్టుకే యిచ్చారు.

మాధు—అయితే డబ్బేమీరాలేదన్నమాట. ఈ డబ్బులేని ఉద్యోగాలు మీ కెక్కడదొరుకుతై యండి?

నిరం—ఈమాటు ప్రోగ్రాంలో ఇస్తారు.

మాధు—కొన్ని బాకీలన్నా తీరతయ్యేమోనని సంతోషించా. ఏం ప్రయోజనం. అసలు మీకు డబ్బు సంపాదన తెలియదులెండి.

కళ—నాన్నా! ఈమాటు వెళ్ళినప్పుడు పట్నంలోనే కుట్టించుకురా.
కళ్ళజోడు తెచ్చిపెట్టాలి ముఖ్యంగా.

మాధు—కళ్ళజోళ్ళూ తెస్తారు, చేతిజోళ్ళూ తెస్తారు.

సిరం—పాపంకోప్పడకే. ఎందు కింత విసుక్కుంటావ్ ?

మాధు—వీళ్ళతో వేగిపోతున్నానుస్వామి! మీ కేం తెలుసు? మీకేం బాగానే గారాబాలు నేర్పుతారు. ఇహ ఈ గోడగడ్డైన గారాబాలతో చచ్చేదాన్ని నేనేగా.

ఈ కడగండ్లకొంపకు మఱెన్నఁడు దేవుఁడు దిక్కుచూపునో
నాకొనప్రాణి కొట్టుకొని నల్దెసలన్ బడిపోవుచుండె, మీ
వాకిటికే ప్రఫుల్లనవపల్లవకోమలి భాగ్యరాసులన్
గైకొనివచ్చునో కనుడి కమ్మని సౌఖ్యము లిచ్చియేలగాన్.

నిరం—మాధురీ! ఎందుకే అంతనిష్ఠూరంగామాట్లాడతావ్? ఎప్పుడూ ఏదో వొక తాపత్రయంలోబడి విసుక్కుంటావ్. పెళ్ళీడు కొస్తున్న పిల్లల్ని ఎంతో ముచ్చటగా పెంచుకోవల్సింది కాస్తా పోయి యిట్లాకసరికొడుతుంటే, పిల్లలింకా ఏంకళాకాంతుల్తో వుంటారు? ననుగన్నతల్లీ! కళా! నిన్ను చూస్తుంటే నాకడుపుతరుక్కుపోతున్నదమ్మా! డబ్బురాలేదునిజంగా. మళ్ళీ రేపుపట్నంపోయినప్పుడు తప్పకుండా కుట్టించుకొస్తాలే. ఈ అరటిపళ్ళు నాయనమ్మకి తాతయ్య కిచ్చిరా తల్లీ!

కళ—పాపం తాతయ్యా, నాయనమ్మా ఎంతో సంతోషిస్తారే.

(నిష్క్రమించు)

మాధు—తెచ్చిపడేస్తుంటే అంతా సంతోషిస్తారు.

నిరం—నిజంగా; అందరికంటే, చేసుకొన్న పెళ్ళాలెక్కువసంతోషిస్తారు.

తెచ్చిననాఁడు మెచ్చుకొని తియ్యనిమాటలు చెప్పిచెప్పి; ము
న్నెచ్చటలేనికూర్మి మనసిచ్చెడి యింటికి నెంతసేపు గో
ర్వెచ్చనిప్రేమయుండునో, వివేకధనుం డెవఁ డింక చూడలే
డెచ్చట; చూచినప్పటికి ఈగడిదాటఁడ దేమిచిత్రమో.

మాధు—ఈధర్మశాస్త్రాల కే మగవాడూ కట్టుబడియుంటంలేదు ఉండ లేదు ఇల్లాల్ని యింతనీచంగా పరిహాసంగా బానిసగా భావించకండి. ఇల్లాలే జీవిత కళాప్రపంచానికి ఇలువేల్పు.. కళాకాంతుల్తో కనబడని ముఖాన్ని చూచి ఎట్లా మెచ్చుకోరో సిరీ సంపదా రాబట్టుకోని మగవాణ్ణిచూచి అట్లా మెచ్చుకోరు..

కాడికి రానికోడె మొనగాడయి యెంతటి అంకె పెట్టినన్
కూడును గుడ్డలున్ రయితు కొంపకు రావు; పొలాన ప్రాణముల్
వీడినగాని కర్షకుని లేములు తీరవు; లోకమెల్ల కా
పాడెడి ఆ మహా పశువుపాట్లు ఎఱెవ్వరు మెచ్చుకుందురే ?

నిరం—(నవ్వి) మాధురీ ! ఎంత అన్యాపదేశంగా కమ్మకమ్మనివి నాల్గూ పెట్టావే ! అయితే నీవు కాపరానికి వచ్చింతర్వాత ఇంత రసవంతమైన కవిత్వం చెబుతున్నావని నాకే మాత్రం తెలియదు సుమా.

ఈ సుకుమారకళా సుధాంశువనాన
గండుకోయిల వీవు, కవిని నేను
ఈ మధుర మధుర ప్రేమవాహినిలోన
రతనాల పడవ వీవు, రాజు నేను
ఈ మనోహర కావ్య హేమ హర్మ్యములోన
ఆనందరమ వీవు, హరిని నేను
ఈ కోమలతరసస్యేందిరాసీమలో
పాలేరు దొర వీవు, పశువు నేను
ఈ యమూల్య లావణ్య వాగ్గేయ మాధు
రీ లతాతన్విసంస్థాన పాలనమున
ఇన్ని బిరుదులు పెట్టి నన్నేలినట్టి
జోడు నీవె ! నీ చక్కని చూపుతోడు.

ఈ అనన్యసౌందర్య సంసార సంస్థానలక్ష్మి ఎన్ని పరీక్షలుచేసి నను, మన ప్రపంచ ప్రతిజ్ఞ మఱవకూడదు. సంపాదన లేక

సంసారం సన్నగిల్లినంత మాత్రాన దిగులు పడకూడదు. ఆదగ న్నియంత మన సంపాదనకోసం చూడడు. మన అన్యోన్య దాంపత్యవల్లికా మనోహారం కొరకు నిరీక్షిస్తాడు. పరీక్షిస్తాడు. అటువంటి జనకనిర్విశేషుని కిష్టమైన దాంపత్యధర్మం పరిపాలిస్తున్నప్పుడు మనల్ని పస్తుపడుకోబెట్టడు. ఇవాళ్లే ఈవూరి శ్రీమంతులైన భావయ్యగారు నెల 1కి నూరు రూపాయలిచ్చి వొకసంవత్సరం పోషిస్తామని వాగ్దత్తం చేశారు. పైకం రేపిస్తామన్నారు, దిగులుపడక. అయితే మాధురీ! మన అమ్మాయి పెళ్ళికు కొచ్చిందికదా, వొక్కనాడైనా ముద్దుమురిపాలు తీర్చకుండా వుంటే యెట్లా?

**మాధు**—ఇంత దీర్ఘోపన్యాసం ఎందు కిప్పించావో తెల్సుకొంటే అన్ని ముద్దులూ తీర్చుకోవచ్చు.

[బడేసాహెబు ప్రవేశం]

బడే—జీ! పండిత్సాబ్! సలాం లేఖుం?

నిరం—ఏం! బడేసాహెబ్! విశేషా లేమిటి?

బడే—విశేషాల్కి హేమండి పండిత్సాబ్! బహుత్ హై. మొన్నా మీకీ రేడియోలో మాట్లాడార సూశారూ! దాన్కి మేరా సేట్ బడాసంతోసం పడ్డారూ హాండి.

నిరం—ఇంకా యేమిటి?

బడే—బహుత్ హై వురోజీ పోదాం.

నిరం—ఎక్కడికి?

బడే—దేవిడీకండి. భావయ్యఘూర్ మీఖోసం సాలా తొందరపడ్తండార్. బేగీ రండి.

నిరం—దగ్గరెవరెవ రున్నారు?

బడే—హుండాల్సిన పొట్టకూటీపకాలం నాలా హుందండి.

నిరం—అయితే! ఎందుకు రమ్మన్నట్లో.

బడే—నాకీహా దీమాలుంన్నై పండిత్సాబ్! మీకీహం లే సాలాసరదా పడ్తండార్.

మాధు—వారు శ్రీమంతులు. ఏంపని పెట్టుకొనిరమ్మన్నారో, తొందరగా వెళ్ళిరండి.

నిరం—ఇప్పుడే అక్కణ్ణుంచివస్తున్నా. వెళతాలే. నాకాక లేస్తున్నది, అన్నం తిన్నతర్వాత వస్తానని చెప్పు బడేసాహెబ్!

బడే—హాదీఖాదూహాండీ! నాకీ హెంటాపెట్టుకురమ్మన్నార్. జల్దీ ఖానాఖావో బాబ్! నాకీ ఖోపం సేస్తార్.

నిరం—సరే కూర్చో పోదాం. ఏదోవున్న ఖారం మెతుకులు పెట్టు పోయివస్తా.

మాధు—అక్కడేం తొందరపనో దబ్బురరండి. (నిష్క్రమిస్తారు)

బడే—హారే! ఈలోకాన్నిసూస్తే నాకీ సాలా సిత్రం హేత్తుందండి. ఘాట్టఘాడ్చినా అచ్చరంముఖ్ఖలేసీ మొద్దూమొహం నాయాలీక్ నిండా స్థితీహుంది. హోడ్కి హెంటాహున్నా బాతాఖానీ ముతాకీ బహుత్ సుకం హోల్కుతూహుంది. హారే! నాయంటీ మోటామన్నీగతీ హాట్టాహుంచండి. ఏక్ దిల్మే ఖాదూహాండీ. సబ్ లోక్మే బడాపండిత్సాబ్ హైతో పూటాకీ తిండిలేకా నిన్నా మొన్నటిదాంకా ఫస్తుల్ హుంటుండాడ్. హిప్డూ మా రాజాసాబ్ దయావల్లా సల్లంగా భత్కావచ్చూ హానీతో సిందీగానీ, హాయితే, హెంటాహుండా గహలు హేప్టిా సేస్తయ్యో. హిఫ్డా హెక్డా దర్మం సచ్చిందండి? యేజగత్మే హిటువంటి జ్ఞానికీ రెక్కలట్టంమీదా భత్కుతూహుండా ఖూలోడ్కి ఖూడూ లేకాపోయింతర్వాతా ఫళయాలన్నీ పుట్ఫూహాండీ. యహ బాబ్ సచ్ బాత్ హై. మేరా భాయియో సునియే.

(తెరలోనుంచి వస్తున్నా బడేసాహెబూ! అయింది)

బడే—బేగీ ఖూనీయండీ హాయ్యా.

[మడినీళ్ళెత్తుకొని వెంకాయమ్మ ప్రవేశం]

**వెంకా**—ఒరే! సుధాంబుధీ! నీ చదువూ నీవూ చట్టుబండలై పోను. ఏవేళ్ళకీ యిల్లేపట్టవుట్రా ?

బడే—థూ మంచీ హేళా నూసేవచ్చావ్.

**వెంకా**—అదేమిటే సాయబూ! అట్లావిసుక్కొంటావ్? మాఅబ్బాయి వున్నాడేమో అనివస్తే.

బడే—హారే! హిథీ హెక్కా సైతాన్రా నాకీ. ఘోహామ్మా నీకి సలామ్ ఖోడ్తా. బలేశకునం హైందీ మాకీ.

వెంకా—బొత్తిగా, అదేమిటె సాయబూ! అల్లా చిక్కిపోతున్నావ్ ?

బడే—హారే నాకీ సిక్కిపోతే నీకీ హెందుకమ్మా? అల్లాకటాచ్చించీ నీకీ భర్యాభారం థీశిహేశాడ్గా హాహ్మా! ఘో ఘో హామ్మా.

వెంకా—ఎగతాళి కాదు. సాయబూ!

బడే—హెగథాళి ఖా ఖా పోతే సెగా థగ్లీ హడ్గాహామ్మా?

(తెరలోంచి వస్తున్నా సాహెబు)

**వెంకా**—కవిగా రున్నారే. ఇంకా చెప్పవేం ?

బడే—జావ్ రే హామ్మా జావ్. హేదోమేం జర్రా కాం మే జాతా హూం. హేబ్బీ ఛీడాకారం హెచుర్గుండా మాకీ ?

వెంకా—తెలియకడుగుతున్నా! కవిగారిపిల్ల సంబంధంకోనమేనా పోతున్నది

బడే—థూ బాత్ కర్న ఖో సైతాన్. నా కీ సంగతి హింకా నై మాలుం తూ కబడ్దార్.

వెంకా—ఎందుకట్లా సాయబూ! గుడ్లు చింతనిప్పులు చేసుకొంటావ్? పోతున్నాలే. (నిష్క్రమించు)

[తెరలోంచి ఎవరూ బడేసాహెబూ!]

**బడే**—హెవర్కి లేరూ, బేగీరండీ బాబూ? మళ్ళీ సైతాన్ హెదురు హౌాస్తుందేమో.

[నిరంకుశకవి ప్రవేశం]

నిరం—(నవ్వి) పదా. ఎవర్నీ కోప్పడుతున్నావ్ ? (బయల్దేరుతారు)

[ఎదురుగుండా వెంకాయమ్మ ప్రవేశం]

వెంకా—కవిగారేనా ?

బడే—ఛూ నీకీ ధయ్యాం పట్టిందమ్మా ?

వెంకా—ఎందుకల్లా నోరు పారేసుకొంటావ్ సాయబూ ! నీకేమన్నా పిచ్చా ? ఛాదా ? చూడండి కవిగారు !

నిరం—మేమేదో పనిమీద పోతున్నాం. ఇప్పుడేం పలకరించకండి, మళ్ళీరండి.

వెంకా—నీతల్లి కడుపు చల్లగావుండా. అట్లా చెబితే పోనూ ?

(నిష్క్రమించు)

బడే—ఛూ ! ఇయాలా దేన్కి మొహం చూశామో ! భలేసైతాన్ ఘట్టిందండి. హింటోకీ హెళ్లీ మళ్లీవద్దాం పదండి.

నిరం—(నవ్వి) మతేం ఫర్వాలేదు పదా సాహెబూ! ఈచాదస్తాలన్నీ శాస్త్రాలైనై గన్కనే దేశాలిల్లా మండుకు పోతున్నై.

బడే—హిందీమట్కా సాలాదెబ్బ తీసే శకునమండి

నిరం—దెబ్బాలేదు దిబ్బాలేదు పదా. హిందువుల్కి పట్టిన పీడా చీడా కాస్త మునల్మాన్ సోదరులగ్గూడా పట్టిం దనుకోంటూ.

(నిష్క్రమింతురు. తెరపడును)

---

*

# కష్టకాలం

## తృతీయాంకము

1 వ రంగం కోటిఇల్లు

[కీర్తన పాడుకొంటూ, మఘ్గరల్లుకొంటూ

కళ ప్రవేశం]

కీర్తన

భారతజీవనజాతీ - మాభారతజీవనజాతీ - కోకిలకోమలగీతీ - మా -

అమృతఝరీ, మృదులహరీ - మహాభావసింధూ

జీవబంధూ - బల్పసందూ

పావననవయుగమే - జీవనసుఖజగమై

సులలితనవశుభ మధుకరి-భారతజీవనజాతీ-కోకిలకోమలగీతీ-మా-

కళ—కోటీ ! కోటీ !

[సుందర్రావు ప్రవేశించి]

సుంద—ఎందుకు ?

కళ—కోటి వుందా ?

సుంద—పిలుస్తారు ఎందుకు ?

కళ—మాఅమ్మెందుకో రమ్మంటున్నది.

సుంద—నన్నూ మాఅమ్మెందుకో రమ్మంటున్నది. ఎందుకు ?

కళ—అదేమిటి ! కోటి వుందా ? లేదా ?

సుంద—ఇదేమిటి ? ఉంటే కనపడదూ ? ఇంకా నామాట నమ్మకం లేకపోతే వచ్చి చూచుకో.

కళ—లోపల నిద్రపోతున్నదేమో.

సుంద—ఏమో ! లోప లొకవేళ నిద్రపోతే పోవచ్చు.

కళ—అయితే, చూచి చెప్పు.

సుంవ—నేను చెబితే నమ్మవుగా ఋతి నీవే చూచుకో.

కళ—(దగ్గరకొచ్చి) ఏదీ చూణ్ణీ కోటీ!

సుంద—(చిఱునవ్వుతో) ఇదిగో! ఇదిగో!

కళ—ఎక్కడా? ఎక్కడా?

సుంద—ఇదిగో! ఇక్కడ (చేయిపట్టుకొనును)

కళ—(సిగ్గుతో) ఇదేమిటి?

సుంద—(నవ్వి) ఇదా.

ఇది నీచక్కని సొమ్ము; దీనికొఱకే వెన్నాళ్ళు నీ సర్వ సం
పద ధారాగత మిట్లుసేయుటకు తీవ్రంబైన యెంతెంత ఘో
ర దవాగ్ని ప్రళయాబ్ధు బీది దరి జేరన్ గల్గినావో; మహా
పదసౌదామిని! నోము పంట లికపై బందింప గైకోవిదే.

కళ—వదులు. మీఅమ్మ వస్తుందేమో.

సుంద—మనదారి మాఅమ్మగ్గూడా నచ్చుతుంది. ఫరవాలేదు.

కళ—అది కాదు. మీఅమ్మ వచ్చి కోప్పడుతుందేమో.

సుంద—కోప్పడితే నాకేం పరవా లేదు. నిన్ను గురించి నన్నెవరు
కోప్పడినా పడతా.

కళ—ఈప్రతిజ్ఞ తుచ్ఛమోహానికా?

సుంద—కాదు. స్వచ్ఛమైన ప్రేమారాధనకి.

కళ—అయితే, నేను చెప్పినట్లల్లా నడుచుకోవాలి.

సుంద—ఇదా నీయాజ్ఞతప్ప మరెవ్వరియాజ్ఞా శిరసావహించను.

కళ—ఒట్టుపెట్టు.

సుంద—ముందు ఒట్టుపెట్టాలా? ముద్దుపెట్టాలా?

కళ—అదుగో! నాఆజ్ఞ మీరుతున్నావ్.

సుంద—ఇదిగో! ఒట్టు. నీఆజ్ఞ మీరటమే?

కళ—అయితే; నీవేషం నాకేం బాగుండలా.

సుంద—నాకు తెలియలా ఇప్పుడు నీకు పనికిరాని వేషం ఏంవేశాను?

కళ—అదికాదు. ఇటువంటిమీసం. మోటవేషం పనికిరాదు.

సుంద—ఔను. నిజమే. నీకంటేముందు నేనదే అనుకున్నాను.

కళ—అయితే; న్యూ ఫేషన్‌తో ఎప్పుడు కనపడతావ్ ?

సుంద—ఇంకా ఎప్పుడోనా ! ఇప్పుడే కనబడతా.

కళ—నీవు ఫేషన్ మార్చేలోపల వస్తా. ఉండు పోనియ్యి (పోబోవును)

సుంద—(అడ్డంపోయి) ఎక్కడికి ?

కళ—మాయింటికి.

సుంద—ఇది నీయిల్లు కాదూ ?

కళ—తర్వాత.

సుంద—తర్వాతా—అందాకా యెందుకు ? ఇప్పణ్ణుంచి యీ యిల్లు
నీదే. ఈయింట్లో నీవుకనక, కనపడకపోతే ఇహనాపని గ్రుడ్డి
వాడిపనౌతుంది వదలిపెట్టిపోవటం ధర్మంకాదు.

కళ—ఇదిగో ! ఇదే తుచ్ఛమైనవాం.

ఇంత కళాప్రఫుల్లసుమహేమ సుధాంశులు చిమ్ముచున్న శా
కుంతము లెన్నియో శ్రుతులు కోమలగీతిని గల్పుకొన్నవై
ఎంత వసంతరాగమున ఈ కడుతియ్యని ప్రేమదేవతన్
వింతగః గొల్చుచున్నవో; వినిర్మలధర్మకిశోర ! చూడుమీ.

అట్లా వుందాం (వెంకాయమ్మ రావటంచూచి) మళ్ళీ వస్తా !
(పరుగున నిష్క్రమించు)

సుంద—(వెంకాయమ్మని చూడకుండా వెంటబడి) కళా ! కళా !
మాట ఒక్కమాట విని పో

[మడినీ ళ్ళెత్తుకొని వెంకాయమ్మ ప్రవేశం]

వెంకా—అ- అ- అదేమిట్రా. అ- అదేమి అఘాయిత్యం పనిరా
అబ్బీ ?

సుంద—(తెల్లబోయి చూస్తుంటాడు.)

వెంకా—అయ్యో; అయ్యో; ఇంకెక్కడ బ్రాహ్మణీకం ?

సుంద—(దగ్గఱకొచ్చి) ఏమిటండి. అమ్మమ్మగారు ?

వెంకా—ఆరి నీదుంపతెగా తగిలేవ్. మడిమీదమీదకొచ్చిచస్తావేం ?

సుంద—దూరంగానే వున్నాలెండి ? ఏమిటండి ?

వెంకా—ఏమిటా! ఎత్తు భారం పొయ్యిలో బూడిద. సిగ్గులేక అడు
గుతావేం పైగా!

సుంద—అదేమిటండోయ్! నన్ను కొప్పడతారు?

వెంకా—కొప్పడతారా? కోసి కాకుల కేస్తారా? ఉండు.

సుంద—అన్ని చేశావులే పదింకా. (విదళించుకొంటూ తాకపోవును)

వెంకా—ఆరి అర్ధాయుష్యపు ముండాకొడుకా! నామస్నిళ్ళ కాస్తా మన్నుపాలు చేశావు కదరా? నీకేం పొయ్యేకాలం వచ్చి పడ్డదిరా? అయ్యో, అయ్యో, ఈనాటి కుర్రముండాకొడుకుల కేం పోకదల రోజులొచ్చి నయ్యోగాని, వొకమడీ లేదు మైలా లేదు. అయ్యో, అయ్యో, యీ వరసన పెద్దా పిన్నా తారతమ్యం లేకుండా మదించి ప్రతి అడ్డమైన ముండా కొడుకూ తాగి తందనాలాడి కిందా మీదా కానకుండా, యిట్లావిఱచుకు పడి కులాచారాలన్నీ కుమ్ములో పెడుతున్నారు. పదా, చెబుతా. తెగబలిసి యీవరస కంటబడ్డ పిల్లనల్లా పట్టుకొని కట్టుకొందా మని చూస్తున్నావా? ఇట్లా ఎగసిపడి ఎక్కడికి పోతావ్? ఎక్కడికి పోతావంట? నిన్నింకా ఎముకలు విఱగ పొడిపించక పోతే నేను బ్రాహ్మణదాన్నికాను. అరుగో! అమ్మయ్యా? వస్తున్నారులే. వస్తున్నది, బ్రహ్మానందస్వాములు వారల్లేవున్నారు. ఆహా! ఎంత సువర్ణ సుందర విగ్రహం! ఎంత అందమైనగాత్రం! (బిందెదింపుకొని చేతులుకట్టుకొని నిలబడును)

[బ్రహ్మానంద స్వామీ, శిష్యులు
కీర్తన పాడుకొంటూ ప్రవేశింతురు.]

కీర్తన

మహాజన మనోభావా మురళీదేవ! కదలీరావ?
ఆనంద ప్రభావా-త్రైలోక్యవాణీధనా! కారుణ్య వేణీఘనా!
[illegible]కింపవా శిస్రుమే! ప్రజలో ఘోరవస్థా ॥మ॥
కొ[illegible] చూ[illegible]కే [illegible]రులు బిగ[illegible]చకే దేవదేవ!
మహానుభావ నిలుపుకో ఘనానా ॥మ॥

బ్రహ్మ—వెంకాయమ్మా! ఎందు కిక్కడ వొంటరిగా వున్నావు?
వెంకా—దాసీ మనిషికోసం వచ్చా స్వామి!
బ్రహ్మ—రేపు భావయ్యగారింట్లో మంచికాలక్షేపం జరుగుతుంది. తప్పకుండా రా. నిరంకుశకవిని సంస్థానకవిగా తీసికొన్నారు. ఈ నిరంకుశ కవి బహు బాగా చెప్పఁగల ప్రజ్ఞావంతుఁడు. అనర్గళమైన వాగ్ధాటి కలవాఁడు.
వెంకా—ఏం ప్రజ్ఞో లెండి, ఖాలీపోయిన ప్రజ్ఞ.
బ్రహ్మ—అదేమి టట్లా న్నావు?
వెంక—ఏముంది లెండి బ్రాహ్మణీకమంతా మంటగలిసినప్పుడు.
బ్రహ్మ—స్వచ్ఛమైన బ్రాహ్మణుడేనే. ఏంచేశాడు?
వెంకా—ఏం చేశాడా, చెబితే సిగ్గుచేటుకూడా. రత్నంవంటి కూతుర్ని పాచిపనిచేసే దాసీదాని కొడుక్కి ఇల్లాలు చేశాడు.
బ్రహ్మ—అదాఁ ఘోరం! అయితేననే. ఇదిగో! వెంకాయమ్మ! ఈ సంగతి మట్టుకు ఇంకో నరమానవుడికి తెలియకుండా యీనాల్గు రోజులూ బహుజాగ్రత్తగా వుండు. చెబుతా. చేస్తున్నది సప్తాహం, అదీగాక, ఆకవికూతుర్నే మంచి భావయ్యగారికి మాట్లాడుతున్నాం. ఈసంగతి భావయ్యకి కప్పుడు తెలిస్తేమ్మట్టుకు మనం దక్షిణ నోట్లోనూ కరక్కాయి పడేదన్నమాటే. ఇదిగో! వెంకాయమ్మ! ఈ కవిపాట్లు చివరికి ఇక్కట్లుగూడా పడవులే. ఇతణ్ణి గురించి యింకా చాలా విన్నాం.
వెంకా—స్వామీ! మానాడు ఇలాంటి ఘోరకలి యెఱుగుదుమా? చిన్నప్పట్నుంచీ, పిల్లల్ని అదుపూ ఆజ్ఞలో పెట్టుకోకపోతే వంశ ప్రతిష్ఠా నాడు ప్రతిష్ఠా తెగలబడి పోదండీ? అదేమిటో ఆకవిగారింటో అంత నిష్టలబడి కాపురం ఖాలీపోతూన్నది. ఒకాచారం లేదు. మడీ మైలా లేదు. మా సుధాంబుధిగాఁడు వీళ్ళ ఫాడైన చదువుకోసం పాకులాడి చస్తున్నాడు కూడా.
బ్రహ్మ—ఇదంతా కాలమహిమతో పుట్టుకొస్తున్నది గాని, మతం గాదు. భావయ్యమటుకు మహాదాత పేరు గడించాడు. ఇరుగు

పోరుకు వాడవాడలవాళ్ళకీ తలకట్టైనాడు. ఏగోలా లేకుండ అతడికోర్కె తీర్చామా, మనమంతా అదృష్టవంతుల మైనా మన్నట్టే.

వెంకా—మీవంటి స్వాములు తలచుకొంటే అదెంతలెండి. శీఘ్రంగా అయితీరుతుంది. స్వామీ! ఈ దాసురాలి మొరెప్పుడు తీరుస్తారు.

బ్రహ్మ—ఏమిటో! అది మఱచిపోయినా జ్ఞాపకం రావడంలేదు.

వెంకా—మాయింట్లో భిక్ష పెట్టాలని ఎదురు చూస్తున్నా స్వామి!

బ్రహ్మ—అదా? ఈ సప్తాహం వొకటి కానియ్యి, చూద్దాం. పదింకా యెండెక్కు తున్నది. అంటరానివాళ్ళూ అనరానివాళ్ళూ వస్తారు. ఎక్కడ తాకిపోతారో పదా.

వెంకా—స్వామీ! అంతేఅయింది నాపని. ఈకోటికొడుకు లేడు, తాగుబోతు సుందర్రావు తాగి తందనాలాడి నామడి మన్ను చేశాడు. పదండి, స్నానంగూడా చేయాల. (నిష్క్రమింతురు)

[సుందర్రావు ప్రవేశం]

సుంద—మాయవేషాల్తో, కపటనాటకా లాడటానికి, ఈ దొంగ గురువులు, ఈ బోడిసన్యాసులు దేశంనిండా వ్యాపిస్తున్నారు. వీళ్ళవల్ల ప్రజల్లో ఎంత అమాయకత్వం, అనాగరికత బాగా పట్టి మానవసంఘం ఎట్లా మారణసంఘమైందో చూడండి. ఈడూ జోడూ కలసిన యువతీయువకులు వీళ్ళకళ్ళకి గిట్టరు. చక్కని ప్రేమారాధన వీళ్ళబుద్ధికి అసలే పట్టదు. ఈ దొంగ గురువులు లేకుండా పోయినప్పుడే దేశం విజ్ఞాన వికాసాల్తో వుంటుంది. వీళ్ళాటలు సాగినంతకాలం దేశాలు కుక్కల కొట్లాటల్లో వుంటై. (నవ్వి) ఈ కుక్షింభరులు, నామనోహర రాజహంసని పట్టుకొని మొద్దుమొహానికికట్టి, పొట్టపూడ్చుకొంటానికి చూస్తున్నారు. త్రిభువనాలు తలక్రిందులైనా వీళ్ళాటలు సాగనీయను.

పరుగులువెట్టి అంత నవపల్లవకోమలగాత్రి యింత దు
శ్చరితుల కాళ్ళువట్టి, తనచక్కని జీవిత భాగ్యమెల్ల కి
న్నర మధుర ప్రవాహసుఖనాదకళా కిరణాలనుంచి, యీ
దొరలకు ధారఁబోయునని తూరుపురేకలు విచ్చునే మొకో.

[కోటి ప్రవేశం]

కోటి—ఏంరాలయ్యా! ఇయాల పనిలోకి పోలేదేమిటి? ఇంకా ఇంటి కాడ వున్నావ్?

సుంద—ఇవాళ్ళ చాలా బద్ధకంగా వుంది. పోలేను.

కోటి—నేర్నెంటనే నాగాల్పడితే దొరలే మను కొంటారో! అయ్య

సుంద—ఏమనుకోరు.

కోటి—సెల ఎడిగిరాక పొయ్యావా?

సుంద—సెల వడక్క పోతేయేంలే. నాగా లేసుకొంటారు.

కోటి—నాగా ఏసుకొంటారో, తీసేసుకొంటారో, అయ్య! కలమా రాజులుగూడా వారు. పోయి సెప్పొస్తే మంచిది.

సుంద—తీసివేస్తే మతీమంచిది.

కోటి—అదేంటయ్యా! వార్నికోప్పడ తున్నావ్? ఏదీ వొళ్ళు సూణ్ణో (చూచి) ఏడి తగిలిందల్లే వుండది. కూనంతబువ్వ తాగి పండు కొందువుగాని రా అయ్య.

(నిష్క్రమింతురు తెరపడును)

## 2 వ రంగం భావయ్యగారిమేడ

[సాఫాలు, కుర్చీలు, టేబిల్సు, గొప్పగా వేయబడివుండును. పెద్ద సీటులో, నిక్కుతో, ఆచారి, వ్యాపారి ప్రవేశించుచుండగా దేవయ్య యెదురుగాబోయి.]

దేవ—స్వామి! నమస్కారాలు. ఇల్లా దయచేయండి.

ఆచారి—దేవయ్యగారు! నాకోసం ఎవరన్నా వచ్చారా?

దేవ—నేనిక్కడేవున్నా. ఎవరూ రాలేదు స్వామి?

వ్యాపారి—వీరు భావయ్యగారి గుమాస్తాలా?

ఆచారి—ఎబ్బె! కాదండి. వారు భావయ్యగారితో సమానమైన భాగస్వాములండి.

వ్యాపారి—తెలియక అడిగానండి. క్షమించండి.

దేవ—అయ్యో, అయ్యో, అదేమిటిస్వామి! అంతమాటన్నారు.

ఆచా—దేవయ్యగారు! సమస్త వేదశాస్త్రాలలో వీరు అపరవేదవ్యాసులవారు.

వ్యాపా—అభిమానంకొద్దీ అల్లా అంటారుగాని ఈకాలంలోనే నెంత? నా పాండిత్యం ఎంత?

దేవ—మహాత్ములు పైకి చెబుతారండి?

ఆచా—భావయ్యగారున్నారా ఇంట్లో?

దేవ—దేవీ పూజలో వున్నారు

[బడే సాహెబు ప్రవేశం]

బడే—ఛూ, ధిర్గీ ధిర్గీ పానం బేజారై పోతే నాకీ

దేవ—ఏమిటోయ్ సాయబు!

బడే—ఓయ్! హారే నాకీ హోయీాయసి షీర్వావొద్గనీ కదయ్యా 'సెస్తాపై గా, ఫెద్ద ఫెద్దోళ్లా ముందూ లెఖ్ఖాసేకుండా హేమ్మీా!

దేవ—సరేలెద్దూ గొడ్వా, మాలావు కితాబ్ సంపాదించా వెట్టాగైతే యేం.

బడే—హారే హేంతా సిక్కీ హుండా మేరా ముసాల్మాన్కీ బడా ఘోరం హుంది,

దేవ—ఉంటే ఈ నౌఖరీ యెందు కేడ్వాలి?

బడే—(ఎక్కిరిస్తూ) సీకీ సచ్చిపోతావన్నే హీాడ్కీ మొగంసూచీ హెవడ్కీ నౌఖర్ నేయుదూహాండీ, మేరాబడాబాబ్జీ భావయ్యగార్కీసూచీ సేత్తుండాక్. హార్కీహాంటే దిల్మేఅల్లాతో సమానం హాండీ! యేదివాన్కీ సూచీ ఆఖర్కీ ఖూఖుండా ఫెల్లోం ఖూడా నై వుట్నా బాబ్.

దేవ—చూచారా? ఎంతమదంతో కొట్టుకొంటున్నాడో.

ఆచా—(నవ్వుతూ) ఇంకా మీరేం మాట్లాడరేంటి సాయబూ! మీ దొరగారొచ్చే వేళైంది. ఇహ గోల లేకండి.

బడే—రానీ ఖుండీ భక్తీకీ హోతాం. మాకీ రోజూ హుండా గోలేఖ దండి. హెస్నీ సినాట్లూ హేసినా మాకీ బుద్ధీరాద్.

న జోలీకి రాహూద్దూంహనీ మాకీ హెస్నీ పెట్టినా బుద్ధీ హేదీ?

[భావయ్య ప్రవేశం]

[అంతా నిలబడుదురు]

భావ—కూర్చోండి స్వామి! అట్లాకోపంతో వున్నావేం బడేసాహెబ్? మళ్ళీ మీయిద్దరికీ యుద్ధకాండ లేచిందా యేం?

బడే—దాన్కీ నాంగా హుండు హెట్లాహాంటే?

భావ—ఏమన్నావయ్యా? దేవయ్యా?

దేవ—నేనేమంటా. గొడ్డుకొక దెబ్బ మనిషికొక మాట చాలు!

ఆచా—పాపం వారేమన్లేదు లెండి!

భావ—వర్కర్సుతో నిన్ను మాట్లాడొద్దని యెన్ని చెప్పినా నీవు వినవు. నీవూ నీమాటా అంటే వాళ్ళకి లెక్ఖలేదు. పైగా ఈరోజుల్లో పనివాళ్ళదగ్గర ఎంతబెట్టుగా వుండాలి? బడేసాహెబ్ కాస్త పెద్ద పాయంలోంచి వచ్చినవాడు కనక తారతమ్యాలు తెలిసివుంటున్నాడు.

దేవ—నేనే మన్నానండి. వింటున్నారుగా మీరు?

భావ—దీనికి సాక్ష్యాలుకూడా ఎందుకు? నాకు తెలియంది కాదుగా? సరేగాని, భోజనాల పందిళ్ళకిపోయి చూస్తూవుండు వస్తా.

దేవ—వెళతా. నీవు వచ్చింతర్వాత వెళదామని చూస్తున్నా.

(నిష్క్రమించును)

భావ—(నవ్వి) నట్టి అమాయకుడండి ఈకాలపు మనిషికాదు.

ఆచా—అంతే పాపం.

భావ—ఆయనస్తో నీకెందుకోయ్ బడేసాహెబ్? నీపని నీవుచూచుకోక?

ఆచా—అతనుగూడా ఏమన్లేదండి పాపం.

వ్యాసా—ఏమిటో, ఒక్కొక్కవేళా విశేషం అల్లా కనబడుతుంది.

భావ—అంతేలెండి ఆచారిగారు! ఏరేనా మీగురువుగారన్నారు?
ఆచా—చిత్తం. సమస్త వేదశాస్త్ర పారంగతులండి.
భావ—(లేచి) దాసుణ్ణి. క్షమించాలి.
వ్యాపా—చిరంజీవ! సుఖీభవ. మతేం ఫరవాలేదు నాయనా!

అవని నీవు దాసుడవు కావు హరిదాస
పోషకుండవుగాని భూసురేంద్ర!
ఇంత అన్నదాన సంతర్పణ జగాన
చూచి యెఱుగను మఱి చూడబోము.

ఆచా—యథార్థం బాగా సెలవిచ్చారు. నిజంగా

ఈ పురుషోత్తముండు భువనైకవినూత్న యశోవిశాల ని
క్షేపగృహాని కిన్ని నగిషీలను బెట్టె; వరాల తండ్రియై
మూపునబడ్డ భారములు మోసి సమస్త గృహస్థ ధర్మవి
ద్యాపరిపాలకుండయిన దాది సుఖించితిమో గురూత్తమా.

భావ—ఇదంతా మీవంటివారి అభిమాన పూర్వకమైన ఆశీర్వచన భాగ్యం. బడేసాహెబ్! ఇంకా స్వాములవారు రాలేదే? ఎక్కడ కెళ్లారోగాని.
బడే—హార్కీ. హెంకాయమ్మా ఘుర్మేహై జీ.
ఆచా—వెంకాయ మ్మెవరు సాహెబు?
బడే—హా. మీహింటీఫక్కా లేదూ హాండీ వెంకాయమ్మ?
భావ—అయితే? కవిగారింటికి సామగ్రంతా పంపించారా?
బడే—హెళ్ళిందండి.
ఆచా—అయితే? కవిగారు మనమాట యేం చేసినట్టు? వారివల్లకాక పోతే మాగురువుగారిచేత వ్రాయిద్దామని.
భావ—ఎబ్బే కవిగా రంగీకరించారండి. వ్రాస్తున్నారుగూడా. చాలా మేధావంతులండి.
వ్యాపా—అదేం గ్రంథం?
ఆచా—శివపురాణమండి.
భావ—ఇవాళ్ళ కొంచెం వినపిస్తామన్నారండి.

వ్యాపా.—అయితే! ఆభాగ్యంకూడా చూచి పోతాం లెండి.
భావ—అదేమిటి బాగుంది. వెళ్ళట మెందుకు స్వామి? ఈపదిరోజులు
సభాకాలక్షేపాలకి అధ్యక్షులుగా వుండాలని ప్రార్థిస్తున్నా.
వ్యాపా—ఎన్నో చోట్లకి వెళ్ళిరావల్సిన పనులున్నై తండ్రీ!
ఆచా—అవునండి, మనమాట తీసివేయలేక చాలాపనుల్లోంచి
వచ్చారు.
భావ—ఉంటైయండి. అటువంటి మహాత్ములకుండక, నావంటివాడి
కుంటైయండీ పన్లూ? మత్తేం ఫరవాలేదు. అర్జంటైన వుంటే
మనిషిచేత కబురు చేద్దాంలెండి
వ్యాపా—నాయనా! అట్లాఅంటే ఇహ నేనేం చెప్పగలను?
భావ—పరవాలేదు స్వామి! తమదాసుడి ప్రార్థన అంగీకరించాలి.
ఇప్పుడే వస్తాను. (నిష్క్రమించును)
ఆచా—సరే ఉండక తప్పదింకా గురువుగారు?
వ్యాపా—సరే ఏంచేస్తాం. వారట్లా అంటుంటే.
బడే—అఛీ హేమ్జీలెండి. జరూరైనా పన్లూవుంటే మానుకోటం
ఖూడా మంచిది.
వ్యాపా—నిజంగా వున్నై సాహెబు!
బడే—వుండవ్వూ హాండీ మన్సీ జల్మం హై త్రింధర్వాతా హోనోఁ
వుంటై.

[సుందర్రావు ప్రవేశం]

సుంద—సలామండి సాహెబుగారు!
బడే—హారే హేమ్జీ వోఁచ్ సీకీ ఘూడ్వా ఖూఁ౯ా.
సుంద—దొరగా రున్నారా?
ఆచా—సుందర్రావా వచ్చింది?
సుంద—నమస్కారమండీ!
వ్యాపా—ఇతఁ డెవరు?
ఆచా—మనయింట్లో పనిమనిషికొడుకండి. చదువుకొన్నవాఁడు. తెలివి
గలవాఁడు. ఏమిటీ పన్లోకి రోజూ వెళుతున్నావా?

బడే—హా హెళ్తున్నామండి కంచం ఖాడ్కీ మంచం ఖాడ్కీ.
ఆచా—అట్లా అంటాడేం? అదేమిటి?
సుంద—బడేసాహెబు మాటకేం లెండి. వెళ్తున్నా.
బడే—హేప్డూబే? నీకీ సరిగ్గా పన్లోకొచ్చిందీ?
సుంద—సాయబుగారు మామీద చాలా ప్రేమచొప్పున అనేమాట లండి.
బడే—బాత్కర్నఖో. హారే వొయ్యారం సేస్తాన్. హీడ్కీ సేరింధర్వా తా వర్కుషాపులో ఫనోళ్ళందట్కీ రోగాలు హీడ్కీ నాగాలుహాండీ.

[భావయ్య ప్రవేశం]

భావ—ఏమి టది?
బడే—హేమ్లీ లేదూహాండీ. సుందర్రావూ ఆయాహై.
సుంద—నమస్కారాలండి. తమతో వొకపనుండొచ్చాను.
భావ—పనులకేంలే చాలాపన్లుంటై. పట్టుమని పన్లో ప్రవేశించి నెల రోజులైందో లేదో 15 రోజులు నాగాలా అబ్బీ నీకు?
సుంద—వంట్లో బాగా లేదండి.
భావ—బాగా లేకేం? బాగానేవున్నావుగా. లేబర్సు లీడరైనతే పన్లోకి రావడానికి తీరికెక్కడుండి చస్తుంది?
సుంద—జరుగుబాటుకి తీరికచేసుకు రావాలండి.
భావ—అన్నీ వచ్చావులే. అయితే ఏంపనుండొచ్చావ్?
సుంద—రేపు మేడే చేస్తున్నాం. వర్కర్సందటికీ రేపు సెలవ దయ చేయించాలి.
భావ—మేడే చేస్తున్నారో కీడే చేస్తున్నారో కేం తెలియదు.
వ్యాపా—(నవ్వి) బడేసాయబు మాట నిజమే అయింది.
ఆచా—అదేమిటోయ్! సుందర్రావ్! అనుకొన్నంతా చేస్తున్నావ్?
సుంద—నేనే మోసాలూ చేయటంలేదండి. సెలవకోసంవేడుకొంటున్నా.
ఆచా—ఇన్నిలక్షలు పెట్టుబడిపెట్టి వ్యాపారం సాగిస్తున్నది మీ సెలవల కోసమే నన్నమాట?

సుంద—కాదండి. మా రెక్కల్ని చూచి లక్షలు పెట్టుబడిపెట్టారు ?
ఆచా—ఇంకేం రెక్కలు ముడుచుకొంటే పెట్టుబడెట్లా వస్తుంది ?
సుంద—రెక్కలు విఱక్కొడితే యెట్లావస్తుందండి ?
ఆచా—ఆహా. బాగా సమాధానాలు చెప్పడం నేర్చుకొన్నావు.
ఇంకేం ?
భావ—లేబర్సు లీడరైనప్పుడు ఆమాత్రం చెప్పొద్దండీ ? వరేగాని
గురువుగారొస్తున్నారు. మళ్ళీ రా మాట్లాడొచ్చు.
వ్యాపా—ఇంకేం. సెలవిస్తారే. తర్వాత రమ్మన్నారు. ఇంకాయెందుకు
నుంచోటం ? పోరా అబ్బీ స్వామివారొస్తున్నారు.

[వెంకాయమ్మ, బ్రహ్మానందస్వామి ప్రవేశం]

కీర్తన :

బహుమాయా తంత్రమే బలంబౌ
పాడుజగానా, ప్రబలిన నటనకి బాగా బలికాగా
నీతి ప్రపంచమే నిలుచుటకైనా, కనపడదు గురువు కన కొకడైనా
ప్రళయనాటకలీలా నటనలలో ॥బహు॥

(అందరూ నమస్కరింతురు)

బ్రహ్మ—ఇంకా కవిగారు రాలేదా ?
భావ—చిత్తం రాలేదు స్వామి ! కబురుచేస్తా. బడేసాహెబ్ !
బడే—జీ
భావ—కవిగార్ని అర్జెంటుగా వెంటబెట్టుకురా.
బడే—సిత్తం. (నిష్క్రమించు)

(అక్కడే ప్రక్కన సుందర్రావు నిలబడును)

బ్రహ్మ—అయితే ! భావయ్యా ! కవిగారి కుమారైను నువ్వు
చూచావుకదూ.
భావ—చిత్తం చూచానండి.
బ్రహ్మ—నేను చెప్పేది విను. నీ వింకా బ్రహ్మచర్యదీక్ష చాలించి,
గృహస్థాశ్రమం స్వీకరించాలి. అప్పుడుగాని మావంటి యతు

లకు గతు లుండవు. అదీగాక, కొన్నిక్రతువులు గృహస్థుడై గాని చేయకూడదు. శీఘ్రమే ఆలోచనలో పడాలి.

**వ్యాసా**—ఆ దేమిటండి? ఇంకాఆలస్య మెందుకు? అవశ్యంచేసుకోవాలి.

**ఆచారి**—ఇన్నాళ్ళూ గురువుగారి అనుజ్ఞకోసమే చూచారు. ఇంకా తప్పదులెండి చేసుకొంటారు.

**వెంకా**—కవిగారిపిల్లని మాట్లాడుకోండినాయన! బంగారుతీగె. ఈడొచ్చినపిల్ల, వెంటనే కాపరాని కొస్తుందికూడా.

**బ్రహ్మ**—గడపదగ్గఱ పెట్టుకొని గ్రామగ్రామాలూ తిరగడమెందుకు? వెంకాయమ్మా! నీ వన్నట్లు కవిగారిపిల్లనే కుదుర్చుదాం.

[బడేసాహెబు, నిరంకుశకవి ప్రవేశం]

**భావ**—(లేచి) నమస్కారమండి కవిగారు! ఇట్లా దయచేయండి.

**నిరం**—స్వామీ! నమస్కారం.

**బ్రహ్మ**—కూర్చోండి. అంతా మీకోసమే ఎదురుచూస్తున్నాం.

**నిరం**—అదంతా మీ అనుగ్రహభాగ్యంస్వామీ! (కూర్చుంటాడు)

**భావ**—అయ్యా! కవిగారు! తమ కవితా సుధారసం కొంచెం ప్రసాదించండి. మొన్న భారతదేశ ప్రశస్తిగురించి సెలవిచ్చిన పద్యం వినిపించండి.

**నిరం**—చిత్తం. అట్లాగే.

తొలిసీలిమబ్బులు చలిగాలిరెబ్బలై
ఏ చక్కని తలాన లేచిపోయె?
పసికూన గాడ్పులు ముసినవ్వు పాన్పులై
ఏ కమ్మని గృహాన దూకిపోయె?
చిఱునవ్వు కన్నెలు చిఱుమావి గున్నలై
ఏ చల్లనిజగాన పూచిపోయె?
నగుమోము రతనాలు నగిషీల వెలుఁగులై
ఏ పచ్చని పొలాన ఈసిపోయె?

ఆ మనోహర కిరణాలు ఏమహిమపయి
కొలకఁబడి గొప్ప కళలను చిలికిపోయె ?
వాటి రమణీయతలు వెట్టి ఎన్నె దెచ్చి
భరతఖండ సముద్రుడు విఱుగఁబడియె.

వ్యాపా—ఈ తక్షణం ఆశువులో అదే వృత్తం అల్లగలరా కవిగారు!

నిరం—చిత్తం.

ఎపుడు డీకొనెడి మదపుటేనుగుల మెదడు
చిట్లగొట్టుసివంగి జట్లవలన
కడలేని మృదువాణి యొడిలోనగలవాని
నోరె తేనీయని వారివలన
చెమటబిందువులోని సిరుల సుందరిమేని
కందకుండగనేలు ఘనులవలన
ఎగిరిపోయెడిప్రాణి కెదురుపోయినగాని
నిలువనేరని దయానిధులవలన
సకలదేశ నిరంకుశోచ్ఛ్వాసవేష
భానురావేశ జీవితాభ్యాసములకు
గ్రాసవాసములకును సంగ్రామములకు
దిక్కు మొక్కైన భారతీయు లెల్ల.

బ్రహ్మ—ఎంత సమాసం విసిరారండి! చాలా ధారాశుద్ధి గలది మీ కవిత్వం.

వ్యాపా—ఈధార గ్రంథ మంతటా వుండదు.

ఆచా—అయితే! కవిగారు! గ్రంథం ఎంతవఱకు వచ్చింది?

వ్యాపా—ఏంగ్రంథం?

ఆచా—శివపురాణం వ్రాస్తున్నారండి.

భావ—చాలా రసవంతమైన కవిత్వం లెండి.

బ్రహ—ఏదీ కవిగారు! అందులో దొకటి వినిపించండి?

కవి—చిత్తం (పుస్తకం తిరగవేస్తూ)

కూర్చుని లేవలేని ధనికుండు సఖుండని కొండమెక్కి మో
దార్చికుంటు బిసీమణిని దారుణమైన క్షుధాగ్ని యేమి చ
ల్లార్చు కొనంగలేక, తుద కందటి కొంపలు మాయఁజేసి యి
ల్లార్చెడి చిచ్చుదయ్యెవు మతా దొరవైతివిరా మహేశ్వరా.

బ్రహ్మ—(నవ్వి) బాగా చెప్పావయ్యా!

వెంకా—నా కర్థం కావడంలేదు. ఏమిటి స్వామి?

బ్రహ్మ—అర్థమా! చెబుతావిను. ఈశ్వరా! కొండంత కోటీశ్వరుణ్ణి స్నేహితునిగా పెట్టుకొనివున్నా నీకుటుంబపు ఆకలిమంట చల్లార లేదని, అందటి కొంపలూ నిలువునా ఆర్పివారేస్తున్న కొఱవి దయ్యాలకి దొరవైనావా అని చమత్కారంగా చెప్పారు.

బడే—బహుత్ అచ్ఛాహై పండిత్సాబ్!

వెంకా—చూడండి ఈపద్యానికి సాయబుగూడా ఎంత సంతోష పడ్డాడో.

ఆచా—అంతలోదే, ఇంకోటి సెలవివ్వండి కవిగారు?

నిరం—చిత్తం చదువుతానండి!

భోగము లేమిమట్టనని బూడిద దట్టముగా సమస్త వాం
ఛా గృహరాజదేహ ధనసౌఖ్యము రేగని మాడ్కి రుద్ధి, బై
రాగిగఁ జేరి, యెంత గిరిరాజకుమారిని లేవగొట్టి యీ
దాగుడుమూఁత నాటకము దాఁచ దలంచి తపించి తోమృడా!

వెంకా—దీని అర్థం అసలే తెలియటంలా.

బడే—నీకీ, నాకీ యే అర్థాల్ ఫస్కీరావ్రాలే హమ్మా. ఫడోవండి త్సాబ్!

బ్రహ్మ—(మొహం చిట్లించి) ఇదేం శివపురాణమండి!

వ్యాపా—ఏమిటో! అంతా నిందాస్తుతిగా వుంది.

ఆచా—ఏది గురువుగారు! మీరు వ్రాసిన లింగపురాణంలోది వొకటి సెలవివ్వండి.

వ్యాపా—అదే చూస్తున్నా. ఏమీ జ్ఞాపకం రావడంలేదు.

బడే—హారే! హిష్గా హీలింగపురాణం కైకూరే? ఘాన్కాంలో ఫుడ్కాహల్లే

భావ—నువ్వేం మాట్లాడక సాహెబు!

ఆచారి—నా కొకటి జ్ఞాపకం వచ్చింది. ఇదెంత చక్కగా చెప్పారో వినండి.

వెంకా—ఏదీ కానియ్యి నాయనా!

బడే—మాధీ హింకా ఏగానీ హులుండాధీ

ఆచారి—వినండి

హరి సురమంగళాచరణ! హైనుమతీ సుగుణైక జీవనా!
పురహర కారణా! భుజగ భూషణ! పాపమహావినాశనా!
స్మరహర పావనా! దనుజమర్దన! జ్ఞానకళాత్రిలోచనా!
గురుగిరి ధారణా! సుజనకోటి యశోధన! భక్తచందనా.

బడే—హీజాబితా హంతా హెక్కడ్డీ హాండి! భలే తమాషాగా హులుంధీ.

భావ—ఇదివ్యాపారిగారిదేనా? ఎంతభక్తిసుధారసంచిమ్ముతున్నదండి.

బ్రహ్మ—అట్లావుండాలి కవిత్వమంటే. సరే! కవిగారు! ఇంతకాలం నుంచి భావయ్యగారి ప్రాపకం సంపాదించి కూడా పిల్లపెళ్ళి గురించి తలపెట్టుకో లేదేమండి?

వెంకా—పిల్లపెళ్ళీడు కొచ్చించి కూడామటి.

ఆచా—మటేనండి

వ్యాపా—మనిళ్ళల్లో ఇంతకాలం పెళ్ళిచేయకుండా వుంచగూడదని ధర్మశాస్త్రాలు చెబుతున్నై.

భావ—సర్వశాస్త్రాలూ తెలిసికూడా కవిగారు మిన్నకున్నారు.

బ్రహ్మ—ఏమిటండి కవిగారు!

నిరం—పిల్లపెళ్లి సంగతి పిల్లక్కావలి.

ఆచా—అదేమిటండి? కన్నావాళ్ళెందుకు మటి?

నరం—చూచి ఆనందించటానికి.

వెంకా—మానాడు ఈ నాజూకు లేదుగం. స్వతంత్రాలేదుగం. అందుకే కాల మిట్లా మందుకు పోతున్నది

బ్రహ్మ—సరేగానీండి కవిగారు! పెద్దవాళ్ళమైవుండి యేదో చెప్పక మానం. మఱి వింటారా?

నిరం—ఏమిటో చెప్పండి?

బ్రహ్మ—మఱి భావయ్యగారు పెళ్లిచేసుకోవాలని సంకల్పించారు.

నిరం—మంచిదే గాండి.

బ్రహ్మ—మీరు సమ్మతిస్తే మీపిల్లని కుదురుద్దామని చూస్తున్నాం.

నిరం—అదిమట్టుకు పెట్టుకోకండి.

వ్యాపా—చాలా కలవారు కదండి

నిరం—కావచ్చును.

ఆచా—మీ పిల్లకి పెళ్ళిచెయ్యరా?

వెంకా—అయ్యో, అయ్యో చెయ్యరేమూ గూడా.

నిరం—అదంతా మన కెందుకు? మనం కర్తలంగాము

బ్రహ్మ—అయితే ఎవ రంటారు?

నిరం—పిల్లజీవితం

బ్రహ్మ—పిల్ల జీవితానికి కర్తలెవరు!

నిరం—ప్రేమించిన ప్రియులు.

ఆచా—ఇంతకు ముందేఎవర్నైనా నిర్ణయించుకొన్నారా మీరు?

నిరం—ప్రస్తుతం అది అనవసరం.

బ్రహ్మ—కవిగారు! అసలు వివాహాలు చేసుకోడం ఎందుకు?

నిరం—ఎందుకా! పీడిస్తున్న సంఘాన్ని బ్రతికించుకొంటానికి, ఈ నాటి వివాహ ధర్మాలు, వివేక ధనాన్ని నాశనంచేసి బల పరాక్రమ పౌరుషాల్ని నిరసంచేసి పనికిమాలిన పనిముట్లుగా తయారుచేసినై మానవజాతి కెప్పుడుఈపాపిష్టిసనాతనవినాశన శాసనాలు లేకుండా పోతయ్యో అప్పుడు విశ్వమానవసంఘ

మంతా తేజోవంతంగా వుంటుంది. జగత్ప్రాణమైన ప్రేమ పుట్టినప్పుడే దాంపత్యధర్మం తెలుస్తుంది. అది తెలుసుకోకుండా మంత్రాల్ని దవడకింద నలగ గొట్టి చక్కని సుకుమార దాంపత్య రాగరసాన్ని గడ్డ కట్టిస్తున్నారు. ఇట్లా గడ్డకట్టి, చెదలుపట్టిన శాస్త్రాలకి మురిసేవాణ్ణి కాను. జడిసేవాణ్ణికాను. అస్థిరమైన ఈ ధనకనక వస్తువాహన సువర్ణ సౌధాలకి నాపిల్లని అమ్ముకోను. నిర్మలమైన ప్రేమతో ఏకులస్థుణ్ణైనా సరే, యెంత కటికదరిద్రుణ్ణైనా సరే నా పిల్లప్రేమిస్తేమట్టుకు సమ్మతిస్తాను. సంతోషిస్తాను. నాజీవితం నా కధికారమైనట్లు, నాపిల్లజీవితం నాపిల్ల కధికారిగా వుంది.

బ్రహ్మ—వ్రాతలోవుంటే యేవీ అడ్డురావు.

ఆచా—అంతే స్వామి!

భావ—సరే; మీఇష్టం వచ్చినట్లే వుండండి కవిగారు!

వ్యాసా—ఇప్పు డిష్టంవచ్చినట్లే వుంటాం, కష్టం వచ్చినప్పుడుగాని కాళ్ళూ గడ్డాలు పట్టుకోము.

నిరం—రానీయండి కష్టాలే నా అదృష్టాలు.

ఆచా—పోనీయండి కవిగారి వాళ్ళేమిటో తిక్కలో బడ్డారు.

నిరం—తిక్కలోగాదు. డొక్కలోం బడ్డాను.

భావ—ఎక్కడపడితే మా కెందుకు? మీపని మీరు చూచుకోండి.

నిరం—(లేచి) మంచిది సెలవు. (నిష్క్రమించు)

ఆచా—ఇంత అతిశయం పనికిరాదు.

వ్యాసా—తల విసురుడున్న చెట్టు పడకమానదు.

బ్రహ్మ—ఈదూకుడే ఇతణ్ణి పాడుచేస్తున్నది.

వెంకా—వెనకంటి కెవడో చెఱువుమీద కోపంవచ్చి ముడ్డెండ బెట్టుకొన్నాడట.

భావ—అసలు నాదే పొరబాటు ఇటువంటి అనామకుల్ని తెచ్చి అందలాని కెక్కించబట్టికాదూ ఇంత వదరుపోతులైనారు కానీ

యుండి వీని దూకు డెంతవఱకున్నదో చూచిగాని వదలి
పెట్టనులెండి. స్వామి ! మీా దేవతార్చనకి వేళకూడా అతిక్ర
మించింది.

బ్రహ్మ—ఎట్లా దారికొస్తాడో చెబుతా పదండి.

(అందఱూ నిష్క్రమింతురు)

(బడేసాహెబు, సుందర్రావు కలిసి)

బడే—హారే ! హెటువొంటీ పాపిష్టీ ఖాలంహొచ్చి పడ్డాద్ ? హారే, ఈ మెహార్బానీగాళ్ళీ మాటా డమ్మ చాత్రం హైంధీబే. హింకెక్డా నాయాన్కీ ఖూడూవాఉంధీ ? హారే హింథాపిచ్చా మారాజుకీ హింతకూ రోజులూ బాగాలేవు ఖామల్లూ ఈ దళారీదార్లకీ మాట హినీ, మా భావయ్యాఘూడ్కీఘూడా బుద్ధీ ఖరాబ్ హెంధీ. అసల్ హీడ్కీ. యీా పంధీ మొసాం నాయాల్కీ హారే హెవడూ ఫల్లానీ హితాడూ బే ? హింకా హీడ్కీ గ్యాన్‌ఖొట్టీఖొట్టీ హిటువంటి డాఫర్ గాళ్ళంతా ఖొంపా ఘుల్లానేసీ పోతుండార్. హారే హిళ్ళీఖంటే నోరూగలవోణ్ణి సూస్తే హీం పచ్చూనాయాళ్ళీ గుండెల్ తాపామర్బాల్ వాహి సైబే. హేథోవంకల్ హేరీహెళ్ళా ఖొట్టూర్ హారే హెక్డా పన్నానీరే ? హామేపా ఔంకాయయ్మకీ హెంటూ వాఉంటాడ్ ఘూయేవాలా ఘురువూరే. హీంపూామీాదా భరువుఘూనీ.

సుంద—సాహెబూ ! ఇట్లాకష్ట జీవాల్ని నలుచుకుతింటున్న ఇంత ఘోరదారుణ బ్రాహ్మణ రాక్షస [illegible]ాలు నశించి పోతే గాని ప్రపంచశాంతి కనబడదు ? కష్ట[illegible] కోసం సర్వస్వం ధారాగతం చేస్తున్న యీా పరంకుశకవి చక్రవర్తిని ఇంతసనాతనలోకం ఎట్లా నిరసించి నిర్దాక్షిణ్యంగా చూస్తున్నదో చూడు. ఈ ధనమదాంధకార వేదాంత విషసర్పాలే ఇటువంటి మతాల మధ్యా కులాలమధ్యా కాలకూట విషాన్ని గ్రక్కుతున్నై. ఏమైననూ సరే మనకష్ట జీవాలంతా ఏకంకావాలి. మనకవి

చక్రవర్తి చూపించిన త్రోవతోకాళ్ళాలి. ఉద్యోగాలూడనీ కూడు నీళ్ళకి మాడనీ యీనిరంకుశ బ్రాహ్మణరాక్షస ప్రభుత్వ రథసారథ్యం సాగనీయకూడదు.

ప్రొద్దులుగూకులు బక్కబొమికలు తగిలించి
వెట్టిదేవుని ముల్లె విప్పినారు
బురఖాలు మార్చి కాపురములు పడఁగొట్టి
పిచ్చి దొరని వీధిఁబెట్టినారు
భ్రమ లెన్నియో పెట్టి పరుగులు వెట్టించి
నోరులేని ప్రభుని దూరినారు
హెచ్చుతగ్గుల యుఱికుచ్చులు తగిలించి
కొనప్రాణమును బలిగోరినారు
ఈ ప్రళయకాలఘోరమహీతలాన
మండుచుండిన ఆకలి మంటలందు
నూదుచున్నారు నిరుపేదమానవులను
ప్రేమలేని బ్రాహ్మణసార్వభౌములోర.

బడే—అచ్ఛాహై ఏబాత్ సచ్ హై.

సుంద—సమ్మెకడితే గాని వీళ్ళదిమ్మ కుదరదు. పదా.

(నిష్క్రమింతురు. తెరపడును)

---

3 వ రంగం, కవిగారి గృహం

[కళ, కవి ప్రవేశం]

కళ—నాన్నా ! ఎందు కంత చికాకు పడుతున్నావ్ ?

నిరం—ఏంలేదమ్మా !

కళ—ఏంలేకపోతే యెందు కట్లా వున్నావు ?

నిరం—ఎట్లా వున్నాను ?

కళ—కాలరుద్రుడు మాదిరి.

నిరం—పాపిష్టిసంఘం అట్లా తయారుచేసింది.

కళ—మళ్ళీ ఎవరన్నా తగువు పెట్టుకొన్నారా ?

నిరం—ఎవరోకాదు. భావయ్యగారే.

కళ—మన కెందుకు భావయ్యగారితో పోట్లాట ?

నిరం—ఎందుకో చెబుతా. నే నడిగిందానికి నీవు భయంలేకుండా చెప్పాలి.

కళ—నీ వడిగే దేమిటి ? దానికి భయ మెందుకు ?

నిరం—అయితే విను. అసలు నీ పెళ్ళినిగురించి వచ్చింది తగాదా. నిన్ను భావయ్యగారి కివ్వమని భావయ్యగారి గురువులు స్నేహితులూ నన్ను బలవంతపెట్టారు దానికి నే నేమీ సమ్మతించలేదని భావయ్యగార్కి నామీద చాలా కోపంవచ్చింది వారి సంస్థానానికీ నాకూ ఋణం తీరింది అయితే నీవు జ్ఞానం వచ్చిన పిల్లవి. నీ వెట్లా సమ్మతిస్తే అట్లా చేస్తాను. ఫరవాలేదు చెప్పు తల్లీ !

కళ—నాన్నా ! ఈ ధనిక లోకానికి కళ్ళులేవు. పేదవాళ్ళని బానిసలుగా చేసికొని, సర్వసౌఖ్యాలు అనుభవించటం మరిగింది. అసలు నాకూ భావయ్యకీ ఈడూజోడూ ఎక్కడ వుంది ? భాగ్యవంతులదగ్గర కొంతమంది దళారీదార్లుచేరి, మెరమెచ్చు మాటలుచెప్పి మనవంటివాళ్ళకి వురికుచ్చులు పోద్దామని యిట్లాచూస్తుంటారు. ఏకులమైతేయేం? ఎంతలేనివాడైతేయేం? కోటి కొడుకు నీతికి నిల్చి, పేదవాళ్ళకోసం ఎంత పాటుపడుతున్నాడో చూడు ?

నిరం—నిజమే తల్లీ ! సుందరరావ్ చుట్టుపట్ల కల్లా ప్రాణమైనవాడు, బుద్ధిమంతుడు, తెలివిగలవాడు నీకు జోడైనవాడు ఏదెట్లాగైనాసరే ! నీవు సమ్మతిస్తేమట్టుకు నిన్ను సుందరరావుకిద్దామని సంకల్పించాను.

కళ—సంఘంచూచి సహిస్తుందా నాన్నా ?

నిరం—నీవు సమ్మతి స్తేచాలు, తర్వాత సంఘం కాదంకదా హరిహర బ్రహ్మాదులు దండెత్తివచ్చినా భయపడను. ప్రతిజ్ఞ తప్పను.

[మాధురి ప్రవేశం]

మాధు—ఏమిటండోయ్! తండ్రీ కూతుళ్ళు పెద్ద ప్రతిజ్ఞలు పడుతున్నారు?

నిరం—నీవొచ్చావింకా?

మాధు—నేను వినగూడదా యేమిటి?

కళ—నిజంగా నీవిప్పుడు వినగూడనిదే.

నిరం—ఔను. నీచెవి నిప్పుడు పడగూడదు.

మాధు—ఎప్పుడో అప్పుడు పడకుండా వుంటుందా?

నిరం—ఇంకా ఎప్పుడో వింటే ఫరవాలేదు.

మాధు—అబ్బా! చెబుదురూ?

నిరం—కోప్పడవుకదా?

కళ—వద్దు. కోప్పడుతుందే!

మాధు—దానిమాటకేం లెండీ! చెబుదురూ?

నిరం—ఈరోజుతో భావయ్యగారికీ మనకూ ఋణం తీరింది. తగాదా పడ్డాం.

మాధు—అయిందీ? మనకెక్కడ సుఖజీవనం ఇముడుతుంది! వారితో ఎందుకు పెట్టుకొన్నారండీ!

కళ—ఇందుకే నీకు చెప్పగూడదన్నది.

మాధు—ఆసి! వూరుకోవే! తండ్రికి తగ్గ కూతురువు పుట్టావ్.

నిరం—నాజీవితం వొకరి సలహా చొప్పున ఎప్పుడూ నడచుకోదు.

మాధు—నడుచుకోకపోతే మానెండి ఒకప్పుడు నడుచుకొన్నారు కన కనా! ఏకొంప మునిగిపోయే సలహా ఇచ్చారు?

నిరం—భావయ్య మనపిల్లమీద చూపుపెట్టుకొని, దగ్గరున్న వాళ్ళ చేత అడిగించాడు. వినకపోయినానని తగాదా పెట్టుకొన్నారు.

**మాధు**—ఔనుగాని, అన్నివిషయాలూ మీ కెందుకు? దరిద్రంలో బడి పిల్లకి పెళ్ళిగాక, వొకచెంపన దిగులుపుట్టి వస్తున్నమాట మఱచి పోయినారా? నిక్షేపంగా పెద్దసంబంధం వచ్చిందిగదా అనిసంతోషించాల్సింది కాస్తాపోయి, తగాదా పెట్టుకొచ్చారా?

కళ—నాన్నా! దీని కెందుకు చెప్పావే?

నిరం—ఫరవాలేదు. (మాధురివైపు తిరిగి) దిగులుపడక, అమ్మాయికీ నెల్లోనే పెళ్ళిచేద్దాం. ఈడూ జోడూ కలసిన వరుణ్ణి మాట్లాడుకొచ్చా.

**మాధు**—చాల్లేద్దురూ, ఎవరన్నా వింటే నవ్విపోతారు రాజసౌఖ్యాలిచ్చి పోషిస్తున్న వార్ని వదులుకొని బిడ్డపెళ్ళిమట్టుకు చేయట మెందుకు? మానుకోండి. నాతో ఏం చెప్పొద్దు.

నిరం—నీవుగూడా ఈ మూఢలోకంలోబడి వుండటంచేత నీకెక్కడ నాజ్ఞానం అంటుతుంది? నీకూడా కావల్సింది ధనం. దానికి

ధనవంతుండనుగాను, సౌఖ్యసుమ సౌందర్య ప్రపంచంబులో
గుణవంతుండనుగాను, లాలనకళాగోపాలకత్వంబులో
వినుమీ! మాధురి! నిన్ను దృష్టిపఱచన్ వీఁ డర్హుఁ డెట్లౌనె? వీ
నిని ఈతత్క్షణ మింక వీడిచనుమీ నీభాగ్యభోగ్యాలకున్.

**మాధు**—నాభోగభాగ్యాలన్నీ యిక్కడే వున్నై.

నిరం—ఉంటే, నామాట కడ్డం వచ్చేదానివే కావు.

**మాధు**—రావద్దుమటే, ఒక్కొక్కదానికి అడ్డురావాలి.

నిరం—అదే పనికిరాదు.

**మాధు**—ఇదే పనికిరాదు.

నిరం—అయితే నీవడ్డం వస్తే ఆగే దేమిటి?

**మాధు**—అవసరమైనది అక్కఱకు మాలినది.

నిరం—అవుచూస్తా. అమ్మాయిని కోటి కొడు కివ్వటాని కిష్టపడ్డాను. ఇస్తాను.

**మాధు**—చాల్లేండి. ఎవరన్నావింటే నవ్విపోతారు. ఏమిటా పట్టుదల?

నిరం—పరిహాసమూ కాదు. పట్టుదలా కాదు. నిజం చెబుతున్నా.

మాధు—నా గొంతులో ప్రాణ మున్నంతవరకూ యీ పని జరగనీయను.

నిరం—(నవ్వి) కళా! మీ అమ్మకీ నాకూ ప్రతిజ్ఞ లేమిటి?

కళ—అమ్మా! నా పెళ్ళి సంగతి మీ కెందుకు? నేను పెళ్ళి చేసుకొనేది నా జీవిత సౌఖ్యానికి. మీ యిష్టం వచ్చినట్లు నేనేమీ నడవను. నడవకూడదు.

మాధు—చెప్పినమాట వినకపోతే నే నెందుకే నీకు? అమ్మానూ లమ్మానూ.

నిరం—నువ్వు నేను చెప్పినమాట విననప్పుడు నేనుమాత్రం నీ కెందుకే?

మాధు—పిడిచి పెట్టపోండి. వద్దంటేగా!

నిరం—కళా! మీ అమ్మ సాహసం చూస్తున్నావుగా;

సంపాదన లేదనీ, నగానాణాలూ పెట్టాను కాదనీ, యెంత తేలిగ్గా చూస్తున్నదో చూడు. నా పౌరుషం చంపుకొని, నేనొక బానిసగా వుంటే మీ అమ్మకి సంతోషం. నేనట్లా వుండలేను. పొట్టకోసం అడ్డమైనవాళ్ళ కాళ్ళు పట్టుకోటం నాకు చేతకాదు. ఈ నిష్ఠురుడి మొహం చూడటం సిగ్గువేసి కామల్ను లేచిపొమ్మని వార్నింగిచ్చింది. ఇంకా నేనెందుకు? ఒక్క నిమిషం వుండను. నా మనః స్ఫూర్తిగా చెబుతున్నా! నీయిష్టం వచ్చినవాణ్ణి చూచి పెళ్ళిచేసుకో తల్లీ! నేనెక్కడ వున్నా సంతోషిస్తాను. ప్రయోజకుడై డబ్బుమూటలు కట్టుకొస్తే యీ పాపిష్ఠిలోకం గౌరవిస్తుంది. ఏ దేశమున్నా పోయి, స్వతంత్రంగా బ్రదికి; డబ్బు సంపాదించుకొస్తేగాని నా కిహ నిద్ర పట్టదు. తాతయ్యనీ, నాయనమ్మనీ తెనాలి తీసికొనిపోయి పెదనాన్న దగ్గర దిగడిచి, వస్తాను. ఎప్పుడు జరుగుబాటు లేకపోతే అప్పుడు, మీ ఇష్టం వచ్చినట్లు నీ అమ్మమ్మ దగ్గరకి పోండి. తెనాలి నే నిప్పుడే వెళ్ళేది. రైలువేళయింది. (లేచును)

మాధు—ఏమిటే సాధింపు ? లేకపోతే పస్తులు పడుకొంటాగాని పుట్టింటి కెప్పుడూ పోయేదాన్నిగాను. ఏకుమురులో నన్ను నాటారో అక్కడే వున్నా, లేకపోయినా పడిచస్తాగాని, పుట్టింటికిపోయి పాడుచావు చచ్చేదాన్నిగాను. పారిపోవటం నాకు చేతగాదు.

నిరం—అంత ధైర్యసాహసాలుంటే ఇక్కడేవుండు. ఇంత నిర్భాగ్యుణ్ణి మీరు చూడవద్దు. ప్రయోజకుణ్ణై వచ్చినప్పుడు చూద్దురుగాని.

కళ—నాన్నా ! నామూలంగా మీరెందుకే తగాదా పెట్టుకొంటారు ?

నిరం—నే నెవరిమూలంగా తగాదా పెట్టుకోలేదు. నా అప్రయోజకముఖం మూలంగానే తగాదా పెట్టుకొన్నా. నాకెవరూ నీతులూ ధర్మాలూ చెప్పొద్దు. వినేవాణ్ణి కాను. నాకడ్డం రాకండి. (నిష్క్రమించును)

కళ—ఇదంతా నీమూలంగా వచ్చింది.

మాధు—వస్తే వచ్చిందిలే. ఇరుగు పొరుగువారితో గోలపడతామా ఎక్కడకీ పోరు. మీనాన్న బెదిరింపు లిట్లాగేవుంటై. ఎట్లాగైనా బెదిరించి కాపురం వర్ణసంకరంగూడా చేద్దామని చూస్తున్నారు. ఎందుకూ ? చదువుంటేనేసరా ? లోకానికి వెఱచి నడుచుకొనే జ్ఞానం గూడా వుండాలి. పరువూ ప్రతిష్ఠా కాపాడుకోవాలి.

కళ—నిజంగా ప్రయోజకుడౌతాడేమో చూచొస్తా. (నిష్క్రమించును)

మాధు—మొదణ్ణుంచీ యింతేపట్టుదలమనిషి. మంచికైతే వినవచ్చు. చెడు గ్గూడా పట్టుదలపడితే వినేదెట్లా ? కుడికన్ను దురుతున్నది. చెబితే వినేమనిషికారు. రామయ్యతండ్రీ ! భోగభాగ్యాలివ్వక పోయినా మావంటి వాళ్ళకి మంచిదారి చూపించి బ్రతికించలేవా ? మమ్ము కన్నవాడివికావా ?

నీ మృదుమాధురీ మురళి నిర్మల రాగముఁ దీపి కోకిల
స్వామికి నిచ్చెగాని; ఘనసంభ్రమ సాగర చక్రవర్తి కే
జామున గూడ కమ్మఁగఁ బసందుగ నివ్వకపోయె; నేఁడు నా
నోముల పంట పండుట కనుగ్రహ మేది జగన్మనోహరా.

[కళ ప్రవేశం]

కళ—అమ్మా! నిజంగా నాయనమ్మనీ తాతయ్యనీ తీసికొని వెళ్ళాడే. నాన్న.

మాధు—వెళ్ళనీ. ఇక్కడ జరుగుబాటు లేక దిగడ్బిరావటానికివెళ్లారు. ఏం ఫరవాలేదు.

[సుధాంబుధి ప్రవేశం]

సుధా—గురువుగా రెక్కడి కండీ వెళుతున్నారు?

మాధు—ఎక్కడకీలేదు తెనాలి. ఎందుకూ? ఎవరన్నా కబురుచేశారా?

సుధా—భావయ్యగారే చూచిరమ్మన్నారు.

మాధు—మటిదారిలో కనిపించినప్పుడు చెప్పొద్దూ?

సుధా—చెప్పానండీ. ఎందుకో చాలాకోపంలో వున్నారు. వినిపించుకోలేదు.

మాధు—ఎప్పుడున్నదేగా కోపముతాపమూ? తెనాలివెళ్లారని చెప్పు.

సుధా—సరేనండి. (నిష్క్రమించు)

కళ—అమ్మా! చెబితే వినని వాడని తెలిసికూడా ఎందుకే వాదం పెట్టుకోటం?

మాధు—ఆయనమాట సరే, నీవు విన్నావు?

కళ—ఏదో మాటవరసకంటే దాని కింత పట్టుదల యెందుకే?

మాధు—చాల్లేద్దూ, నీమాటలూ నిన్నూ చూస్తే వళ్లు రవరవా మండుకుపోతుంది.

కళ—సరేగాని నాన్నెప్పుడొస్తాడో యేమో.

మాధు—ఏమోమరి, వెంట పోకపోయినావ్?

కళ—వెంకాయమ్మ కాబోలు వస్తున్నది

మాధు—ఏదీ? సరే! నీవు వెళ్ళి నీచదువుధ్యాసలో వుండు.

కళ—నేనేమీ వీరారు చెప్పుకొనే రహస్యాలు వినన్లే.

[వెంకాయమ్మ ప్రవేశం]

వెంకా—కవిగా రూళ్ళో లేరా యేమిటి?

మాధు—రండి పిన్నగారు! లేరు. ఈపూటే తెనాలి వెళ్ళారు.

వెంక—వాకిట్లో గురువుగారున్నారు, చెప్పొస్తాను. (నిష్క్రమించు)

కళ—ఎప్పుడూ, ఈమె ఆస్వాములువార్ని పట్టుకొనివుంటుందేం?

మాధు—ఓసి నీనోట్లో గుడ్డలుకుక్క, అదిగూడా మన కెందుకు?

కళ—ఇటువంటివాళ్ళని చూస్తేనే, నాన్న కసహ్యం.

మాధు—ఆసి నీ అంకెళ్ళొత్తా, వస్తున్నదే.

[వెంకాయమ్మ ప్రవేశం]

వెంకా—స్వామివారు మనయిల్లు చూడాలని వస్తున్నారు.

మాధు—పేదవాళ్ళం, ఏంభిక్ష పెట్టగలం?

వెంకా—ఇప్పుడు యెక్కడా భిక్ష పట్టరు తల్లీ!

[బ్రహ్మనందస్వామి భజగోవిందశ్లోకాలు పాడుకొంటూ ప్రవేశం]

మాధు—(ఎదురుగాబోయి) స్వామీ! నమస్కారం ఇట్లా దయ చేయండి.

బ్రహ్మ—సౌభాగ్యవతీభవ! శీఘ్రమే సమ సకార్య ఫలసిద్ధి రస్తు. (కూర్చుని) అమ్మా! ఏమిటీ దిగులుతో వున్నావు?

మాధు—స్వామీ! సంసారకూపంలో బడ్డవాళ్ళంగనక.

బ్రహ్మ—తల్లీ! సంసారాన్ని, కూపమనీ, సముద్రమనీ దరితెలియక చెబుతున్నది లోకం. అంతేగాని యీసంసారం త్రైలోక్య సౌందర్యభాగ్యదేవతా కళానిలయం. ఇంత మనోహర సంసార సువర్ణ కమలాలయంలో సమస్తజీవరాసులు చిత్రాలు. ఈ చిత్రాలకోసమే జగత్శిల్పిగూడా సంసారాన్ని పట్టుకొన్నాడు. ఇంత త్రిజగన్మోహనకళాసంస్థానమైన సంసారంలో దిగులూ, చింతా లేనివాళ్ళే ఆనందజ్యోతిని చూడగల్గుతారు. ఆచంద్ర తారార్కంగా వెల్గుతారు.

**మాధు**—స్వామి! ధన్యురాలను. మీవంటి సాధుపుంగవుల దర్శన భాగ్యంతో మాకష్టాలు అయిపులేకుండా పోతై. మహాత్మా! మాసంసారం నేఁడు మహాకష్టాలలో బడివున్నది. మహాను భావా! ఎన్నఁడీ కష్టాలు తీరి కృతార్థుల మౌతామో అను గ్రహించి యీదాసురాలిని ధన్యురాలిని చేస్తారని ప్రార్థిస్తు న్నాను.

**వెంకా**—వేడుకోతల్లీ! మనవంటివాళ్ళ జన్మలు ఈ గురుమహాశయుల వల్లనే తరించాలి.

**బ్రహ్మ**—అమ్మా! ఈ జీవితప్రవాహం కష్టసుఖాల కెరటాలతో నిరంతరమూ ఘోషిల్లుతూ వుంటుంది. గురుపుంగవు డొక్కఁడే యీ సంసారసముద్రములోంచి దరిజేర్చఁగల మహోదతుఁడు.

ఈ క్రొంబసిఁడి పొలాలే పైరుగాలిచే
చక్కని రాజభోజనము వెట్టె
ఈ జీవనదు లన్ని యేమేఘరాజుచే
లేచి యానందడోలికల నూపె
ఈ చల్లని వనమ్ము లే వసంతునిచేత
పూచి కాచి ఫలించి ప్రొద్దుఁ బుచ్చె
ఈ పండువెన్నెల లే చందమామచే
కమ్మకమ్మని యమృతమ్ము పిండె
ఈ ఘనమనోహరకళామహీతలాలు
ఏ యుదార గభీర వాగ్గేయమాధు
రీ గురు మనస్సునుంచి చిత్రింపఁబడియె
ఆ గురుని పాదములువట్టి సాగు డింక.

**వెంకా**—(కాళ్ళమీాద పడి) మహాప్రసాదం. మహాప్రసాదం. ఇవాల్టికి నాజన్మ తరించింది.

**మాధు**—నిజం. మిమ్మల్ని బట్టి మేముగూడా తరించాం పిన్నిగారు.

(స్వామి కాళ్ళమీాద పడును)

బ్రహ్మ—సౌభాగ్యవతీభవ! లెమ్మా తల్లీ!
మాధు—(లేచి) గురుమహాశయా! అనుజ్ఞ.
బ్రహ్మ—అయితే తల్లీ! నేనొక టడుగుతా చెప్పాలి.
మాధు—తప్పకుండా చెబుతా. సెల వివ్వండి స్వామి.
బ్రహ్మ—వెంకాయమ్మా! వీళ్ళపిల్ల కెన్నేళ్ళుంటై?
వెంకా—ఇరవై యేళ్ళుంటై స్వామి!
బ్రహ్మ—పాపం పెళ్ళిచేయకుండా ఇన్నాళ్ళెట్లా వుంచారు!
వెంకా—వాళ్ళుంచిం దేము౦ది స్వామి! పట్టుకొన్న దరిద్రం కాకుండా చేస్తున్నది.
మాధు—యధార్థం స్వామి!
కళ—ఎవరో పిలుస్తున్నారే అమ్మా!
వెంకా—చూచి రాతల్లి కాస్త.
కళ—నాన్నెమో (నిష్క్రమించును)
బ్రహ్మ—ఇప్పుడింకా ఆలస్యంచేయకండి. మావంటివాళ్ళకి తెల్సినప్పుడు ఇంకా ఇట్లా ఉండనీయం. అయితే మీరు చాలా పేదవాళ్లు. అందుకే భావయ్యగారు మిమ్మల్ని పోషిస్తున్నది. ఆయన వయస్సుకి కొంచెం ముదిరినప్పటికీ మనస్సుకి నచ్చినవాడు, కలవాడు.
వెంకా—వాస్తవంగా స్వామీ!
బ్రహ్మ—ఇన్నాళ్ళూ ఏదో మొండిదీక్షతో పెళ్ళికాకుండా వున్నాడు. మేమంతా చెప్పి వినిపిస్తాం. నీవు సమ్మతిస్తేచాలు. శీఘ్రమే పెళ్ళి చేస్తాం.
వెంకా—నిజంగానమ్మా! తల్లీ! ఇంత మంచితరుణం. ఇంత భాగ్యగల సంబంధం ఈ జన్మలో మీరు తీసుకురాలేరు.
మాధు—అవును. అన్నీ బాగావున్నై. అసలు పిల్లతండ్రి వొప్పుకోవాలిగా.
బ్రహ్మ—నీకెందుకు? నీ వొప్పుకో తల్లీ! ఆయ న్నెట్లాగైనా వొప్పిస్తాం.

[కళ ప్రవేశం]

కళ—భావయ్యగారొస్తున్నారే!

వెంకా—ఇహ నీ వల్లా పేరుపెట్టి పిల్వకూడదు పిల్లా!

[నీట్లైన దుస్తులతో భావయ్య ప్రవేశం]

భావ—స్వామి! నమస్కారం. మీకోసమే వచ్చాను. త్వరగా దయచేయాలి.

బ్రహ్మ—వస్తా నాయనా! కూర్చో. అమ్మా! ఈ మహాశయుడు చాలా అధికార్ల ప్రాపకం గలవాడు. చదువుకొన్నవాడు. సిరిసంపదల్లో ఇతనికి చాలినవాడు లేడు. అదీగాక కవిగారి సంసారంఅంటే చాలా ఆదరాభిమానాలు గలవాడు. ఇతని కివ్వటం చాలా శ్రేయస్కరం. పిల్ల సుఖపడుతుంది.

వెంకా—మీరుగూడా సుఖపడతారు.

మాధు—నా కేమాత్రం అభ్యంతరంలేదు స్వామి! ఇంతకంటే మాక్కావలసిన భాగ్య మేమిటి? పిల్లతండ్రిని మీ రొప్పించండి. నేనుగూడా చెబుతా. అంతేగాని ఆడదాన్ని నే నెట్లా సాహసించి మా టివ్వగలను? క్షమించండి. వారు రెండుమూడు రోజుల్లో వస్తారు.

బ్రహ్మ—సరే! చెప్పాల్సిన వన్నీ చెప్పాం. మళ్ళీ వారిగ్గూడా చెప్పి చూస్తాం. బాగా ఆలోచించుకోండి

వెంకా—మతేం ఫరవాలేదుతల్లీ! కవిగారుకూడా వొప్పుకొంటారు.

మాధు—వొప్పుకోకపోతారుట్లండి.

భావ—ఇంట్లోకావల్సినవన్నీ మాబండిమీద వస్తై. ఇప్పుడే మా గుమాస్తాకి చెప్పి పంపించాను. ఇంకేం శావల్లో కబురుచేస్తే పంపిస్తాం. వెళదామా స్వామి?

బ్రహ్మ—పదా! నాయనా! కవిగారిసంసారాన్ని కాస్త కనిపెట్టుకుండండి భావయ్యా; వెళ్ళి వస్తాతల్లీ!

మాధు—(నమస్కరిస్తూ) అనుజ్ఞ స్వామి!

బ్రహ్మ—మంచిది. ఉండుతల్లి! వెంకాయమ్మా! నీవుకాస్త ఆగివస్తావా?

వెంకా—చిత్తం స్వామి!

బ్రహ్మ—పదా నాయనా! (భావయ్య, బ్రహ్మానందస్వామి నిష్క్రమింతురు)

కళ—కూర్చోండి. అమ్మమ్మగారు!

వెంకా—పోతా తల్లీ! (కూర్చుని) ఇంకా ఇంటిపనంతా అల్లాగే పడివుంది.

మాధు—మావారికి వొళ్ళుకొక్క వేళావిశేషాన్నిబట్టి మతి తిన్నగా వుండదు పిన్నగారు!

వెంకా—అవును. ఎప్పుడూ ఏదో ఆలోచనలో వుండటంవల్ల చికాకు పడతారు. అది మనం కనిపెట్టి వినిపించాలి. ఈ ప్రాపకంమట్టుకు పోగొట్టుకోకండి. కరువుకాలంగూడామతి

కళ—అమ్మమ్మగారు! గోవిందనామాలు మీరు చదివితేనే వినాలండి. ఏదో వొకమాటు వినిపించరు?

వెంకా—ఈకాలంలో మీనాజూకుపాటల్కి మాపాటలేంపనికివస్తైతల్లి?

మాధు—నిజంగాపిన్నిగారూ! నాగ్గూడాకినాల్నుంది. కాస్తవినిపించండి.

వెంకా—నీకు అంత మననుగా వుంటే విను తల్లీ! (పాడును)

మాధు—ఎంత పురాతన పాటైనా యెంత వినసొంపుగా వుందో చూడండి.

వెంక—పోయొస్తాతల్లీ! (లేచును)

కళ—ఇంకోటి పాడండి.

వెంకా—నీపెళ్ళినాడు పాడిద్దువుగాన్లే బోలెడన్నిపాటలు. వస్తా. ఇవాళ్ళ స్వామివార్కి మాయింటివద్దే భిక్షకూడా. (నిష్క్రమించు)

కళ—వట్టిటక్కరిముండ. ఎప్పుడూ స్వాములవారిగొడవే.

మాధు—ఆసి నీగొంతువొత్తా. పదవే వింటుందేమోగూడా.

(నిష్క్రమింతురు)

---

## 3 వ రంగం-కోటియిల్లు

[కళా సుందరావులు ప్రవేశం]

సుంద—ఎవరూ రారు. నేను చెబుతా నీవు అనాలి.

కళ—ముందు నీవు పాడి వినిపించు.

సుంద—సరే విను (కీర్తన పాడును.)

కీర్తన

కలవారి మాయలీలా ఇల కను గొనతరమటె యేరికైన
జగతి సుగతి చెడిపాడగునాడే వారిమాయలీలా ॥కల॥
నాడు నేడు తమ సుగతికి గాదా పేదనరాలన్ సమలిరి బాగా
లేదు లేదు ఒకసుజనుడు కూడా భాగ్యవంతులందూ ॥కల॥

(ఇద్దఱూ చెఱొకపాదం అని రాగాలాపన చేస్తారు
ఇంతలో సుధాంబుధి రావటం చూచి)

సుంద—కళా! సుధాంబుధి వస్తున్నాడు.

కళ—ఏడి? ఇతని దగ్గఱ కానరాని దుర్బుద్ధులు చాలా వున్నై. తన అనాకారం చూచిఅంతా మురిసిముందు పడతారనుకొంటాడు.

సుంద—నేను మొన్ననే కనిపెట్టాను. వీఁడు నీకు పాఠం చెప్పేటప్పుడు ఎవడొచ్చి పిల్చినాలేవఁడు, వినిపించుకోఁడు. వీఁడికి తగినశాస్తి చేసి పంపిస్తా నీవు దాక్కో.

కళ—కొడతారా?

సుంద—అటువంటి పాడుపని నే నెప్పుడూ చేయను. నవ్వకుండా చూస్తుండు.

కళ—వస్తున్నాడు (నిష్క్రమించు)

సుంద—ఏంరా! సుధాంబుధి ఇవాళ్ళ యిట్లా వస్తున్నావు? విశేషా లేమిటి?

సుధా—చాలావున్నైరా. కనిగారి పిల్లకి పాఠం చెబుదామని పోతే, ఆమె కాస్తా యెక్కడికో పోయింది.

సుంద—అందుకే! ఏమీ తోచకుండా తిరుగుతున్నావు పాపం?

సుధా—తోచకేంగాని, పాపం కవిగారింటి సంగతి మఱేం బాగుండ లేదురా.

సుంద—అయితే ప్రస్తుతం కొద్దిగా డబ్బుందిగాని తీసికెళ్ళిచ్చిరా. కవి గారి నాటకం మాంలేబర్ యూనియన్ చేత చదివించినవాఁడివి యింతకాలం నుంచీ అన లెందు కాడించగూడదురా! బెనిఫిట్ డ్రామావేసి యిద్దాం. నీవు నడుం గట్టు మఱి

సుధా—నా దేముందిరా, నే నన్నింటికీ సిద్ధంగావున్నా. కానియ్యి.

సుంద—అసలా ప్రయత్నం పెట్టుకొందామని యిదివఱకే సంకల్పిం చాను. నీసహాయం లేందే నాపల్లేమౌతుంది ?

సుధా—సరే! వచ్చేగా. కానియ్యి ఏం చేయా లిప్పుడు ?

సుంద—ఫొటోలు తీయాలి.

సుధా—ఎందుకు ?

సుంద—ఎడ్వర్టైజుమెంటుబ్లాక్సుకి

సుధా—సరే పదా పోదాం.

సుంద—ఎక్కడికో ఎందుకురా ? నాదగ్గఱన్నీ వున్నై. ఇదివఱకు స్టూడియో పెట్టలేదట్రా నేను.

సుధా—అయితే! ఆలస్య మెందుకు ? కానియ్యి. క్షౌరం చేయించుకో వద్దు మఱీ ?

సుంద—అదికూడా నేనే చేస్తా.

సుధా—అవున్రాబాబు! నీవన్నింటికీ దక్షుడవు. కానియ్యితొందరగా.

సుంద—వస్తున్నా. ఈలోగా చొక్కా విప్పుకోరా! (నిష్క్రమించు)

సుధా—వీఁడు మాలావు అసాధ్యుడు. కవిగారిపిల్ల యీ ప్రక్క నెక్క డన్నా వుందేమోనని వస్తే, మంచివురే తగిలించాడు.

[కెమేరా, డ్రస్సులు, మొదలైన పరికరాలతో సుందర్రావు ప్రవేశం]

సుధా—రేజర్ తెచ్చావురా ?

సుంద—తెచ్చారా. కూర్చో. కత్తిలేకుండా గాటిగేదెట్లా ?

సుధా—(కూర్చుని) జాగ్రత్తగా కత్తి పట్టుకోరోయ్.

సుంద—(గడ్డం మీసం తడిపి బరబరా గొఱుగుచుండును.)

సుధా—ఏమిట్రా ఆతొందర ? చెత్తకోసినట్టునా ?

సుంద—కదలకరా, తెగుతుంది. అయిపోవచ్చిందిలే

సుధా—ఏమిటీ! భూంమీద భత్యమేనా ?

సుంద—కాదురా క్షౌరం.

సుధా—ఏదైతేంలే, రెండూ సమానమే. (అద్దం చూచుకొని) క్షౌరాలు చేయటంలో నితర్వాతేరా.

సుంద—ఆలస్యంచేయక, ఫొటోకి లైటులేకుండా పోతుంది.

సుధా—ఇంకా చేసే క్షౌర మేమిటి ?

సుంద—(చేతులు రెండూ పట్టి కూర్చోపెట్టి) ఏమిటో చెబుతాపట్టు. (రెండు చెంపలా రంగుపూసి కొట్టుచుండును)

సుధా—ఏమిట్రా ? క్షౌరం తర్వాత చెంపలుకూడా వాయించుకోవాలా ?

సుంద—వాయించుకోవద్దట్రా. అన్నీ తెల్సి అడుగుతావేం? లే యింకా (విగ్గుపెట్టును)

సుధా—ఇదేమిట్రా రాక్షసవిగ్గూ. చెన్ నా కొద్దు.

సుంద—ఈరంగంలో కథానాయకురాలు ఇటువంటి వేషంతోనే రావాలి. (గొంగళి చుట్టును)

సుధా—ఇదేం చీరెరా? గొంగళ చుట్టి చంపుతున్నావ్?

సుంద—అరవకరా ! (ఆభరణాలు పెట్టును)

సుధా—బాగాతయారుచేస్తున్నావులే. ఆఫొటోకూడా చప్పునకానియ్యి.

సుంద—ఒయ్యారంగా నుంచోవల్లిరా.

సుధా—ఈవేషానికి వయ్యారం గూడానా? (నిల్చును)

సుంద—అట్లా. కదలొద్దు. (కెమేరాలోంచి చూస్తూ) ఒన్, టూ, త్రి, రెడీ. ఈసైడైందిరా బ్రదర్.

సుధా—ఇదేమిట్రో! ఇంకా నాల్గువైపులా తీస్తేగాని వదలిపెట్టవా యేం? బాగానే వుంది. ఈతమాషా నేనెక్కడా చూడలా.

సుంద—బాక్సైడ్ కూడా తియాలి. ఆదేమాదిరి పిల్చేవరకు కదల కుండా జూస్తుండు. తిరుగూ

సుధా—తిరుగుతున్నాలే తిన్నది అరిగేదాఁకా తిరగొద్దుమరి.

(తిరిగి నిలబడును.)

సుంద—ఒన్. (మెల్లగా సుధాంబుధి విడిచిన బట్టలు తీసుకొని, చడీ చప్పుడు కాకుండా కళని వెంటపెట్టుకొని, బయట కొచ్చి గొళ్ళెం వేసి పారిపోతాడు)

సుధా—టూ, అనవేం రా. నడుం విఱిగిపోతున్నది. మాట్లాడవేం? వెనుకవైపు తీయటానికి ఇంతసేపు పట్టిందేరా? కెమెరాకేమన్నా దృష్టిదోషం వచ్చిందాఏంరా? ఎవరన్నా వచ్చి ఈరాతసి వేషాన్ని చూసి జడుసుకొంటారుగూడా. అయిందా? ఆరి నీదుంపతెగ మాట్లాడవేంరా? (ఏదో చప్పుడు విన్నట్టు ఉలిక్కిపడి చతికిలపడి బిక్కమొహంతో అటూఇటూ తారట్లాడుతూ) ఎడీ వీఁడు? నాగుడ్డ లేవి? భలే కిలాడీతనం నేర్చావురా. ఇహ జన్మలో నిన్ను నమ్ముతానా? తలుపు గొళ్ళెం వేసికూడా పారి పోయినాఁడే! ఆ. ఎట్లాగంటెప్పుడు? మంచి పనే తగిలించు కొన్నా. ఎట్లా బయటపడేది? ఈ దయ్యపు వేషాన్ని యెవరి వాకిట్లోకి రానిస్తారు? ఎవరన్నా జూచి దయ్యమని చావకొట్టరు కదా? ఇహ బడితపూజకూడా వ్రాసిపెట్టుందేమో?

(కోటి తలుపు తీసుకొనివచ్చి)

(సుధాంబుధి వేషాన్ని జూచి గుండెలు కొట్టుకొంటూ)

కోటి—అరెయ్యో! నాయింటికి దయ్యంపట్టింది. సూడండల్లో. (సుధాం బుధి మూల చతికిలపడి కూర్చుంటు

[బడేసాహేబు ప్రవేశం,

బడే—హారే! హేట్రిా హమ్మా! ఘోలాఫడుతుండావు నీకీ?

కోటి—సాయిబయ్యబాబు! నా ఇంట్లో ఏదో దయ్యం కూకుండది బాబు! (సుధాంబుధి నిల్చుని వెఱ్ఱిచూపులు చూస్తాడు)

బడే—హారే! ఫట్టాఫగల్ దయ్యం హేమ్లా హామ్మా ఘూధరా ఫెడుతుండావ్ నాకీ. హేఁఖీసూఫించూ కిధర్ హైరే దయ్యం?

కోటి—(సూపిస్తూ) అమ్మో అల్లాగో సాయబయ్యా! ఆరయ్యో.

బడే—హారే! ఘోలాం ఫెట్టాఖమ్మా నీపలాంసేస్తా. నా హెంటా హాలుండే సూపించు?

కోటి—అదిగో! సాయబయ్యా!

బడే—హారే! సైతాన్! భయట్కే జావ్ హింకా నీకీ మూఢిందే (కర్రెత్తు)

సుధా—(పెద్ద వెఱ్ఱికేకలో) అమ్మో! అమ్మో!

బడే—బాహార్ కీజావురే సైతాన్! నీవొళ్లూ సించేశానే ఘూ మహాంఖాళీ! ఛలో ఘూమహాంఖాళీ (కర్రత్రిప్పును)

సుధా—(పెద్దగా) అమ్మో, అమ్మో!

[వెంకాయమ్మ ప్రవేశం]

సుధా—అమ్మో! అమ్మా! అమ్మా! అమ్మా! జూడవే! (అని పరుగున వచ్చి వెంకాయమ్మని కౌగలించుకొంటాడు.)

వెంకా—ఇదేమిట్రో! దేముడో నాకు పట్టింది దయ్యం.

బడే—హాధీ! హాట్లా! నీకీ భోడీ బాపనమ్మాకీ పట్టుకోరే సైతాన్. ఘూ మహాంఖాళీ! (చిందులు తొక్కుతూ కర్రత్రిప్పును)

వెంకా—విడిపించు సాయబూ. చచ్చి నీ కడుపున పుడతా.

బడే—ఘూ మహాంఖాళీ! ఛలో సైతాన్ (బాదును)

సుధా—అమ్మో, నేను నీకొడుకునే! సుధాంబుధినే! గుర్తు లేదటే, అమ్మో.

వెంకా—ఆగు సాహెబు, ఆగు.

బడే—నీకీఖూడా సైతాన్ ఘట్టింధమ్మా? ఛలో సైతాన్ (బాదును) మహాంఖాళీ !

సుధా—అమ్మో! అమ్మా! ఇదేమిటే యిట్లా చావకొట్టిస్తావ్?

వెంకా—ఆగు, సాయబూ! నిజంగా నాకొడుకు సాయబు! అయ్యో అయ్యో! ఎందు కిట్టా కొట్టిచంపుతావ్?

బడే—హేమ్జీ హామ్మా సాఘుఘోలా నాకీ? సైతాన్ నీకీ ఖూదాహ్మా హైతే హాంటాఫెట్యాపో. ఛలో సైతాన్.

(అందఱూ నిష్క్రమింతురు. తెరపడును)

# కష్టకాలం

## చతుర్థాంకము

### 1 వ రంగం - భావయ్యదేవిడి

[భావయ్య, వ్యాపారి ప్రవేశం]

వ్యాపా—బాబూ! ఇట్లా ఉపేక్షిస్తే కాదింకా. అల్పులకి అడిగినవన్నీ, యివ్వబట్టేకదూ, తిన్న విశ్వాసం లేకుండా యెదురుతిరగటం నేర్చారు. ఇట్లా చూడండి. ఈ చేతివేళ్ళన్నీ సమానంగా వున్నయ్యా? లేనప్పుడిహ, అంతా సమానం కావాలనుకొంటే కాగలమా? ఎప్పుడూ ఆ పిచ్చిలో పడకండి. ఎవడదృష్టంకొద్దీ వాఁడు పైకొస్తుంటాడు. తాను రాలేదని యేడిస్తే యెట్లా? వెనకటికి వాఁడికుందని తా నేడిస్తే వొక్కకన్నుపోయింది. తనకు లేదని యేడిస్తే రెండోకన్నుకూడా పోయింది. ఈకాలం తరహా చూస్తే అట్లావుంది. ఇట్లా ఎంతమంది ఎన్ని మీటింగులు పెట్టుకొంటే మీకేమండి? నిప్పుపుల్లలకి కోపంవస్తే మహాసముద్రం తీసిపోతుందటండి?

భావ—అయ్యా! ఈ కష్టకాలంలో పేదవాళ్ళని కనికరించి లాభనష్టాలు చూచుకోకుండా యింత పెట్టుబడిపెట్టి ఏదో పోషిద్దామని వ్యాపారాన్ని సాగిస్తుంటే అంతా నాకే యెదురు తిరిగింది నాకు గడవక యీ వర్కుషాపులు, వ్యాపారాలు సాగిస్తున్నానని వాళ్ళు భావిస్తున్నారు. భావించనీయండి. అన్నీకట్టిపెట్టి, నా కెట్లా గడవదో నేనూ చూస్తా. ఎచ్చే యీ కూలీనాలీ జాతికి తృప్తిలేదండి. లాభాలు రాబట్టుకోకుండా నడవ

గలం గాని నడుములు విఱిగిపోయేబరువు మోయగలమండీ? అసలీ దుర్బుద్ధీ, వినాశకాలం వాళ్ళకి పుట్టలేదండి చదువులు చదివి, ఎక్కడా ఉద్యోగాలూ, ఎత్తుభారాలూలేక, యీ కాలేజీ కుర్రవాళ్ళు లేరండీ! అదిగో వాళ్ళకి పుట్టింది. ఎక్కడ పడితే అక్కడ సంఘాలూ, సభలూపెట్టి, యిట్లా బందిపోటు ముఠాల్ని లేవదీస్తున్నారు ఇంకా ఈ ప్రభువూ ప్రభుత్వమూ లేకపోతే వీళ్లు వూళ్లు దోచుకోనేవాళ్లు. అదీగాక, యీ వూళ్లో నిరంకుశకవి ప్రవేశించిన లగాయతూ బాకీలు ఎగగొట్టటం లోనూ, భాగ్యవంతుల్ని పడగొట్టటంలోనూ పాఠాలు బహు బాగావచ్చినై. అగ్ని దేవుడికి వాయుదేవుడు తోడైనట్టు ఈకవికి సుందర్రావొకడు తోడైనాడు. ఇంకానేం! వీళ్ళిద్దరూ కలిసి మీటింగులుపెట్టి, తిరుగుబాట్లులేపి, యిట్లా ప్రపంచాన్ని మండిస్తున్నారు అసలు నావల్ల వొకపొరపాటు వచ్చిందిలేండి. ఈ కవినీ, ఈ సుందర్రావునీ తెల్సుకోకుండా, యిట్లా చేర్చి అన్నియిచ్చి బలిపించబట్టి యింతదెబ్బ తినాల్సివచ్చింది.

[దేవయ్య ప్రవేశం]

దేవ—ఇవాళ్ళెవరూ పనిలోకి రాలేదు.

భావ—రాకపోతే రాకపోయినార్లే, ఎంతకాలమిట్లా భీష్మించి కూర్చుంటారో కూర్చోనీ.

దేవ—పోనీ సుందర్రావుని పిలిపించి చెప్పిచూద్దాం.

భావ—ఏమిటి? పిలిపించేది? చెప్పేది? ఏమీవద్దు.

దేవ—వాళ్ళల్లోకల్లా వాడు కొంచెం చెబితే వినేబుద్ధిమంతుడు మాదిరి కనిపిస్తున్నాడు.

భావ—ఇదిగో! చూడండయ్యా! మావాడి తెల్వితేట లెట్లా వున్నయ్యో. ఈ పుట్టుకొచ్చిన విపరీతమంతా వాళ్ళోదేమైతే ఏమిటో వాణ్ణి పిలిపించి చెబుతాడట.

వ్యాపా—ఆ సుందర్రావు కదండీ యీనమ్మో కంతటకీ కారణ

భూతుడు. ఇప్పుడు వాణ్ణి పిలిస్తే వాడిముందు మనమింకా నిలుస్తామా?

దేవ—అసలు వాళ్ళ కష్టసుఖా లేమిటో చెబితే మాట్లాడవచ్చుగా.

భావ—వాళ్ళకష్టా లేందెప్పుడు? ఇహ మనం గూడా వాళ్ళతో బాటు కలిసిపోతేగాని వాళ్ళకష్టాలు తీరవు. వీళ్ళకిళ్ళకి మనమేడ మిద్దెలూ, గుళ్ళుగోపురాలూ పనికిరావు ఇవన్నీ మనం తీసి పారేసుకొంటే, వీళ్ళంతా భూలోకస్వర్గం చూపిస్తారట.

దేవ—వ్యాపారంలో బోలెడ్డబ్బు పోసినవాళ్ళంగనక, నష్టపడి పోతామని చెబుతున్నా.

భావ—అయితే! ఏమంటావ్? వాళ్ళకొళ్ళ్యా గడ్డాలు పట్టుకొని పనుల్లోకి తీసుకురమ్మంటావన్నమాట. దేవయ్యా, దేవయ్యా!

వ్యాప—నాయనా!

ఎద్దు ముద్దుపెట్టుని యెక్కువ మేపిన కాడి కింక ఏ
ప్రొద్దున కైన వచ్చునె? ప్రభుత్వము హద్దుల నెల్ల దప్పి ము
ప్పొద్దులు మేపుచుండిన, ప్రభుత్వపు సేవకు లింక భూమిపై
పెద్దలకమ్మ లుంచుదురె? ప్రేగులు మాడ్చినగాని లొంగరే.

భావ—బాగా సెలవిచ్చారు బాబు!

[బ్రహ్మానందస్వామి-వెంకాయమ్మ భజగోవింద శ్లోకాలు చదువుతూ ప్రవేశం]

భావ—స్వామి! నమస్కారం. దయచేయండి.

వ్యాపా—స్వామి! దాసుణ్ణి కటాక్షించండి

బ్రహ్మ—(కూర్చుని) భావయ్యా! లోకం చాలా పెద్దరగడలోకేదిగింది. ఇహ యిట్లా చూస్తుంటే కాదు. దుష్టయాగం చేయాల్సిన ఘడియలు వచ్చినై విన్నావా? మన వెంకాయమ్మ కొడుకు నెట్లా చావకొట్టారో.

భావ—అదేమిటి స్వామి?

బ్రహ్మ—ఏముంది! వినాశకాలే విపరీత బుద్ధన్నట్లు, వినావర్కు-షాపులో వాడట యెవడో, సుందర్రావు, తెగతాగి పాపం

అమాయకుణ్ణి పట్టుకొని చావకొట్టాడు. వాడికితోడు మీ బడేసాహెబుగూడా ఉన్నాడట ఇంకోటిచెబుతున్నా జాగ్రత్తగా వినాలి. కవిగారి పిల్లని యీసుందర్రావు కట్టుకొందామని చూస్తున్నాడట గూడా. విన్నావా? దాని ఆరాటీయటానికే, యీ వెంకాయమ్మ కొడు కెళ్ళితే యింతపని చేశాడు.

వ్యాపా—అసలు సుందర్రావు కివ్వడానికి కవిగారుగూడా యిష్టపడ్డారటగా?

బ్రహ్మ—మొత్తాని కెట్లాఅయితే యేం, వూరంతా వూపేస్తున్నారు, లేపేస్తున్నారు ఇహ వీళ్ళుంటే వూరుబాగుపడదు. భావయ్యా, వీళ్ళంతు కనుక్కోటానికి నీవే దక్షుడివి. ఏమైనా సరే! ఎట్లాగైనాసరే, ఎంతైనా సరే. యీసుష్టయాగం త్వరలో ప్రారంభించాలి.

భావ—స్వామీ! మీ అనుజ్ఞయిస్తే యీ తక్షణం ఇటువంటి రాక్షస లోకాన్ని చీల్చిచెండాడి ప్రపంచశాంతి చూపిస్తా. అనవరతం నిరాడంబర జీవులై, ప్రతిఫల వాంఛారహితులై, పరమేశ్వర ధ్యానతత్పరులై, త్రిలోకైక దివ్యకళాతురాపాట్లులై శుభ సౌందర్య మహాబ్రహ్మానంద సామ్రాజ్య పట్టాభిషిక్తులై యున్న మీవంటి తపోధనులు, గురుపుంగవులు, శాంతచిత్తులు, బాధ పడి అలిగినట్లైతే, చతుస్సముద్రాలు పొంగి భూమండలం క్రుంగిపోతుంది. ఆజ్ఞ దయచేయిండి ఈదురాచార భయంకర దురాశాపిశాచ నిశాచర సంఘాల్ని రూపుమాసి ఇంత దార్గర్వదురంత ఘోరపాప నరహంతకుల్ని నేల రాచి మీ పరమ పవిత్రమైన ఆత్మని శాంతింపచేస్తా, గురుదేవ! సెలవివ్వండి.

బ్రహ్మ—శీఘ్రమేవ 'జయలక్ష్మీప్రాప్తిరస్తు, ఇంకా ఆలస్యంచేయవద్దు.

[బడేసాహెబు, సుందర్రావు ప్రవేశం]

బడే—సలాం లేఖుం మహారాజ్! హార్గోనయ్యా! సుందర్రావ్! హింకా ఘోరఘూర్కీ వూఛో. అధీ అచ్ఛాగావుంటుంది.

సుంద—నమస్కారం భావయ్యగారు!

భావ—నీ నమస్కారాలు తిరస్కారాలూ సరిలే. ఇక్కడేముంద నొచ్చావ్?

సుంద—పెద్దవారిదయ. పేదవాళ్ళకష్టం ఉందనొచ్చావ స్వామి!

వ్యాపా—కవిగారి శుశ్రూష వృథాగాలా, చాలామంచి విద్యే పట్టు పడ్డది బాగా తరిఫీదయినావు. ఫరవాలేదు.

భావ—ఏమనుకొన్నారుమఱి? ఎంతవారు కాకపోతే, యింత సమాధానం యిస్తారు?

సుంద—మీరెట్లా భావించుకొన్నా మీరు తండ్రులు, మేము కుమారులం.

[దూకుడుగా ఆచారి ప్రవేశం]

ఆచా—కుమార్లెప్పుడూ కొంపకు నిప్పుపెట్టరు.

బ్రహ్మ—సమయాని కొచ్చావు నాయనా?

సుంద—చిచ్చు పెట్టినప్పటికీ, మళ్ళీచల్లార్చేది కూడా, కుమార్లేగాని యీ మొహర్బానీగాళ్లు కాదు.

ఆచా—అట్టే ప్రేలక.

సుంద—తేలకపోయినప్పుడు ప్రేలకుండా వుండదు.

ఆచా—ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడు అట్టే ప్రేలవద్దు. (మీదకొచ్చును)

సుంద—(నవ్వి) ప్రేల్తా, దగ్గఱికి రాక.

ప్రేలెద ఈకిరాత పృథివీస్థలి పెట్టి సమస్తవృక్షముల్
కూలెడిదాఁక ఈ యసురఘోరపరాక్రమ లీలలెల్ల ని
ర్మూలములై నదాఁక, భయమోదవిషాద వినోద భావ భా
షా లయకాలకారణ విచారణపాలన చక్రవర్తినై.

ఆచా—(నవ్వి) అబ్బా! ఎంతమొనగాడివి. మూర్ఖుఁడా! మీజాతికి నీతి లేదు.

ఓరి! కృతఘ్నా! ఎంతచెడియున్న దినమ్మున బక్కచిక్కి యె
వ్వారి సువర్ణ పాదములు వట్టి మఱిప్పుడు వ్రేలగల్గితో
జోరును గట్టిపెట్టి యిటకుఁ జూడుము నీ బ్రతుకెక్కడుండునో
ఔరా! మదస్త్ర శస్త్రబడబాగ్ని శతఘ్ని శతమ్ము గాంచవే?

వ్యాపా—ఇంతటితో నీపౌరుషం నీరసమైందా? సముద్రుడితోనా పంతమూ పౌరుషమూ?

బడే—హూఫ్డా నీకీ హెందుకయ్యా ఘాడ్వా? భలే జగడం దెచ్చి పెట్టార్!

భావ—సరేగాని నీప్రగల్భాలు, నీప్రతిభా ప్రభావాలు కట్టిపెట్టు. ఇందుకేనా వచ్చింది?

సుంద—కాదు. మా కూలివాళ్ళ కష్టం గుర్తించి పోషించమని వేడుకొంటానని కొచ్చా.

ఆచా—వేడుకొంటానిగ్గాదు. వేటాడ్డాని కొచ్చావ్.

సుంద—ఔను. మృగాల్ని వేటాడాలి, మహాత్ముల్ని వేడుకోవాలి.

భావ—ఆహా! వేడుకోటం బాగావుందిగాని, మధ్య నీవెందుకు?

ఆచా—లంచాలు పట్టడానికి.

సుంద—అవి మాకు చేతగావు.

భావ—సరే! సంతోషించాంగాని; ఏమిటి? నీవెందు కొచ్చా?

సుంద—నన్ను లేబర్ యూనియన్కి ప్రెసిడెంటుగా ఎన్నుకొన్నారు. కనుక వచ్చా సమ్మె ఆపిస్తా. దయవుంచి వినండి.

ఈ గుడిగోపురాలు మఱి యీ సుకుమారపు కాపురాలు ప
ప్రేగులు మాడ్చి దివ్యముగ శేయించవళ్ళను వెల్గుచున్నవో
మీగుఱు సాక్షిగాఁ గనిన మిమ్మును మించెడి తండ్రి మాకు భూ
భాగములోని కెవ్వఁడు? కృపారసమూర్తి! యనుగ్రహింపుడీ!

భావ—మా అనుగ్రహాలూ వద్దు, ఆగ్రహాలూ వద్దు. మీ సమ్మె మీటో మీరు సాగించుకోండి.

సుంద—మీరట్లా సెలవిస్తే కష్టజీవాలు బ్రతుకలేవు. రోజుకి నాల్గు గంటలు పనిచేయించుకోండి. స్త్రీ పురుషాదులకి సమానంగా

రోజు వొకటింటికి 2 రూపాయలు కూలి యిప్పించండి. ఏతగా
దా వుండదు. పనులు సాగుతై.

వ్యాపా—రోజుకి రెండు రూపాయలు చాల్లా అబ్బీ?

ఆచా—చాలనప్పుడు మళ్ళీ బెదరిస్తారు.

వ్యాపా—అట్లాగేవుంది వీళ్ళ కథ.

బడే— మీ! హెందుక్యాహాండీ? కూలోళ్ళఘోడ్యా?

భావ—మావల్లకాదు. మేము మిమ్మల్ని సంతృప్తిపఱచలేం. ఇంకా
మీచేత పనిపాట్లు చేయించుకోలేం. వెళ్ళవచ్చు. మాకు చాలా
పనులున్నై.

సుంద—దయ చూపాలి.

బ్రహ్మ—నీకాదురా చెప్పేదబ్బీ! పొమ్మంటేను. సాగించు నమ్మెలు
సంబ్రాలు. నీరోజులు మంచివికాకపోబట్టే యింకాయెన్నెన్నో
పోకిరీ వేషాలు వేస్తున్నావ్. ఇహ తర్లు. చాల్లే.

సుంద—అయితే స్వామి! మీరంతా లోకోద్ధారకులు కాబట్టి మీరే
లోకాల్ని నడిపించండి. చూస్తాం. (నిష్క్రమించును)

భావ— చూచారా! వాడి అదిరిపాటుతనం, పొగరుబోతు తనం.
వీణ్ణింకా సోదిలోకి రాకుండా చేస్తేగాని మిగతావాళ్ళకి బుద్ధి
రాదు.

ఆచా—బడేసాహెబ్! కారు సిద్ధంగా వుంచమని చెప్పిరా.

బడే—చిత్తం. (నిష్క్రమించును)

ఆచా—ఇంతఆగం లేచింది, వూరికేకాదు లెండి. మేలుకే వచ్చింది.
ఇహ యీఆవి సంసారాన్ని యీ సుందర్రావుకొంపనీ లేపేయా
ల్సిందే. సందేహించ కూడదు. ప్రళయం ముంచుకొచ్చిం
తర్వాత జాలిపడకూడదు. భావయ్యగారు! నేను చెప్పినట్లు
ఈరాత్రికే పోయి వీరారు మీపనిలో వుండండి. ఇప్పుడే
కలెక్టరుగారి దగ్గఱకెళ్ళి మిగతా తతంగమంతా సిద్ధంచేసివస్తా.
భయమేమీ లేదు. ఆలస్యం చేయవద్దు.

బ్రహ్మ—శీఘ్రమే కార్యరంగములోకి దిగు నాయనా! పరాత్పరుడు నీ కన్నివిధాలా తోడుపడతాడు.

వ్యాప—శీఘ్రమే నిజకార్య ఫలసిద్ధిరస్తు. వెళ్ళిరండి. బాబు!

భావ—అయ్యా! యథావిధిగా చుట్టుపట్ల బ్రాహ్మణ్యాన్ని పిలిపించి శతసహస్రరుద్రాభిషేకాలు జరిపించండి దేవయ్యా! వారి క్కావల్సిన వన్నీ సప్లై చేస్తుండు. బయట నాల్గురోజులుదాకా మళ్ళీ నేను కనిపించను. ఎవరడిగినా వూళ్ళోలేరనిచెప్పు. వస్తా.

(నిష్క్రమించును)

వెంకా—పాపంపండింది బాబు! ఇంతకూ ఇది వృధాగా రాలేదు.

బ్రహ్మ—కాక మరేమిటి? దుష్టశిక్షణ చేస్తేగాని ధర్మసంస్థ కాపాడబడదు. పోదాంపదండి. (నిష్క్రమింతురు తెరపడును)

---

## 2వ రంగం

### కవిగారి గృహం

[పడుకొని కళ మాధురి కీర్తన పాడుకుంటూ వుంటారు]

చీకటి రోజుల జీల్చెడి వెల్గులు
రా వా లి
వాకిట ముంగట పచ్చని ముగ్గులు
వే యా లి
చీకటి రోజుల జీల్చెడి వెల్గులు
రా వా లి

కళ—అమ్మా! నా న్నెప్పు డొస్తాడే?

మాధు—ఏమోతల్లి! మీనాన్నగారు చెప్పేవారా? చేశేవారా?

కళ—చెన్నపట్నం వెళ్లాడేమోనే.

మాధు—ఏమోమాట్లాడక, నిద్ర వస్తున్నది.

కళ—నాకు నిద్రరావడం లేదే!

మాధు—నీ కెందుకొస్తుంది? కళ్ళలోమిరియపుగింజ పెట్టుకో వస్తుంది. ఏమన్నా పనీపాటా వుంటేగా రావటానికి?

కళ—వెళ్ళునిద్రపోతాలేవే, నీవెందుకు విసుక్కొంటావ్ (నిష్క్రమించు)

మాధు—ఎట్లా ఈకాపురం చక్కబడుతుందో తోచటంలేదు. పిల్లకి పెళ్ళేట్లాగాఅన్న బెంగే లేకపోతే అసలు ఏగొడవలో? పడితే, ఆ గొడవేతప్ప, రెండోగొడవ చూచుకోటంలేదు. మా వ్రాతలిట్లా దేశాలుపట్టుకొని తిరగమనుంటే, మా కెక్కడ కాలు నిలుస్తుంది? దీనదయాళా! ఇంత లోకాన్ని పోషించి సుఖనిద్ర పట్టిస్తున్న నీకు మేం కనిపించటంలేదా? ఒక్కనాడు గూడా కంటికి కమ్మనినిద్ర ఎరుగమే: దయరాదా?

పద్యం. నాకేమన్న బడాయిచొప్పున ఖజానా పెట్టెపై కెక్కుచో
లోకా లేకముల్తె మహాప్రళయ కల్లోలమ్ములన్ లేపి, నే
కష్టాలకుఁ గన్నుమూతఁ బడనీ కెన్నాళ్ళు ఘోషిల్లునో
నీకన్నన్ దలిదంద్రు లెవ్వరు? కృపానిర్నిద్రభద్రాత్మకా.

[భావయ్య తలుపు కొడతాడు]

మాధు—ఎవరు?

భావ—నేనే తలుపు తీయండి. (మాధురి తల్పుతీసివచ్చును)

[భావయ్య ప్రవేశించును]

భావ—మాకావలివాఁడు రాలేదండి? వెళ్ళమన్నాను. అసలు వాడొచ్చాడో లేదోఅని చూచిపోవడాని కొచ్చాను.

మాధు—(నివ్వెరపడి) రాలేదండి.

భావ—వాఁడే భాగోతాల కెళ్ళాడో? పాపం మీరొంటరిగా ఎట్లా వుంటారు?

మాధు—ఉంటాంలెండి

భావ—ఫరవాలేదు. వాడొచ్చింతర్వాతే వెళతా లెండి. అయితే; ఇంట్లో ఏమున్నదో యేమిలేవో, పాపం మానొకర్లు సామగ్రంతా తెచ్చి ఇచ్చారండి?

మాధు—ఇచ్చారండి.

భావ—కవిగారెప్పుడొచ్చేది తెలియలేదు. ఎక్కడున్నదీ తెలియలేదు

మాధు—చెన్నపట్నం వెళతారండి.

భావ—మళ్ళీ కేదిరో ప్రోగ్రాం ఉన్నది కామల్ను.

మాధు—ఏమోనండి. ఉంది కామల్లు పాపం మీకు చాలా ప్రొద్దు పోయింది

భావ—ఫరవాలేదు రావలినాడు రాగానే వెళతాలెండి కవిగారికేం తక్కువైందని ఇంకా యిట్లా వ్రాళ్ళుపట్టుకొని తిరగాలండి? ఈ మధ్య మీ పిల్లకింకో సంబంధం గొప్పదొస్తే దానికీ యిష్టపడలేదు

మాధు—చెబితే వినేబుద్ధి మాకు మొదట్నుంచీ లేదులెండి

భావ—అదికాదండి. డబ్బు లేదన్నమాట పెట్టుకోవద్దన్నాం. ఎంతైనా సరే ఖర్చుపెడతామన్నాం. వింటేగా?

మాధు—వినటం మా కెప్పుడూ పనికిరాదండి

భావ—పైగా మేమంటే అకారణంగా మండిపడుతున్నారు. పిల్లకి పెళ్ళిచేయమన్నాం. అంతేగా మావల్లతప్పు? ఇహ మా నౌఖర్లని కూలీల్ని తిరగదీసి సమ్మెకట్టించి పట్నంపోయ్యారు.

మాధు—వీరితో మాకేకాక మీగ్గూడా కష్టాలు వచ్చిపడుతుంటే యెట్లా చెప్పండి?

భావ—మేమెన్ని కష్టాలన్నా పడగల వోపికుందిలెండి. పాపం మీరెట్లా పడగలరు? అసలు అతిగా ఆలోచన్లూ చదువూ ఎక్కువైనందువల్ల మతియేమన్నా చెడిందేమోఅని అనుకొంటున్నామండి.

మాధు—అంతేకావచ్చు సందేహంలేదు.

భావ—దీనికేదో ప్రయత్నించి చూస్తాంలెండి. మీరుమట్టుకు భయపడి వారిమాట వినేరు?

**మాధు**—ఇష్టం లేదనే కోపంవచ్చి తలిదండ్రుల్ని దీసుకొని లేచి పోయారు.

**భావ**—ఎక్కడికీ పోరులెండి. వారేవస్తారు. అయినా వారితో యేమీ పెట్టుకోకండి. (దగ్గఱకొచ్చి) ఈ వుంగరం అమ్మాయికి చాలుతుందో చాలదో చూడండి (ఇచ్చును)

**మాధు**—(పెట్టుకొని) డైమన్డు కాయల్లు చీకట్లో బాగా మెఱుస్తున్నై. రేపిద్దురు గాన్లెండి (తిరిగి ఇచ్చును.)

**భావ**—ఎబ్బే! మళ్ళీ ఇవ్వాట మొందుకండి? మీరిది పెట్టుకోండి. అమ్మాయి కింకోటి తెప్పిస్తాను.

**మాధు**—నా కక్కరేదు. వెళ్ళండి.

**భావ**—మీ కెందుకో బాధుంది. ఉండుకోండి మీకంటె నా కెవరున్నారు?

**మాధు**—మీమాటలు నాకేం అర్థం కావటంలేదు వెళ్ళండి.

**భావ**—ఇంతకంటె అర్థం మీ కెక్కడుందీ. పుచ్చుకోండి చాలా సుఖపడతారు.

**మాధు**—ఇందుకా మీరొచ్చింది? మీకు మర్యాదాకాదు. వెళ్ళండి.

**భావ**—నా కింతకంటె మర్యాదా మహాభాగ్యం మతేముంది?

(పట్టుకొనును.)

**మాధు**—(విడదోసి) ఛీ! క్రూరాత్ముడా! ఎంతపనికి సాహసించితివిరా?

**భావ**—(లేచి గదితల్పులు వేసి) దీని కెంతన్నా, సంతోషిస్తారు. సాహసిస్తారు. ఫర్వాలేదు. ఏమీ లోటుచేయను.

(దగ్గఱకి వచ్చును)

**మాధు**—ఛీ! దుష్టుడా? దగ్గఱకిరాకు. ఊరక పెద్దవై సమస్త ధర్మశాస్త్రాలు చదివి ఎంతఘోరకలికి పాల్పడితివిరా?

**భావ**—అన్నింటికీ ప్రేమారాధన ప్రధానమని ధర్మశాస్త్రాలు చెప్పినై. దీన్ని తిరస్కరించరాదు మణి

మాధు—ఛీ! ప్రాణఘాతకుఁడా! నీధర్మశాస్త్రాలు, నీదానధర్మాలు నీసప్తాహాలు, నీదేవాలయాలు నీ కెటువంటి బుద్ధినిచ్చి పెంచుకొన్నవిరా? ఓపంచభూతములారా! ఓ ధర్మదేవతలారా! ఓ వేదశాస్త్రపురాణ పురుషులారా! ఇదియా మీధర్మ పరిపాలన? నాప్రభువు దగ్గఱ లేని సమయం కనిపెట్టి, యింత అర్ధరాత్రివేళ యీ ఆడదానిని పెద్దపులి పొట్టను బెట్టుతున్నారా? హృదయాలు లేవా? పాపభీతి లేదా?

(తెరలోఁచి కళ అమ్మా! ఏమిటే, తల్పుతీయవే)

మాధు—తల్లీ! కిరాతకుని చేతికి చిక్కితిని. నీ కింకా అమ్మలేదుతల్లీ!

(తెరలోఁచి కళ అమ్మాఅమ్మా అని బిగ్గఱగా కేకలు పెట్టును.)

భావ—(నవ్వి) దేవత లందఱికీ చెప్పి సెలవ తీసికొచ్చినవాణ్ణి, భయం లేదు. నామాట విను. చేతగాని అప్రయోజకుడివల్ల నీజన్మకి సుఖం లేదు. ఇటువంటి నీకుసుమకోమల సువర్ణశరీర సౌందర్యరాశిని, ఇంత నీమృదుమధుర దివ్యకళా సామ్రాజ్య జీవిత ధనాన్ని వృథాచేసుకోనక. నీకు నా నవరత్నసౌధాలు నా సమస్తైశ్వర్యాలు వ్రాసియిస్తాను. అసలు నీకోసం ఎంతఖర్చు పడితినో, ఎంత శ్రమపడితినో కొంచెం ఆలోచించుకో.

(పట్టుకొనును)

మాధు—(పడద్రోసి) ఓరీ! నీచుడా! పరమచండాలుడా! ఎంత పాపకార్యానికి వొడికడితివిరా! ఇంతకామాంధుడవై స్త్రీహత్యాదోషానికి పాల్పడితివిరా! క్రూరుడా! నీకు రోజులు దగ్గఱ కొచ్చినవై.

భావ—(నవ్వి) నీకు వీరపూజలు సమీపించినవై. ఇంతకాలం యిట్లా మేపి మిమ్మల్ని బలిపించింది యీ జాతరకే. మిమ్మల్ని చేర్చి పోషిస్తున్న లగాయతూ, నాసంస్థానం ఘోషిల్లుతున్నదే గాని ఎన్నడూ కళాకాంతులతో విలసిల్లి మెఱుగదు. స్వల్పజాతికి సర్వజాతిగుణంరాకమానదు. ఇహ దేవీఆజ్ఞ అయింది. నేటితో

(కత్తిదీసి) నీ ఆయుర్దాయం తీరింది. వినదవా? లేక కత్తిదెబ్బ తినెదవా?

మాధు—(బిగ్గరగా) అమ్మా! కళా! తల్లీ! ఈక్రూరుడు చంపుతున్నాడు (తటాలున పోయి తల్పుతీయును)

భావ—ఓసీ! రక్కసీ! వినవుగా (కత్తితో పొడిచి పారిపోవును.)

మాధు—తల్లీ! కళా! బ్రతకను.

[పరుగున కళ ప్రవేశించి]

కళ—(గోలపెడుతూ) అమ్మా! అమ్మా! ఎంతకష్టకాలంలో పడ్డామే అమ్మా! అమ్మా!

మాధు—తల్లీ! కళా! ప్రాణంపోతున్నది. ఒక్కమాటు నన్ను కౌగిలించుకో తల్లీ! నను గన్నతల్లీ! నీ కింకా దిక్కెవరుతల్లీ! మీ నాన్న వచ్చేవరకూ నాప్రాణాలుండవు తల్లీ! (కౌగలించుకొని) ఆపద్బాంధవా! ఈబిడ్డను గూడా కరుణించవా? (పడిపోవు)

కళ—ఈ గతిలేని కొంప నడియేటను ద్రోయుట కింత ఖడ్గ వి
ద్యాగరిమంబు కావలయునా? యొకదెబ్బకుఁ గూలకుండునా?
నీ గరువమ్ము నీదు కమనీయకళామహిమమ్ము లేవగా
సాగర! యీ భయంకర నిశాచర భూమిని తాండవించరా.

కళ—అమ్మా! నన్ను తల్లిలేనిపిల్లని చేసిపోతున్నావా? అమ్మా! అమ్మా! నాన్న కేమని చెప్పనే? తల్లీ! నాన్న లేని సమయం కనిపెట్టి ఈ దుర్మార్గులు ఎంత ఘోరానికి దిగినారే తల్లీ!

ఎన్నినోముల పంట కన్నవారల కిచ్చి
పిచ్చి తల్లిగ నీవు వచ్చినావో
ఎన్ని మ్రొక్కులు మ్రొక్కి చిన్నిపండును గాంచి
వెఱ్ఱితల్లిగ నన్ను పెంచినావో
ఎన్నివాట్లకు నోర్చి యిన్నిధర్మము లోర్చి
ముద్దు తల్లిగఁ బ్రొద్దుఁ బుచ్చినావో

ఎన్ని ప్రతిజ్ఞలః కింత సాహసముండి
జ్ఞానమాతగ నీతి చాటినావో
ఇంత లోకభీకర క్రూరమృగముల కిఁక
జిక్కి యెంత యేడ్చితివో నిశీధి జనని !
పలుకవా ? నాన్న గుండెలు పగులువఱకు
నన్ను ముఱతువా విడుతువా కన్నతల్లి.

జగద్బాంధవా ! నీవు ఆపద్బాంధవుడవు గావా ? తెల్లవార్చవా ? నను గన్నతల్లిని రక్షించవా ? ఈబిడ్డను కనికరించవా ? ఇంత కటిక దరిద్రులమొఱ వినిపించుకోవా ?

ఇన్ని ప్రాణాలనుధ్యబడి యీపసిగ్రుడ్డగురించి యెంతయో
తన్నుకొనంగఁ జొచ్చి ప్రాణాలిప్పిన తల్లి మఱెన్ని కష్టముల్
గొన్నదో; యింత కాఱడవిలోపల నక్కిన వేటకాఁడ ! నీ
కన్నులు మూఁతబడ్డవి ప్రాణా లెగఁబడ్డవి పాడుపొట్టకై.
అమ్మా పలుకవా? అయ్యో ! అమ్మా !

(పడిపోవును. తెరపడును)

[ప్రక్కన పాడుకొంటూ సుందర్రావూ, బడేసాహెబూ,
కూలీలు పోతుంటారు ]

వణకించెడి చలికాలం వచ్చిందోయ్
మీరింకా
సకిలించెడి కలికాలం వచ్చిందోయ్
పగబట్టిన సర్పాలూ ఎగబడ్డాయోయ్
మీరింకా బిగపట్టిన ప్రాణాలూ అగబడ్డాయోయ్ ॥వణ॥

తెరలోంచి కళ అమ్మా ! ఈ కాఱుచీకటిలో
మనకి దిక్కెవరు తల్లీ ! )

సుంద — కూలిజన సోదరులారా! ఆదినాలాపన ఎక్కడికోవింటిరా?
వర్షాగాని మఱితడిస్విది ప్రళాహీనమ్ముగా దీనమై
ఘనపంటంతటను ముంచివేయు జలధిన్ బొంగించి నిశ్శబ్దలో

క విహారమున్నను సల్పుచున్నది మహాకారుణ్య కారుణ్య సౌ
ఖ్యవిధాత్రుం డెవఁడో కనంబడడు నక్షత్రప్రభుత్వంబులోన్.
(తెరలోంచి)

[కళ—అమ్మా! మాట్లాడవేవా? అయ్యో! అమ్మా!]

బడే—హెక్కోఖాదూ హాండి! పాపం ఖనీసాహెబ్ ఘుర్మే ఘోలా హాండీ!

సుంద—ఔను. కవిగారి ట్లోనే గోల వినబడుతున్నది. త్వరగాపదండి.
(తెరపడును)

కళ—అమ్మా

దిక్కూ మొక్కూ లేదా ఎక్కడా
తండ్రీ తండ్రీ ॥ది॥
తల్లీ తల్లీ నీకూ ఎక్కడా ॥ది॥

[సుందర్రావు, బడేసాహెబు, కూలీలు ప్రవేశింతురు]

సుంద—కళా! ఏమిటి? కళా! ఎందుకు మీ అమ్మగారు పడిపోయినారు? చెప్పవేం కళా?

బడే—హారే! హీం దికతం హేమ్బిహా హ్యా?

సుంద—రకమే, ఏమిటీఘోరం? కవిగారిమీద కత్తి కట్టినవారే ఇంత ఘోరదురంతానికి దిగింది.

కళ—అమ్మా! తల్లిలేని పిల్లని చేసిపోతావా?

బడే—హా రే! ముందూ ప్రాణంహాయింకదో లేదో సూడూహా హ్యా?

సుంద—(చూచి) ప్రాణంపోయింది. అయ్యో! కవిగారి కెంతకష్టం వచ్చి పడిందిరా?

కళ—మా అమ్మలేదా? సుందర్రావ్! ఇంకా మాఅమ్మ నాకులేదా?

సుంద—కళా! నీతల్లి జగజ్జనని. ఈ తనయు లందఱూ ఆ మాతృదేవత యొక్క చల్లని కటాక్షంవల్లనే బతుకుతున్నారు. ఈ తల్లికోసం మా సర్వస్వమూ ధారపోస్తాం.

ఏ వజ్రకాయమ్ము లీ గడ్డకై పెనఁ
గి తునిఁగి క్రిములుగా బ్రతుకుచుండె ?
ఏ సింహగర్జన లీపాడు బానిస
త్వము బాపుటకు సముద్రమున గలిసె ?
ఏ ప్రతాపకిశోరు లీ ప్రతిజ్ఞకు శౌర్య
బడబాగ్నికీలలై బయట పడరు ?
ఏ గంభీరహృదయు లీ దిక్కుమాలిన
దేశమ్ములోఁ బుట్టి దీనులైరి
ప్రథన చండ ప్రచండ నిర్వక్రఘన ప
రాక్రమ యశోధనులు పునర్జన్మ లెత్తి
తల్లికన్నీటి కాల్వ సత్వరము గట్టి
ధన్యలౌట మతెప్పుడో ధరణిపైన.

బడే—హాధీ సరేహయ్యా! హిప్పూ ఖవిగారిఖోసం జల్దీ ఘోవద్దా హాయ్యా ?

కళ—నాతండ్రులారా! నాతల్లిని బ్రతికించరా ? అయ్యో అమ్మా!

సుంద—కళా! నీ విట్లా పడి యేడిస్తే పోయినతల్లి వస్తుందా ? ఏడ్వక కళా! (చూచి) మీనాన్నగారు కూడా వస్తున్నారే.

కళ—అమ్మా! నాన్నవొస్తున్నాడా? అమ్మా! నాన్నొస్తున్నాడే. మాట్లాడవా తల్లీ! ఎంత దురదృష్టవంతుల్ని చేసి పోయినావే అమ్మా ?

సుంద—కళా! ఏమిటి నీపిచ్చి ? పోయినతల్లి యెట్లా మాట్లాడుతుంది? అదుగో నాన్నగారొచ్చారు.

[నిరంకుశకవి ప్రవేశం]

కళ—నాన్నా! నాన్నా! అమ్మ పోయింది. నాన్నా! నాఅమ్మలేదు.

నిరం—ఏమిటి తల్లీ! ఈ ప్రళయం ? (కళను తీసుకొనును)

సుంద—ఈ రాత్రే ఇంత ఘోరం జరిగింది. ఎవరో కత్తితోపొడిచి పోయినారు. మే మింతకుముందే వచ్చి చూచాం.

నిరం——అకటా! ఎంత నిర్భాగ్యుణ్ణి. మాధురీ! నీమాట నిరాకరించి నందుకు తగిన శాస్తి చేసితివా? మాధురీ! కడకు నీ ప్రాణ త్యాగంగూడాచేసి నన్ను మొండి శిఖండిని చేసితివా? ఇంకా యీ చిన్నారి తల్లికీ నాకూ దిక్కెవరు మాధురీ? అయ్యో! మాధురీ! నీ అమృతబోధ పెడచెవిని పెట్టినందు కెంతపని జరిగినదే? తల్లీ! జగన్మాతా! నా మాధురిని, నా అర్ధాంగిని నా అష్టైశ్వర్యాన్ని నీలో కలుపుకొంటివా?

ఓ కమనీయ పద్మచరణోజ్వల కోమల జీవపద్మ! ఓ
త్మాకుల శోభినీ! భరత ఖండమ! నీ రతనాలగర్భ కీ
వ్యాకుల దావవహ్ని బలవంతముగాఁ దగిలించుపుత్రులే
లా? కురిపించ కేవగపుటశ్రులు లోకము లెల్ల మున్గిపోన్.

ప్రేయసీ! ఈ భయంకరదుర్గమారణ్యాలలో ఈ లోకభీకరమైన క్రూర మృగాలలో యిల్లా దిగడిచ్చి వెళ్ళిన ఇంత నష్టజాతకుని ముఖం చూడరాదు. చూచి జాలిపడరాదు.

కళ——నాన్నా! అమ్మింకా కనపడదా? అమ్మని నీవుకూడా బ్రతికించ లేవా?

నిరం——తల్లీ! ఈ నిర్భాగ్యుడికి అంత గొప్పతనం ఎక్కడిది? ఇంకా ఈ కటికదరిద్రుఁడికి యింత పరమసాధ్వి యెక్కడ కనబడుతుంది?

ఓ సుగుణప్రసూనలత! ఓ సిరుపేద కుటుంబినీమణీ!
ఓ సుదతీలలామ! యిదిగో! నిను నీ పసిగ్రుడ్డుముందు రా
కాసిగ వచ్చి చంపిన మొగమ్ముని! మృగమ్ములు చుట్టుముట్టి నా
దోసమువల్ల నేఁడు పడఁద్రోయును నా చెడుమేను చూడకే.

ఓ నిరంకుశకవి చక్రవర్తీ! నీ అసమాన భాషాప్రభుత్వం, నీ మృదు మధుర గాన కవితా పరవశత్వం, నీ అమృత వాగ్ఝరీ వినూత్న విప్లవ విశాలభావ గంభీరత్వం కట్టిపెట్టు. కాలచక్రం తలక్రిందులుగా తిరుగుతున్నది. జగత్సాక్షియైన కర్మసాక్షికి చూపు తగ్గింది. అమృతాంశుఁడైన షోడశకళా ప్రపూర్ణుడికి

క్షయరోగమధికమైంది. రాజవ్యాఘ్రాలకి దురాశాపిశాచంపట్టింది. క్షామదేవత మృత్యుదేవత గ్రామగ్రామాలమీదాయెగఁబడ్డై. పేదకుటీరాలు ఆకలిమంటలో మారణమైపోతున్నై. వృద్ధులూ పసిపిల్లలూ వొకరవస్థ నొకరికి తెలియకుండా మలమల మాడిపోతున్నారు. ఈ భూదేవికి ఆయుర్దాయం తీరింది. ఓ అగ్నిపర్వతములారా! మీ భయంకర క్రోధాగ్ని జ్వాలలు లోకాలకి ముట్టించుడు. ఓ గంభీర భయానక వీరభీకర చతుస్సముద్ర లోకములారా! మీ ప్రచండ బడబాగ్ని లీలలూ, అలలూ లేపి, ప్రళయకాల మృత్యుదేవతని ఆహ్వానించుడు.

శ్రమజీవి యోడ్చెడి చెమట బిందువులోని
సిరికింత యురిపోసి మురియు దొరలు
పిచ్చిగోవుల బక్క ప్రేగులలో గల
పచ్చినెత్తురు త్రాగినచ్చు పులులు
తలయెత్తి చూడని యిలగొర్రె గుంపులో
పాళ్ళ కెగఁబడు తోడేళ్ళగుంపు
గింజగిట్రయు మేయుగిజిగాళ్ళ గూళ్ళలో
గ్రుడ్డుకొఱకు జొరఁబడ్డ పురుగు
లకటకట! లేపుచున్న మహాదురంత
దుఃఖభీకర బడబాగ్ని ధూమధామ
ఘోర సంక్షోభలయకాల కారణములు
పగులగొట్టనె బ్రహ్మాండభాండ మిపుడు.

మాధురీ! నీవు కాపురానికివచ్చినతర్వాత యీనిర్దయుడు ఈనిరంకుశుడు వొక్కనాడైననూ హాయిగా సుఖపెట్టకపోగా, ఎంతచిత్రవధకు వొప్పగించెనే మాధురీ! ఈలోకంలో నిజం కోసం నిలబడ్డ యీనిరంకుశుడిమాట యెవరు చెవిని పెడతారు?

ఈ మృగజాతి యీపరమహేయపు పచ్చికసాయిజాతి ఈ
భూమిని బుట్టుచున్న చెడుముర్గుడు కాలములో రుచించునే
కోమల మాధురీసుకవి కోకిలగానము ? ఘోరవీరసం
గ్రామశ్రుతి ప్రతిధ్వనులు కమ్మగ నాటునుగాని మాధురీ !

[ఇనెస్పెక్టరు పోలీసులు
ప్రవేశింతురు]

ఇనె.— నిరంకుశకవి ఎవరు ?

నిరం.— నే నండి

ఇనె.— సన్న రెస్టుచేశాం, పదా మాట్లాడక.

నిరం.— నేను కాదు హంతకుణ్ణి.

ఇనె.— అదంతా మాకు తెలియదు. సమ్మెలు కట్టించి, ఇళ్ళు తగలబెట్టి హాంపోతే కేసెక్కడికి పోతుంది? మాట్లాడక పదా.

సుంద.— ఇదేమి అన్యాయమండి ? వా రేమీ యెఱుగరు వారు నిరపరాధులు, పైగా చాలా ఆపదలో వున్నారు. ఎవరో ఈ రాత్రి వారి భార్యాని మర్డర్ చేశారండి.

ఇనె.— అదంతా మాకు తెలియదు. స్టేషన్‌కొచ్చి రిపోర్టు చేయండి. వచ్చి కనుక్కొంటాం. పదవయ్యా కవీ !

నిరం.— సుందర్రావూ ! నా కళకి తల్లిలేదూ ! తండ్రిలేదు. మనఃస్ఫూర్తిగా నీవు నాకళకి వచ్చినప్రియుడవు. ఇప్పుడు నా కళామాతృనిర్యాణంలోనే నా చిన్నారి కళా కళ్యాణం కూడా చేస్తున్నా. ఇదిగో ! (కళను తీసికొని) సుందరా ! ఈ తల్లిదండ్రుల్లేని కళానకుమారి నీప్రియమైన యిల్లాలు, పరిగ్రహించుము. (ఇనెస్పెక్టరు రికార్డు తిరగ వేసుకొంటుంటాడు.)

తల్లీ ! నాదుకళాకుమారి ! యింక నీధ్యానమ్ము నీమాధురీ
సల్లాపమ్ము మహాకుతూహలముగా సాగించు వా రెవ్వ రీ
కల్లోలమ్మున ? నీ శిరీష గుణరాగశ్రీలు సూపించి, మే
మెల్లన్ మెచ్చెడి యీ మనోహరుని కీ విల్లాలవై యుండుమీ.

సుందర్రావూ ! నాబిడ్డ కిహ దైవం నీవే పోషించుకో.

ఇనె—లేబర్ లీడర్ సుందర్రావు ఇతడేనా ?

సుంద—నేనే నండీ.

ఇనె—నీగ్గూడా అరెస్టు వారెంటు వచ్చింది. ఏయ్. హండ్రెడ్ వొన్ ! ఇతనిగ్గూడా బేడిలు వెయ్యి.

పోలీ—పట్టవయ్యి ! ఇట్లా నించో (బేడీలు వేస్తుందురు)

సుంద—(నవ్వుతూ) ఇంతకంటే చేశేదేమున్నది ? వేయండి.

చాలయుగాలనుంచియు; బుజాన సమస్త జగాలు మోయు కూ
లీలకు దేవుడప్పవసీ, లేవిడియై కడ కెంలి పెద్ద ఘో
రాలను లేపుచుండెనో పరాక్రమ సింహ కిశోర ? చూడుమీ
యీ లయకాలచక్రము మఱెవ్వఁ డెదుర్కొని ఆపఁగల్గునో.

ఇనె—ఇహాకట్టి పెట్టెపదండి (నెట్టుకొని పోదురు)

కళ—(లేచి పౌరుషంగా)

ఓరి కిరాతిగాడ ! కనులుండని ఓరి కసాయివాఁడ ! యీ
శూరుల, కన్నతల్లిని త్రిశుద్ధిగ బొట్టను బెట్టుకొన్న నీ
దారుణ ఖడ్గరాజ పరితాపశతఘ్ని మహా క్షుధాగ్ని చ
ల్లారక యింక పౌరుషకళానుకుమారుని గూడ కూల్తువా ?

(మధురిమీద పడి యేడ్చుచూ) అమ్మా ! నాకింకా దిక్కెవరు ? నన్నుగన్నతల్లీ ! ననుగన్నతండ్రీ ! మీబిడ్డని యీ కాఱడవిలో వదలిపోతిరా ? అమ్మా ! జగజ్జననీ ! ఈ గతిని కనికరించవా ? అమ్మా (పడియేడ్చును)

బడే—హారే సూస్తూ సూస్తూ వుండగానే హెంధాపళయం హొచ్చిపడ్డాద్. అల్లా! ఇంకా ఈ ధల్లీకి ధిక్కు హెవరూ వుండార్? హెంధాఘోరం సేసే పచ్చాపచ్చని ఖాపరం నట్టేటీక్ ధోశార్చే. అజే మేరాలేబక్కీ భయ్యా మనఫానాల్కీ హిచ్చి హెట్లాగెనా హీంధల్లీకి ఖాపాడూఖోవాలా అమ్మా! ఛోటీమాంతా! నీకీ బాబీక్ హిడిపిత్తాంలే హామ్మా! అకే అల్లా! నీకీ ఖఘ్యాలేవ్వూంరా బే? దేఖో! హీంఘోరం, హీ హాన్యాయం. ఆఆచ్ఛారీ ఘూడీక్ ఆబల్ దోంగాసన్నాసీఘూడిక్ దగ్గఱాహాంది యింధాఘోరం. హీ మొహార్బానీ పఠాలాలూ మూలంగా లోఖాలూ హిట్ల థగలాఫడీ పోతూవుండై. హింకా దమ్మం హేడానచ్చింది గే? లేహామ్మా!

(తెరపడును)

# కష్టకాలం

## పంచమాంకము

### 1వ రంగం. భావయ్య దేవిడి

[భావయ్య మంచంమీద పడుకొని కలవరిస్తూ వుంటాడు]

భావ—ఎంతఘోరం ఎంతక్రూరకర్మం. మహాదోషం, మహాపాతకం. దీనికి తగిన పాపఫలం రౌరవాది నరకం అనుభవిస్తావు క్రూరుడా! ప్రాణఘాతకుడా! నీక్రూరచర్యలకీ నీ ఘోరందురంతాలకీ దేవతలు హర్షిస్తారనిభావిస్తున్నావు కాంబోలు. అదిగో భయంకర యమలోకం అదిగో లోకభీకరదావానలం.

(దేవయ్య వచ్చి బిక్క మొహంపడి వింటుంటాడు)

అమ్మో! భయం. ఎవరు వీరు? యమకింకరులా? క్షమించండి, విడిచి పెట్టండి. (నిద్రించును)

దేవ—చేసిన పాపానికి అప్పుడే దేవుడు యమలోకాన్ని చూపిస్తున్నాడు కాబోలు. చూపిస్తాడు. చూపించడు మరి? ఇంత స్త్రీహత్యాదోషం వూరుకే పోతుందా? ధనగర్వంతో కన్నుమిన్ను కానకుండా, ఎవర్నీ లెఖ్ఖపెట్టకుండా, నడిస్తే పాపం బ్రద్దలు కాకుండా వుంటుందా? మెల్లగా దగ్గఱచేరి నానావిధాలా ధననాశనం చేస్తున్న నీమోహార్పానీ స్నేహితులూ, నీ సలహాదార్లు, నీగురుపుంగవులు, నీబంధువులు వచ్చి ఇంత నరకంనుంచి ఎవరు తప్పిస్తారో చూస్తాగా.

[భావయ్య నిద్రలేచి కళ్లు నలుపుకొంటూ]

భావ—ఎవ రక్కడ?

దేవ—ఎందుకూ? నేనే?

భావ—వెటనే ఎవరన్నా పంపించి స్వాములువార్ని ఆచార్లువార్ని పిలిపించు ముందు.

దేవ—ఇంతకు ముందే కబురు చేశా.

భావ—అదికాదోయ్ గొడవ. చెబుతుంటే ఏమిటీ వినిపించుకోకుండా చెబుతావ్? అర్జెంటుగాపోయి పిలిపించమంటున్నా, దేవయ్యా దేవయ్య.

దేవ—పిల్చుకొస్తా (బయిల్దేరి పోయి వాళ్లు రావడం చూచి) అదిగో వారే వస్తున్నారు.

భావ—ఎవ రెవరు వస్తున్నారు?

దేవ—స్వాములువారూ, ఆచార్లుగారూ, వ్యాపారిగారూ, వెంకాయమ్మగారూ ఇంకా ఎవరెవరో వస్తున్నారు.

భావ—సరే ఫలహారాలు తయారుచేయించి పంపు పో.

దేవ—వెళ్తున్నా (నిష్క్రమించు)

[బ్రహ్మానందస్వామి, ఆచార్లు, వ్యాపారి, వెంకాయమ్మ బడేసాయబు, సుధాంబుధి ప్రవేశింతురు]

భావ—నమస్కారాలు, దయచేయండి.

(అందఱూ కూర్చుంటారు)

బ్రహ్మ—ఇంతకూ భావయ్య సంకల్ప శుద్ధిగలవాడు కనుకనే తల పెట్టనదానికి తిరుగు లేకుండా వుంది.

వ్యాపా—ఔను స్వామి.

ఇమ్మహానీయు డింతగడియించిన పేరు ఫలంచి స్వామి! నే
డెమ్మెయినైన యీరగడ నింక మహాజయలక్ష్మిఁదెచ్చు; ఆ
గమ్మగ గొంతు చించుకొని గ్రామము మీద విరోధులే దుమా
రమ్ములు లేపినప్పటికి వ్రాలవు వీనిపతాకబాహువుల్.

ఆచా—నిజం బాగా సెలవిచ్చారు. ఈ మహామహుని యఖండకీర్తి పతాకం నిలబడ్డచోట ఇహ ఎవరాటలూ సాగవు. ఆగవు.

చిల్లరమూక: యీ పురుషసింహుని సాహస మెంత మాత్రమున్
దెల్లముఁగాక యింత తలతిక్కగ నల్లరి లేపి కుల్కె; నేఁ
డెల్లజగమ్ములున్ వణకి యేమగునోయని తెల్లబోయి మూ
ర్ఛిల్లినగాని గాంచదు, పరీక్షకు వచ్చె మహాప్రతాపముల్.

బ్రహ్మ—యథార్థంగా అంతే, ఈధీరోదాత్తుని సంగతి తెలియక లోకం చాలా పొరపాటుపడ్డది

ఇంత సముద్రుఁ డల్గిన మఱెంత మహాప్రళయమ్ము లేచునో
గంతులు వేయుఁ దుర్మతులు గాంచక దూకిరిగాని యింక ది
గ్భ్రాంతులగుండె బ్రద్దలయి గందరగోళము వెట్టువేళ క
న్పింతురె సోదిలోనయిన వీరు యశోధనులార ! చూడుడీ.

వెంకా—రామయ్యాతండ్రీ రామయ్యతండ్రీ కన్నుమూసి కన్నుతెర చేలోపల ఎంతకష్టకాలం వచ్చిపడ్డదిరా తండ్రీ! ఏముందీ? పోకదలరోజు లొచ్చినై గనుకనే వినకచెడిపొయ్యారు, స్వామీ! కనుకనే పండువంటి కాపురం యిట్లా బ్రద్దలుచేసుకొన్నారు? అయ్యో! దానమ్మకడుపు బంగారమైపోను, గోటితోగిల్లిపారేసే పొయ్యేదానికి గొడ్డలి పట్టాల్సివచ్చిందే! కాలం కాలిపోతే దేవుడికి దయరాగూడదూ?

భావ—ఇదంతా చూస్తుంటే నా కయోమయంగా వుంది. ఏమీ తోచటంలేదు. పైగా వాయిదా రేపేకామల్లు. ఊరు మునపటల్లేలేదు. పిడుగులుపడుతున్నై. వఱదముంచుకొచ్చింది. దరి కనపడటంలేదు. ఈ అఘాతంలోంచి, యీ మహాప్రళయఁ లోంచి యెట్లా దాటుతామో యేమో, పనివాళ్ళంతా మానేశారు. ఎవరిదారి వారుచూచుకోవల్సిన ఘడియ లొచ్చినై.

ఆచా—మనం భయపడాల్సిన పనిలేదు. మీనిష్కల్మష నిర్మలాత్మ, మీ దిగంతవిశ్రాంతకీర్తి మిమ్మల్ని ముమ్మాటికీ గెలిపించి

తీరత్తై, మీ కేసు విషయంలో మా సర్వస్వం ధారబోస్తాం. జడ్జీగార్కి నిజం తెలిసింది. అంటే మనం పంపించిన ప్లాను అందింది, ఫరవాలేదు. అసలింకోటి. కథంతా అడ్డం తిరిగింది.

బ్రహ్మ—ఏమిటి నాయనా అది?

ఆచా—నిరంకుశకవి భావయ్యగారితో కలహం పెట్టుకొని, వూళ్లో వున్న కూలి జనాన్ని సమ్మెకట్టించి, భావయ్యగారి ఇళ్లూ కుప్పలూ తగలపెట్టించి, నాటిరాత్రే పరారయి పోయిన ఈ కేసే గాక యింకో కేసులో కూడా ముద్దాయిగా చిక్కాడు.

బ్రహ్మ—అదేం కేసు తండ్రీ?

ఆచా—అదా! అన్నిటికంటే పెద్దదేలెండి. ఈకవి కనకూతురి వివాహవిషయంలో తన భార్యా తనమాట తిరస్కరించి పట్టుపట్టి రహస్యంగా భావయ్యగారితో మాటలు సాగించి, కూతుర్ని భావయ్యగారికివ్వటానికి నిశ్చయించు కొన్నట్టు తెల్సుకొని, చెప్పి వినిపించలేక, కడచినరాత్రి యెక్కణ్ణుంచో వచ్చి, నిద్రపోతున్న మాధుర్ని చంపి పరారయి పోతుండగా పట్టుపడ్డాడు. ఇది ఖూనీ కేసు.

బ్రహ్మ—వినాశకాలే విపరీతబుద్ధిః, ఈకవికి తోడుగావున్న సుందరరావే మైనాడు?

ఆచా—వాడూ కవిగారితోనే పట్టుబడ్డాడు.

వ్యాస—ఎట్లాగైనా సరే ఈఖూనీ కేసులో వాళ్ళిద్దర్నీ బాగా ఇరికించాలి. దీంతోగాని జన్మప్రాయశ్చిత్తం జరగదు.

బ్రహ్మ—నిజం. తప్పకుండా ఈఖూనీ కేసులో వాళ్ళిద్దర్నీ మొదటి ముద్దాయిలుగా ఇరికిస్తే మట్టుకు వూరిపీడ వదలిపోతుంది.

ఆచా—అయ్యో! అదేమిటిస్వామి! ఖూనీ కేసులో కవీసుందరరావూ మొదటి ముద్దాయిలైనారండి. అయితే! ఇందులో మనమంతా సాక్షులుగా వుండాలి.

బ్రహ్మ—అయ్యో అంతకంటేనా. తప్పకుండా వుంటాం నాయనా!

వ్యాపా—నిరభ్యంతరంగా వుంటాం. సాక్ష్యం ఏమని చెప్పాలి?

ఆచా—చెబుతా వినండి. తనకుమారై వివాహ విషయంలో పట్టుదల వచ్చి తనమాట తిరస్కరించి, రహస్యంగా భావయ్యగారితో సంప్రదింపులు సాగించి తనభార్యయైన మాధురి భావయ్య గారికి మాటిచ్చినట్లు మనం గట్టిగా చెప్పాలి. ఆరాత్రే కవీ సుందర్రావూ కల్సి మాధుర్ని ఖూనీచేసి శవాన్ని మోతుకు పోతుండగా చూచామని చెప్పాలి.

వ్యాపా—రాత్రివేళ మీరెట్లాగురుపట్టగల్గారని అడిగితే ఏంచెప్పాలి.

ఆచా—భావయ్యగారింట్లో పురాణం చెప్పి వస్తుండగా వెంటవస్తున్న లైటువెల్తురులో శవాన్ని మోతుకుపోతున్న కవీ, సుందర్రావు కనిపించారని చెప్పండి.

బ్రహ్మ—భేష్ బాగావుంది. ఇంకా ఏమన్నా వున్నయ్యా?

ఆచా—ఇంకేంలేవు. ఇవిమట్టుకు గట్టిగా చెప్పాలి. తర్వాత చక్రాన్ని అవలీలాగా దొర్లిస్తా. వెంకాయమ్మగారూ! మీరు మీకుమారుడూ సాక్షుల్లో వున్నారు సాక్ష్యం ఇస్తారా?

వెంకా—అదేమిటి నాయనా! జరిగింది చెప్పటానికేం, నిక్షేపంగా చెబుతాం.

ఆచా—అదిగాదండోయ్ కొంపదీసి. జరిగింది జరిగినట్లు చెబితే యింకేంలేదు. మనమంతా సెలవ పుచ్చుకోవల్సిందే, మేం రేపు మళ్ళీ ప్లీడరుగారింటిదగ్గర యింతకుముందు చెప్పినపాఠమే చెబుతాం. అది భట్టీపట్టి చెప్పాలి.

సుధా—అట్లాగేలెండి. ఇప్పుడు పాపాలూ పుణ్యాలూ చూచుకోరాదు. మాఅమ్మ పూర్వకాలపు మనిషి కాబట్టి తికమకపడ్డది.

వెంకా—అంతేరా తండ్రీ! వాళ్లమచ్చమాయ, మచ్చమాయ అని ఎప్పుడు వాళ్ల కాపరాలు ఖాలి కచ్చికలై పోతయ్యోగాని యింకా నాకోడుకు దెబ్బలుమాన్లా. సాక్ష్యం తప్పకుండా ఇస్తాం తండ్రీ! సాక్ష్యం ఇవ్వొద్దుమటీ, యివ్వకపోతె యెట్లా?

(దేవయ్య ఫలహారాలు పట్టించుకొస్తాడు)

భావ—(లేచి) స్వామి! దయచేసి ముందు ఫలహారాలు కానీయండి. దేవయ్యా! అట్లాచూస్తావేమయ్యా! అందరి కందించమని చెప్పు.

దేవ—చెబుతా! త్వరగా అందరికి పెట్టుకురండి. ముందు స్వాములు వార్కి కనుక్కోండి.

(ఫలహారాలు పెడుతుంటారు - అంతా తింటుంటారు)

ఆచా—బడేసాహెబ్! అట్లానుంచుని చూస్తావేం? అతనిక్కూడా ఇవ్వండి.

బడే—నాకి హంటో భాగా లేదూ హాండి మారాజ్!

బ్రహ్మ—అన్నట్టు బడేసాహెబుగూడా సాక్ష్యం ఇవ్వాలిగా.

బడే—నాకి సాచ్చంగిచ్చం పెట్టా హొద్దూ హాండి హిట్లా భక్తి భయటా పడితె నాలూహాండీ నాకి.

ఆచా—అదేమిటోయ్! నిన్ను గూడా సాక్షుల్లో వేసుకొన్నా.

బడే—నాకి సాక్షుల్లోనూ హొద్దూ, మూచ్చల్లోనూ హొద్దు బాబ్. కుచ్ నై మాలుం నాకి.

ఆచా—అట్లాఅంటె యెట్లా? మనమంతా దొరగారి పులుసు తిని బ్రతుకుతున్న వాళ్ళం. కాస్త సహాయం చెయ్యాలిప్పుడు.

బడే—హావును ఖానీండి! ధీన్కి సాచ్చంలో మట్కి నాకి పెట్టహొద్దు హాండీ. ఏఘాఘం నాకీ తెలియుదూ బాబూ! నీకీ సలాం సేస్తా.

భావ—చాల్లే నీసలాములూ కురానులూ కట్టిపెట్టు. నీముండమోపి నాత్యాలకోసం ఇక్కడెవ్వడూ పడి యేడ్వటంలేదు. నీగుణం గూడా దీంతో బయటపడింది. మంచిది

బ్రహ్మ—అదేమిటి బడేసాహెబు! సమయానికి అక్కరకు రాకపోయినప్పుడు మనల్నింకా మోయట మెందుకు?

బడే—మీకి ఖోపం సేస్తే మాకిసెప్పేది హేమ్టిలేదూ ఖానీండి హాయ్యా! మీకే సలాం సేసీ సెప్తా. మేరా ముసల్మాన్కి—

లోగ్గ్రే థప్పుడూ సాచ్చాల్కి సెప్తే సాలాదోసమూ హయ్యా. మాఖాడా హెంధా ఫచ్చిదరిద్రం సుట్టూఖోనివాుండా మాకి కురాన్ మాసత్తెంలో భత్కి హాుందీ బాబ్! కడ్పూకీ లేఖా పోతే ఫసుల్‌పడి చచ్చి ఫోవాలా హాండీ! అదీ అల్లాకీ మెచ్చు కోంటాడ్, హేమ్టీహయ్యా! హింధింతా వేదాంతాలూ సెప్పే నాహాోంటోడ్కీ హిధీహాండి సెప్పేది? సాచ్చెం సెప్ప టాన్కి హొోప్పుఖో లేదూ హానీ, నాకు నౌఖర్ తీసీపారేస్తార్? హాంతేఖాదూహయ్యా సేసేది? ఖుదాఇచ్చిన రెక్కల్ సల్లంగా హాుంటే, సైట్కాల్యొల్ హాుడ్చి భత్కాతామూ హాయ్యా! మాకి రెక్కల్‌కట్టంతో సత్తెం హాంటే బత్తెంపుట్టాదూహాండీ, పుట్టకఫోనీండి. హేమ్టీసేస్తాం. ఈ కట్టఖాలాన్కి భలీహాయీా పోతాం. పైనా ఖుదాలేదూహాండి, సూస్తాం. హాంతేఖానీండి. మాకీ సాచ్చాల్కి గిచ్చాల్కి హామ్మ్మడూ ఫోమూహాండి.

(నిష్క్రమించును)

వ్యాసా — పెద్ద ఉపన్యాసమే ఇచ్చాడు. పిచ్చిసాయబూ పిచ్చిసాయబు.

భావ — వీడో లెఖ్ఖలోవాడా జమలోవాడా పోనీయండి, మనకేం ఫరవాలేదు పదండి. (తెరపడును)

(2 వ రంగం వీధి)

[ఉరిశిక్షపడి పోతున్న కవీ సుందర్రావులకోసం కోటీ, కళ ప్రవేశం]

కీర్తన

కళ — కరుణాలయా! కనిపించదా!

నీ

సృష్టిజాలమూ

మా

కష్టకాలమూ

యూ
నడిసముద్రములో
బడద్రోసి పోవుటల్ ||కరు||

కోటి—ఇంకా నాగోడు ఆలకించే దేరో కొడకా! పదిమాసాలు
మోసి కన్నారా కొడకా! నా పొట్టపగలకొట్టి ఉరిసిచ్చ
యేశారంట్రా కొడకా! అయ్యో నా కొడకా! నీతల్లి కింకా
దిక్కెవరురా కొడకా

కళ—కోటీ! అరుగో! మీ అబ్బాయినీ, మా నాన్ననీ తీసికొస్తు
న్నారు. అయ్యో నాన్నా! ఇంత కష్టకాలంలో ఎన్నిప్రతి
జ్ఞలుబట్టి ఉరి స్తంభానెక్కటానికి పోతున్నావే నాన్నా! నాన్నా!
నీవుగూడా అమ్మదగ్గఱకిపోతే నీబిడ్డకి దిక్కెవరు నాన్నా!

[పోలీసులు సంకెళ్ళువేసి కవిని, ఉరిశిక్షకి తీసుకుని పోతూ
ప్రవేశింతురు]

పోలీ—ఏమిటి? నిలబడి చూస్తారా? పదండి త్వరగా.

నిరం—తండ్రీ! నా బిడ్డని ఒక్కమాటు చూచుకొని వస్తా.

పోలీ—ఆలస్యం చేయకూడదు మాకు మాటొస్తుంది.

కళ—(తటాలున వచ్చి కవిని కౌగిలించుకొని) నాన్నా! నన్ను వదలి
పెట్టిపోతావా? నన్నుచూచే దెవరు నాన్నా?

పస్తులతోఁ బరుండినను ప్రాణములన్ దలిదండ్రి డొక్కలో
నిస్తులరాగసౌఖ్యరమణీయత నిల్పెడి నీ కథాకళా
వస్తువు నింక నీవు బలవంతముగా నడియేటఁ ద్రోసి యే
పుస్తకరాజ్యలక్ష్మికయి బోదువు తండ్రి! కసాయిశాలకున్.

నిరం—తల్లీ! ఏడ్వక. మనంత్యాగధనులం, మన జీవితాలు సర్వసౌఖ్యా
లకోసం రాలేదు. కష్టానికి కడుపునిండని కష్టజీవాలకొఱకు
మనం బలికావాలని వచ్చాం. కళా! ఎందు కిట్లా కొండల్నికరి
గిస్తావు? ప్రయోజనం లేదు ఊరుకోకళా! మీ అమ్మచూ
చావా? ఎటువంటి అగ్నిపరీక్షకు నిల్చి ధర్మదేవతకి ముద్దు

బిడ్డెందో. అటువంటిమీఅమ్మని విడిచిపెట్టి మనమెట్లాఉండగలం? అమ్మదగ్గఱకి మనంగూడా పోదాం కళా! మనల్ని కని, కంటికి నిద్రలేకుండా మోసి పెంచుతున్న యీ విశ్వజనని కడగండ్లు తీర్చటానికి చూడు.

ఏ నడిలోగిళ్ళలో నిప్పు కణికలు
ధారచే నింకఁ జల్లార లేదు
ఏ గర్భగోళమ్ములోఁగల పిండాలు
చెదరి భూస్థలి నింకఁ[illegible]జితుక లేదు.
ఏ క్రూర లేహ్యాలు నేటేట గాడ్పులై
తల్లి దిక్కున నింక తగ్గలేదు
ఏ [illegible] లెండిన కోడె ప్రాయపువాండ్రు
బిగిసి ప్రాణా లింక విడువ లేదు
ఏ మహావజ్రకాయమ్ము లీ కసాయి
తీవ్ర ఖడ్గఖండన కింకఁ దెగుట లేదు.
ఏ ప్రతిధ్వనిచేత మహాప్రతిజ్ఞ
నిద్రఁ బట్టనీయుట లేదు రుద్రభువిఁ.

పోలి.—(లాగుతూ) బాగావున్నై. మీ వుపన్యాసాలు ఉపదేశాలు పదపదా నీకే చెప్పేది. ఓహో (లాగును)

నిరం—తండ్రీ మీగ్గెనా కాస్త కనికరించండి. ఇంకా ఈ జన్మకి నా తల్లిని, నా చిన్నారి తల్లిని చూచుకోట మిదే తండ్రీ!

పోలీ—వల్లకాదు పదా (లాగు).

నిరం—ఎన్ని కష్టాలు పడుచున్న నిన్ను జూచి
మఱచుచుంటిమి కష్టాలమాట బిడ్డ
పట్టుబడ్డ యీయురిశిక్ష బాధగూడ
మఱచుటకు ముద్దు పెట్టొక మాటుతనయ.

పోలీ—నీకే చెప్పేది. అవతల రైలువెళ్లైంది. పదా. (లాగు)

నిరం—ఓధర్మదేవతలారా! ఓధర్మశాస్త్రపురాణ దంపతులారా! నేడేమైనా మీలో జాలి వుండినట్లైతే నాచిన్నారి కళని కాపాడండి ఓసరస్సులారా! ఓమహాయశస్సులారా! మీరైనా నాబిడ్డని కనికరించి కాపాడండి తల్లీ. కళా! ఇంకా నీతండ్రి, నీ నిరంకుశకవి జనకుడు ఈ ఉరి స్తంభానికెక్కి విశ్వజనని పాదాలకి వీరపూజలు చేయ పోతున్నాము తల్లీ కళా! ఏదీ నీవరాల చిఱునవ్వుమోము.

పోలీ—(రాగి) చాల్లే పదా (తీసికొనిపోవును)

కళ—నాన్నా! నాన్నా! మానాన్న నింకా చూపించరా? ఓప్రభుపుంగవులారా! మానాన్నను మీరు చూపించరా? ఓరీ! కిరాతదైవమా! ఓరీ! కసాయిదైవమా! మానాన్నను నీవు గూడా విడిపించలేవా? అయ్యో! నాన్నా నాన్నా (పడిపోవును)

కోటి—ఎంత పాపిష్టికాలం వచ్చిపడ్డదిరా కొడకా! నాకొడకా! ఎన్ని కష్టాలుపడి పెంచానురా కొడకా! ఇంకా నాకు దిక్కెవరురో కొడకా! కొడకా! (పడివుండును)

[పోలీసులు సంకెళ్ళువేసి సుందర్రావుని వురిశిక్షకి తీసికొనిపోతూ ప్రవేశింతురు]

పోలీ—ఏమిటీ చూస్తావు నడవక.

సుంధ—ఇక్కడ నాతల్లి పడివున్నది. ఒకమాటు చూచివస్తా సోదరా.

పోలీ—త్వరగా చూచిరా! రైలువేళ్ళింది.

సుంద—(కోటిదగ్గఱ కొచ్చి) అమ్మా! అమ్మా! (లేపును)

కోటి—(లేచి కౌగిలించుకొని) కొడకా! నాకొడకా! నన్నొదిలిపెట్టి పోతుండవంట్రా కొడకా! నాకొడకా! నీయమ్మకి దిక్కెవరుండార్రో కొడకా!

సుంద—అమ్మా! ఏడ్వక, ఏడిస్తే కష్టాలుపోతయ్యా అమ్మా! పస్తులు పడుకొని పరులపంచలో పాచిపనులుచేసికొని యింతకొడుకుని చేసికొని, యిటువంటి కష్టకాలంలో పడివున్న యీలోకానికి

బలియిచ్చుకొని, యిట్లా యీనడివీధిలో పడివున్నతల్లీ! ఇంకా నీకంటే వీరమాత లెవరు? అమ్మా! చూడు. ఎన్ని కొంపలు ఆకలిమంటలో తగల బడుతున్నయ్యో! అమ్మా! ఈ అగ్గి దుమారాలకి, ఈ పెద్దగాలి దెబ్బలికి దిక్కూ మొక్కూ లేక, నిలవలేక, ఎట్లా నిలువునా కూలి పోతున్నాయ్యో జూడు! ప్రళయకాలఘోరాలు లేచి మహాభయంకర సాగరాలు, పొంగినై, అమ్మా! చూడింకా.

ఆ కుటీరముమీద ఆకు లన్నియు లేచి
నడివీధుల శరణుపడదొడంగ
ఆ కొంపపై నుండు కాకివాసము లన్ని
కల్లాడి దిక్కు లేనట్లు జారె
ఆ గుడిసె నడిమిభాగవు నిట్టాడి
జాలి యెక్కడ టంచుం నేల గూలె
ఆ వల్లకాడయినట్టియింటి నలువై
పులగోడలు మసీనులుగ నుండె
ప్రళయకాల బీభత్సముద్ర పరివేష్టి
తప్రభంజనా ఖండ దోర్దండపుష్టి
పై విజృంభించు తామ దేవతకు తుదకు
కూలి కొంపలో గోల కాంబోలు దొరికె.

పోలీ—ఓహో! బాగా సాగించారు. పదింకా. (లాగును)

కోటి—(బిగ్గఱగా) కొడకా! నేనుండలేన్రో కొడకా.

కళ—(లేచి) నాన్నా! నాన్నా! నన్నుగూడా తీసుకుపో.

సుంద—అయ్యో! కళా! మీనాన్న ఉరిస్తంభానికి నాన్న కాం బోయినాడు.

పోలీ—పదవయ్యా, గోలపెడుదువు గానీ. (లాగును)

సుంద—తండ్రీ! ఇంకా కొంచెం సేపు దయ వుంచు వస్తా. కళా!

కోటి—కొడకా! నా కేమీ చెప్పవల్రో కొడకా! (పడిపోవును)

సుంద—కళా! ఈ కష్టకాలంలో మీతండ్రి అమృతసంసారాన్ని నేల పాలు చేసింది నేను. క్షమించు.

కళ—నీవు కాదు. ఈ కష్టకాలం.

సుంద—ఈకష్టం నాలోది గాదా?

కళ—కాదు, మానవసంఘాల్లోది.

సుంద—నిజమేగాని కళా! ఈ మానవ లోకంలో మనవంటి వాళ్ళ ప్రేమారాధన పనికిరాదు. చూచి సహించలేదు. మనమింకా యీ మానవ కళేబరాలు వదలిపెట్టడమే మేలు. కళా! ఇవా ఈ కళాసుందరులు నిర్మలంగా ప్రవహిస్తున్న ఆ సెలయేళ్ళలో బడి చక్కగా మీన కిశోరాలు మాదిరి ప్రేమారాధన చేయటం మంచిది. ఆ అడవులలో బడి ప్రేమారాధనకి పెరగటం మంచిది. కళా! నీవచ్చని జీవితాన్ని నాచక్కని జీవితాన్ని చెల్లు చేమలగా పెంచుకొని, ప్రేమారాధన చేద్దాం, అందులో వున్నది నిర్మల విశాలసౌఖ్యం. ఈమానవ సంఘాలలో లేదు. ఈపాపిష్టి మానవసంఘంలోబడి ఇంత గ్రుడ్డి దేవుళ్ళకి, ఇంత చెవిటి దేవుళ్ళకి బలికావటం కంటే, అడవిమానుగా పుట్టి గొడ్డళ్ళకి బలికావటం మంచిది. చూడు కళా! ఏదేవుడన్నా ఎవరుదేవు డన్నా యీకష్టకాలంలో అడ్డుపడ్డాడేమో? ఎందుకింకా ఇటువంటి జాలిలేని దేవుణ్ణి బలిపించటం? కళా! యీ దేవు డెక్కడ దాక్కున్నాడు.

దేవుఁడు పెండ్లివిందులకు దేవుడుగాని కసాయి కత్తితో
చావులకున్న జీవులకు చచ్చెడి దేవుడా? కట్టిపెట్టు మీ
దేవుని దేవులాట? పడిదేకెడి యీ తమెతక్కులాటతో
దేవుని గష్టకాలమున దించినగాని తరించ రెవ్వరున్.

పోలీ—బాగావున్నై. మీమాటలు, పాటలు కట్టిపెట్టి పదా.

(త్రోసికొని పోవును)

కళ—సుందరా! నానాన్న ధగ్గరికి నన్నుగూడా తీసికొనిపోవా? నాన్నా నాన్నా! ఈకళకి దిక్కేలేదా? నాన్నా! నాన్నా!

కోటి—కొడకా ! నాకొడుకేడి ? అయ్యో ! నాకొడుకేడి ? కొడకా !
(పడిపోవును)

[మహాజనాన్ని వెంటపెట్టుకొని వీరగేయం పాడుకొంటూ బడేసాహెబు ప్రవేశం]

కీర్తన

కులాలు మతాలు కూలిపోతేగాని
ప్రళయగోళాలన్ని
పటాపంచలుగావు
సోదరా ॥కు॥

కులాసాలు దిలాసాలు గోలపెడితేగాని
కష్టకాలా లింకా
కాలిపోవుర
సోదరా ॥కు॥

బడే—హారే! హీహాన్యాయం. హింధాఘోరం సేసింధర్యాతా నీకీ జల్మంహెంధూ్యా భాయీ ! హారే హీందగాఖులాల్కీ హీందా మతాల్కీ బాగా ఇసాల్‌పోసి మనిసీని ఖూన్నా మాయల్కీ మార్కీచేసి హెంధా కష్టాఖాలాం డెచ్చిపెట్టారో దేఖోభాయి నాయంసెప్పే హోడ్కీ కష్టం నేసేహాండ్కీ ఖూడూఫడీపో. హింకా నీకీ జల్మంహెందూ్యా భాయీ! మనాకష్టాకాలంమన ప్రభువులే ధెలీఖుండా ఖళ్యామూనీ హెట్లానంపేసీ వీన్కీ లాగేశారో సూడు భాయీ ! థొంగా థొంగా ఘుర్వే మోషం, ఖొంగా ఖొంగారుఘుపాల్ మోషం. ఫనీపాటా లేఖ ధేరాగా ఫొట్టల్కీ ఫట్టెస్తున్నా సోమర్‌ఫోతుల్ వేసం ను. మన్నీసంఘాల్లోంచి హేరీ నర్కార్కీ పట్టే హీ స్తే హీ కష్ట ఖాలం ఖాలీఫోథుంధీ భాయీ !

(నిష్క్రమింతురు)

సమాప్తము